సాహితీ గత వారంలో వచ్చిన పుస్తకాలపై సమీక్షలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 203 పేజీలు: 12వెల: 6.50

శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు 9లో

బెంగాల్ జైళ్లలో ఎఐ: కరడుగట్టిన ఖైదీలపై నిఘా

# వరదలపై అప్రమత్తం

## అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

## ఎరువుల లభ్యత, సరఫరాపై ఢిల్లీ నుంచి సమీక్షించిన సిఎం

## కాకినాడ సమీపంలో గ్యాస్ లీక్‌పై ఆరా

**విజయవాడ, ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అత్యధిక పంటల సాగు ఉన్న జిల్లాల్లో వరద పరిస్థితులపై నిరంతర నిఘా అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వరద అనంతర పరిస్థితులపైన అధికారులు అవగాహనతో వ్యవహరించాలన్నారు.ఎక్కడా ఎరువుల కొరత ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.గోదావరి, కృష్ణా నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ నుంచి సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలతో పాటు ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా తాజా పరిస్థితులపై సీఎం ఆరా తీశారు. రెండు నదులకు వస్తున్న వరద ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించి అధికారులు సీఎంకు వివరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో శ్రీశైలం నుంచి 5.20 లక్షలు, నాగార్జున సాగర్ నుంచి 4.32 లక్షలు, పులిచింత నుంచి 4.07 లక్షలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.53 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గోదావరి నదిలోనూ భారీగానే వరద ప్రవాహాలు వస్తున్నాయని ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని సీఎంకు వివరించారు. గోదావరి వరదల కారణంగా పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం సమస్య వచ్చిన తరువాత స్పందించటం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగానే సన్నద్ధతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం ఖచ్చితమైన సమాచారం ఇచ్చి,తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని చెప్పారు.

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం సమీక్ష చేశారు. ఎరువుల కొరత అనే సమస్య లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సీఎం సూచించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా రాష్ట్ర స్థాయి నుంచి >>2



# కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం >>2



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

## 'సాస్కి'కింద అదనంగా

# రూ.5వేల కోట్లు ఇవ్వండి

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు.ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థికసహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేకమూలధన పెట్టుబడిసహాయం (సాస్కి)పథకం కింద రూ. 2,010కోట్లు లభించాయని తెలిపారు. >>2



# సిపిఐ అగ్రనేత సురవరం ఇక లేరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు22:** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్టీలో తీవ్ర విషాదం నెలకొంది. సిపిఐ అగ్రనేత,మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారని సమాచారం. శుక్రవారం రాత్రి పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. పాలమూరు జిల్లాకు చందిన సుధాకర్‌రెడ్డి 1998,2004లో రెండుసార్లు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎంపికగా ఎన్నికయ్యారు. సీపీఐ అగ్రనాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ జిల్లా నుంచి జాతీయ >>2



శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేష్

## ఇక యేటా డిఎస్సీ

# టీచర్ పోస్టుల భర్తీ

## ప్రభుత్వ విద్యలో గత 14 నెలలుగా పలు సంస్కరణలు

## పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు

## అమరావతిలో యేడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ: మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై టీచర్ పోస్టుల భర్తీకి ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారాలోకేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని దిశానిర్దేశం చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని నొక్కిచెప్పారు. అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యాశా ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని దిశానిర్దేశం చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తు >>2

## భద్రాచలానికి దీటుగా

# ఒంటిమిట్ట రామాలయం

## సిఎం ఆదేశాలతో టిటిడి మాస్టర్ ప్లాన్

## తొలి విడతగారూ.100 కోట్లతో అభివృద్ధి



**రాజంపేట, ఆగస్టు22ప్రభాతవార్త :**ఆంధ్ర అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. తెలంగాణలోని భద్రాచలం కు ధీటుగా ఒంటిమిట్ట రామాలయాన్ని నా భూతో నా భవిష్యత్ అన్న చందంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుసంకల్పించారు. ఒంటమిట్ట శ్రీరామనవమి >>2




## మాజీ డి.సిఎం నారాయణ స్వామిని

# మూడోసారి సిట్ విచారణ!



## ఇప్పటికే రెండు సార్లు వర్చువల్‌గా సాగిన విచారణ

## లిక్కర్ కేసులో కీలక పరిణామం

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సిట్ విచారణ రావాలని ఆదేశించింది.లిక్కరు స్కామ్ కేసులో సిట్ దూకుడు ప్రదర్శింస్తూంది. నిందితులను ఒక్కొక్కరిగా బయటకు లాగుతుంది. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతుంది. గతంలో రాయణ స్వామిని విచారణకు రావాలని సిట్ అధికారులు కోరినట్లు తెలిపారు.లిక్కరు స్కామ్‌కు సంబంధించి ఆయన కీలక సాక్షిగా ఉండారని గతంలో ప్రచారం జరిగింది.ఈ క్రమంలో ఆయన ఆరోగ్య కారణాలతో విచారణకు గైర్హాజరు కాలేనని చెప్పడంతో వర్చువల్‌గా సిట్ విచారినట్లు సమాచారం. ఇక శుక్రవారం నారాయణ స్వామిని సిట్ మరో పర్యాయం ఆయన ఇంట్లోనే వర్చువల్‌గా విచారించింది.దాదాపు ఆయన ఆరుగుంటల పాటు విచారించిన సిట్ నారాయణస్వామిని మరోసారి విజయవాడలో విచారిస్తామని తెలిపి నట్లు సమాచారం,అయితే తాజా విచారణ తరువాత ఆయనను అదుపులోకి తీసుకొనే >>2

## హైకోర్టుకు

# 8 మంది ఎజిపిలు

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** హైకోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఎజిపి)గా 8మందిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసన వ్యవహారాలు, న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సహాయ ప్రభుత్వన్యాయవాదులుగా చల్లా శ్రీనివాస్, కె.ఉజ్వలదేవి, బి.సమీరా, >>2

# నెలకు రూ.400కే ఫైబర్ టివి బేసిక్ ప్లాన్

## సిజిఎం శేషాచలం వెల్లడి

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలోనూ బీఎస్ఎన్ఎల్ సేవల్ని విస్తరిస్తామని,దీనికి గాను త్వరలో టవర్లు ఏర్పాటు చేస్తామని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం తెలిపారు. వినియోగదారుల కోసం ఏపీ సర్కిల్‌లో నెలకు రూ.400లకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ తెచ్చామని, ఇందులో ఇంటర్నెట్,టీవీ,ఫోన్ సదుపాయాల్ని కల్పిస్తున్నామని వివరించారు. రాబోయే మూడు నెలల్లో 5జీ సేవల్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేయనున్నట్లు వెల్లడించారు.విజయవాడ లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఈ ప్లాన్‌లో ఈటీవీ సహా 400కు పైగా ఛానళ్ళు,తొమ్మిదికి పైగా ఓటీటీలు ఉంటాయి. దేశ వ్యాప్తంగా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ వేగం అందిస్తున్నాం. >>2

23-8pg2exHMNWJQE 2nd_23-8pg2exHMNWJQE.qxd 8/23/2025 12:35 AM Page 1



## చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** మెగాస్టార్ చిరంజీవికి సిఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.సినిమా, దాతృత్వంలో ఆయన అద్భుత ప్రయాణం లక్షల మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. సేవ,అంకితభావంతో ఇంకా ఎందరో జీవితాలను ప్రభావితం చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆరోగ్యం,ఆనందాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## మట్టి మహా గణపతి!

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని విదత్యాధరపురం బస్ డిపో పక్కన 72అడుగుల మహా గణపతి రూపుదిద్దుకుంటున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద గణపతి విగ్రహాల్లో ఒకటైన ఈ ప్రతిమను పూర్తిగా పర్యావరణ హితంగా తయారుచేస్తున్నారు. మట్టితో చేసి, సహజ సిద్ద రంగులతో అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సింహాసనంపై కూర్చొని వరాలందిస్తున్న ఈ కార్యసిద్ధి మహాశక్తి గణపతికి రెండు వైపులా నగరేశ్వరస్వామి,వాసవీ కన్యకాపరమేశ్వరీ విగ్రహాలను రూపొందిస్తున్నారు. 40మంది కళాకారులు2నెలలుగా తయారీలో నిమగ్నమయ్యారు.

## గోదావరి-కావేరి అనుసంధానంపై ఆరో విడత సంప్రదింపులు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై జాతీయ నీటి అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఆరో విడత సంప్రదింపుల సమావేశం ప్రారంభమైంది. కేంద్ర జలసంఘం చైర్మన్ అతుల్‌జైన్ నేతృత్వంలో జలసౌధలో జరుగుతున్న ఈ భేటీకి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. గోదావరి జిల్లాల్లో చత్తీస్ఘడ్‌కు కేటాయించిన 145 టిఎంసీల నీటికి కావేరికి అనుసంధానించాలన్నది ప్రతిపాదన. ఇందు కోసం ఇచ్ఛంపల్లి వద్ద ఆనకట్ట నిర్మించి అక్కడి నుంచి గోదావరి నీటిని కావేరికి మళ్ళించాలని భావిస్తున్నారు.దీని కోసం అన్ని భాగస్వామ్య రాష్ట్రాలతో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్ళే ప్రక్రియ గత కొంత కాలంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగానే ఇవాళ ఆరో విడత సంప్రదింపులు జరుగుతున్నాయి.

# వరదలపై అప్రమత్తం

>> క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్య లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాల తిప్ప సమీపంలో సముద్రంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటన పైనా సీఎం అధికారులతో మాట్లాడారు. రాత్రి 1.30 గంటకు గ్యాస్ లీక్ తో మంటలు భారీగా ఎగిసిపడ్డాయని గంటన్నర వ్యవధిలోనే గ్యాస్ సరఫరా నిలిపివేసి లీక్ ను అరికట్టారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. లీక్ అయిన పైప్ ను మొత్తం తనిఖీ చేసి సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికా రులను ఆదేశించారు.

**అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దుకాదు:** అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దుకాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పెన్షన్ పొందుతున్నవారిపై ఇటీవల జరిపిన పునఃపరిశీలన వివరాలను పరిశీలించమని అధికారులను ఆదేశించామన్నారు. ఈ ప్రక్రియలో అనర్హులను గుర్తించినట్టు, అన్నివిధాలా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి ఎలాంటి వైకల్యం లేకుండానే కొంతమంది పెన్షన్ పొందుతున్నట్టు పరిశీలనలో తేలిందని తెలిపారు. అనర్హులైన పెన్షన్ల ధృవీకరించడానికి ప్రత్యేక వైద్య బృందాలను నియమించి నిర్ధారించినట్టు వెల్లడించారు. అయితే నకిలీ పెన్షన్లను మాత్రమే తొలిగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛనుదారుకు పెన్షన్ రద్దు కాకూడదని సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని, దివ్యాంగులు ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సి న పనిలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పెన్షన్, హెల్త్ పెన్షన్ పొందేవారికి కూడా ఎప్పటిలా నెలనెలా పింఛన్ అందించాలని స్పష్టం చేశారు. వారికి పం పించిన నోటీసులు సైతం వెనక్కి తీసుకోవాలని సీఎం చెప్పారు.

# రూ.5వేల కోట్లు ఇవ్వండి

>> రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే 202425 ఆర్థిక సంవత్స రానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ స్పార్)'ప్రోత్సా హక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి...ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారుఏపీ సమగ్రాభివృద్ధిలో కేంద్రం కీలక భాగస్వామ్యం వహించాలని కోరారు.అమరావతి,పోలవరం సకాలంలో పూర్తి చేయడానికి నిధులు విడుదల్లో జాప్యం లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేసారు.రాష్ట్ర విభజన అనంతర పెండింగ్ నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు.మిషన్ పూర్వోదయ" పథకం ద్వారా ఈశాన్య ప్రాంత ఆర్థికాభివృద్ధి కోసం కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఈ పథకం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ తో పాటు, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో పారిశ్రామికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయం చేస్తుంది. "వికసిత్ భారత్" లో భాగంగా అంతగా అభివృద్ధి సాధించని రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం చేయాలని"మిషన్ పూర్వోదయ" పథకాన్ని కేంద్ర ప్రారంభించింది ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ఆర్థికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు.

సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన నాయుడు,డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్,టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవ రాయలు,రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌శవ్ పాల్గొన్నారు.ఇక నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు ఏపీ ప్రభుత్వ పక్షాన సముచిత రీతిన సత్కరించి,జ్ఞాపికను అందజేసారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రులు, ఎంపిలు

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌తో సిఎం చంద్రబాబు భేటీ
### మర్యాద పూర్వకంగా కలిసిన సిఎం

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి నేతలందరి సహకారంతోనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించామని స్పష్టం చేశారు. రాధాకృష్ణన్‌తో ఎప్పటి నుంచో తనకు పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతును తెలియజేశానని పేర్కొన్నారు. దేశంలో గౌరవించదగ్గ వ్యక్తి, అత్యున్నత స్థానానికి మంచి అభ్యర్థి, దేశానికి గౌరవం తీసుకొస్తారని సీఎం చంద్రబాబు చెప్పారు. సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి కుర్చీకి ప్రతిష్ట పెంచుతారని అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. తనకు రాజకీయాలు ముఖ్యం కాదని, తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏ కూటమితో పొత్తులో ఉందని ఉద్ఘాటించారు. ఒకసారి ఎన్డీఏ అభ్యర్థి పెట్టిన తర్వాత ఓడిపోతామనే తెలిసి ఇండియా కూటమి మళ్లీ అభ్యర్థిని పెట్టడం ఎందుకు? అని ప్రశ్నించారు సీఎం చంద్రబాబు. గెలిచే పరిస్థితి ఉన్నప్పుడు తెలుగువారిని పెట్టుకోవాలని సూచించారు. గతంలో పీవీ నరసింహారావుకు నాటి సందర్భంలో తెలుగువారు అనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో ఉన్న తెలుగుదేశం మద్దతు తెలిపిందని స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఎన్డీఏ కూటములేనన్నారు.అలాంటి సందర్భంలో మద్దతు ఆశించడం. మాట్లాడటం సరికాదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మూడోసారి సిట్ విచారణ!

>> అవకాశం ఉందని కథనం ప్రచారంలోకి వచ్చింది. ఎందుకనో సిట్ ఆయనను వర్చువల్ గానే విచారించింది.ఈ క్రమంలో ఎక్సైజ్ పాలసీలో మార్పుల వెనుక ఉన్నవారి పాత్రపై సిట్ విచారణ చేయనున్న అధికారులు. లిక్కర్ పాలసీ ఆమోదానికి సంబంధించి ఆరా తీయనున్నట్లు సమాచారం. కాగా, లిక్కర్ కేసులో నారాయణ స్వామి పాత్ర కూడా కీలకమని సిట్ అధికారులు భావిస్తున్నారు.లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి చెందిన మరిన్ని విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.ఈ కేసులో కెసిరెడ్డి సహా పలువురు నిందితులు, పలు సంస్థలకు చెందిన రూ.62 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోల ద్వారా ఇప్పటికే అనుమతులు ఇచ్చింది.మరో రూ.13 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం అమ్మకాలతో వచ్చిన ముడుపుల ద్వారా పలు చోట్ల తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కొనుగోలు చేసినట్టు సీఐడీ విచారణలో తేలింది. వీటిని సీజ్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరడంతో అనుమతి మంజూరు చేసింది. కేసిరెడ్డి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

# ఇక యేటా టీచర్ పోస్టుల భర్తీ

>> న్నామని నొక్కిచెప్పారు. అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ (శుక్రవారం ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీ చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించామని వ్యాఖ్యానించారు అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. సంస్కరణల అంతిమ లక్ష్య అభ్యసన ఫలితాలేనని తెలిపారు. అసర్ నివేదిక ప్రకారం ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) ప్రోగ్రామ్ అమల్లో జాతీయస్థాయిలో ఏపీ 14వ స్థానంలో ఉందని ఉద్ఘాటించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని మెరుగైన ర్యాంక్ సాధించేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. దేశంలోనే తొలిసారిగా ప్రతి బిడ్డకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ఒక హక్కుగా ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. తల్లికి వందనం చివరి దశ నిధులను విడుదల చేశామని ప్రకటించారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేశామని గుర్తుచేశారు. చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ. 325కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 2024-2025 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ మార్గనిర్దేశం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలి. ఆసక్తిగల తమ గ్రామాల్లోని స్కూళ్లను దత్తత తీసుకునేలా ఆయా స్కూళ్లకు అవసరమైన మౌలికసదుపాయాలతో ప్రత్యేకమైన వెబ్ సైట్ రూపొందించాలి. జాతీయస్థాయిలో పేరెన్నికగన్న కార్పొరేట్ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలి. రాష్ట్రంలోని అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప చిత్తూరులలో ఆధునీకరించిన సైన్స్ సెంటర్లను త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దండి. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 125 ఆటిజం సెంటర్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, ఏడాదిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. దేశంలోనే అత్యుత్తమ మోడల్ తో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపట్టాలి. 2లక్షల చదరపు అడుగుల్లో డిజైన్ చేస్తున్న ఈ లైబ్రరీ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోండి. విశాఖపట్నం జగదాంబ సెంటర్‌లో ప్రతిపాదించిన రీజనల్ లైబ్రరీని 50వేల అడుగుల్లో నిర్మించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల బలోపేతానికి చేపట్టాల్సి న చర్యలపై మంత్రి లోకేష్ చర్చించారు. స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.213 కోట్ల రూపాయల మేర సెస్సు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. వాటిని రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి సిఎన్ దీవెన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరక్టర్ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి నారా లోకేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టల్ డెమోను మంత్రి లోకేష్ పరిశీలించారు.దేశానికే రోల్ మోడల్‌గా నైపుణ్యం పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఏడాదికి 50వేలమంది యువతకు నైపుణ్య శిక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌తో నైపుణ్యం పోర్టల్ అనుసంధానం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

## భద్రాచలానికి దీటుగా ఒంటిమిట్ట రామాలయం

>> బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన సీతారాముల కళ్యాణం లో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధిని ఎవరు ఊహించని విధంగా చేపడతామని సీఎం ప్రకటించారు. అందులో భాగంగా గత నెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికి మాస్టర్ సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు దేశంలోనే మూడు మూడు ప్రఖ్యాత సంస్థల్లో ఒకటైన దానికి అప్పగించారు. ఈ మేరకు టీటీడీ ప్లానింగ్ అధికారి రాముడు ఆధ్వర్యంలో నిపుణుల బృందం శుక్రవారం ఒంటిమిట్ట రామాలయాన్ని పరిశీలించింది. రామాలయ పరిసరాలను పరిశీలించారు. అభివృద్ధి చేపట్టేందుకు తీసుకోవాల్సి న చర్యలపై క్షుణ్ణంగా శోధించారు. అంతేకాకుండా రామాలయం నాలుగు వైపులా అభివృద్ధి చేసేందుకు కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం తూర్పు వైపు ఉన్న కోదండ రామాలయాన్ని పడమటి వైపున ఉన్న సీతారాముల శాశ్వత కళ్యాణ వేదిక వరకు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. దక్షం వైపున ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధికి టెంకాయ చిప్పతో చేతబట్టి నిధులను సమీకరించి అభివృద్ధి చేసిన ఆంధ్ర వాల్మీకి వావిలకొలను సుబ్బారావు కొండను అభివృద్ధి చేస్తారు .అందులో భాగంగా గ్రీనరీ పెంపొందిస్తారు. కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే ఆలయం, పక్కనే ఉన్న ఒంటిమిట్ట చెరువులో బోటింగ్ తో పాటు జాంబవంతుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ముఖ్యంగా పడమటి వైపున ఉన్న సీతారాముల కళ్యాణ వేదిక నుంచి ఒంటిమిట్ట రామాలయం కనిపించేలా మాస్టర్ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా జాతీయ రహదారిని కూడా అభివృద్ధి చేసే ఆలోచన ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శాశ్వత అన్నదాన క్యూ కాంప్లెక్స్, అన్నదాన కేంద్రం, రామాలయం తూర్పు వైపున ఉన్న కొండలను పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించేలా చూడాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కనీసం 7 లేక 8 డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించే స్థాయిలో పచ్చదనం పెంపొందించాలని టిటిడి భావిస్తోంది. ఉత్తరం వైపున ఉన్న నాగేటి తిప్పను కూడా అభివృద్ధి చేసేందుకు అక్కడ ఏమేమి అభివృద్ధి పనులు చేపట్టాలో చూస్తున్నారు. ఒంటిమిట్ట రామాలయాన్ని టిటిడి కిడ్నీలో విలీనం చేసిన తర్వాత నాడు చంద్రబాబు నాయుడు 100 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 100 కోట్ల నిధులతో చేపటాల్సి న ముఖ్యమైన పనులలో తూర్పు వైపున శ్రీరామ్ ప్రాజెక్టును రామాయణ చరిత్ర కళ్ళకు కట్టినట్లు పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేయాలని నాడు నిర్ణయించారు. అయితే పరిశీలన దశలోనే ఈ ప్రాజెక్టు ఉండిపోయింది. తాజాగా మాస్టర్ ప్లాన్ లో ఈ పనులను చేపట్టే అవకాశం కనిపిస్తోంది. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన తర్వాత విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని టిటిడి యోచిస్తోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెద్ద ఎత్తున యాత్రికులకోసం ఓ పెద్ద సముదాయాన్ని నిర్మించాలని భావిస్తున్నారు. అంతేకాకుండా సిబ్బందికికూడా గృహ సముదాయాన్ని నిర్మించే ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన తర్వాత మొదటి విడతలోనే కనీసం 100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సీఎం ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్ బివిఆర్ నాయుడు ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రత్యేకంగా చొరవ చూపుతున్నట్లు సమాచారం. దీంతో టిటిడి అధికార యంత్రాంగంలో ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోంది. దీన్ని బట్టి చూస్తే దక్షిణ భారతదేశంలోనే ఒంటిమిట్ట రామాలయం ఒకప్రముఖ పుణ్యక్షేత్రంగా త్వరలోనే అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఇంటికి చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** పసి పిల్లలతో గడపటంలో ఎంతో సంతృప్తిని కల్పిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు.పిల్లలతో ఆడితే అదో ఉపశమన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. రామ్మోహన్ నాయుడు దంపతులకు ఇటీవల జన్మించిన బాబుకు దీవెనలు అందించారు. రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.

## అవినీతి వ్యతిరేక చర్యలపై ఇంత వ్యతిరేకతా?
### ఆర్జేడి, కాంగ్రెస్ నేతలు ఉంటే జైలు, లేకుంటే బెయిలు: ప్రధాని మోడీ విమర్శ

పాట్నా, ఆగస్టు 22: తప్పు చేస్తే సిఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జెడీ, కాంగ్రెస్ నేతలతు ఉంటే జైల్లో, లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోడీ ప్రశ్నించారు. బీహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగులుతాం? అని మోడీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎన్డీఎ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్రమంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవి కోల్పోతారు.

## కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

>> చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటిని తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది.

## యాదాద్రి విద్యుత్ కేంద్రం జనవరి 15కు జాతికి అంకితం: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అంతేకాకుండా దేశంలోనే ఉత్తమ గ్రీన్ పవర్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులైన 500 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే ఇవ్వగా దాదాపు రెండు సంవత్స రాల పాటు యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేలకోట్ల పెట్టుబడి తో ప్రారంభించిన ఈ యూనిట్ ఒక్కరోజు ఆలస్యమైన నేపథ్యంలో ఆర్థిక భారం తీవ్రంగా రాష్ట్ర ప్రజలపై పడిందని చెప్పారు. గత ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిపించి పర్యావరణ అనుమతులను వెంటనే తీసుకువచ్చామని వివరించారు. అప్పటి నుండి ఈ పవర్ ప్లాంట్ పనులను పర్యవేక్షణ చేస్తూ, ప్రతి వారం ప్రాజెక్టులో పూర్తి చేయాల్సి న పనులకు క్యాలెండర్ నిర్దేశించి ఆ మేరకు ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. వీటితోపాటు పవర్‌ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే లైన్, కార్మికులు అధికారులు ఉండేందుకు టౌన్షిప్‌ఏర్పాటును సకాలంలో పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా పవర్ ప్లాంట్ పరిసరాల్లోని గ్రామాల్లో ప్రపంచ స్థాయివిద్యను,కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్ పరిసరాలలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

## వారం - వర్జ్యం

23-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు,
అమావాస్య, ఉ.11.39
మఖ రా.12.57
వర్జ్యం : ఉ.9.20-11.01
దు.తె.5.54-7.32
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. నూతన వస్తులాభం.

**వృషభం :** నూతన విద్య ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కర్కాటకం :** దూరప్రాంతాలనుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివాదాలు కొంతవరకు పరిష్కారమవుతాయి.

**తుల :** ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. ఆరోగ్యం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:** పరిశోధనలు, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**ధనుస్సు:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తను పటించండి.

**మకరం:** సంతాన విద్యా విషయాలపట్ల శ్రద్ధ కనబరుస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కుంభం:** మిత్రుల సహాయంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తిచేస్తారు.

**మీనం :** ఇంటాబయటా అనుకూల స్థితి ఉంటుంది. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 8 మంది ఎజిపిలు

>> పి.గణేష్, ఆర్.మల్లికార్జునరావు, యు.లోవరాజు, జి.నవీన్, ఐ.సాయిగోపి మనోజ్ కృష్ణలను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఈ బాధ్యతల్లో 3 ఏళ్లపాటు కొనసాగనున్నారు, కన్వీనియన్స్ అలవెన్స్‌తో కూడిన గౌరవ వేతనం నెలకు రూ.44 వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

## 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీ అధికారులకు ఐపిఎస్‌లుగా పదోన్నతి

**విజయవాడ, ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పోలీసు సర్వీసుకు చెందిన 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు కన్ఫర్డ్ ఐపీఎస్లుగా పదోన్నతి లభించింది. బి.లక్ష్మీనారాయణ, కె. ఈశ్వరరావు, కె.చౌడేశ్వరి, ఇ.సుప్రజ, కేవీ శ్రీనివాసరావు, కె.లావణ్యలక్ష్మి,ఎ.సురేష్బాబు,డి.హిమావతి, కె.లతామాధురి, పి.వెంకటరత్నం, కె.కృష్ణ ప్రసన్న,ఎం.సత్తిబాబు, కరీముల్లా షరీఫ్, పి.శ్రీనివాస్‌లు పదోన్నతిపొందిన వారిలో ఉన్నారు.

## నెలకు రూ.400కే ఫైబర్ టివి బేసిక్ ప్లాన్

>> దీని కోసం ఆన్‌లైన్ విధానం,సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సర్వీస్ సెంటర్లను సంప్రదించచ్చు. బీఎస్ఎన్ఎల్ఎఫ్ టీటీహెచ్ వినియోగదారులు కేవలం రూ.140 చెల్లించి ఈ సేవలు పొందవచ్చు. లెటిక్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్ టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్టనర్లుగా(టీఐపీ) నమోదు చేసుకోవచ్చు. దీని గురించి అవగాహన కల్పించేందుకు మేళాలు నిర్వహిస్తాం' అని శేషాచలం వివరించారు. ఇటీవల ప్రకటించిన ఫ్రీడం ప్లాన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని,వినియోగదారుల సంఖ్య 3 రెట్లు పెరిగిందని తెలిపారు. అంత్యోదయ మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1380 4జీ టవర్లను అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్లు బుంగ రవికుమార్, ఎల్.శ్రీను,జిఎంలు మురళీకృష్ణ,వెంకటప్రసాద్‌లు పాల్గొన్నారు.

## సిపిఐ అగ్రనేత సురవరం ఇక లేరు

>> స్థాయి నేతగా ఎదిగారు. సురవరం సుధాకర్ రెడ్డి కొండ్రవుపల్లి అనే మారుమూల పల్లెలో జన్మించి సీపీఐ పార్టీలో జాతీయ స్థాయి నేత గా ఎదిగారని, వారు ఎన్నో ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేశారు.



# విఘ్నేశ్వరుని పండగకు సిద్ధమౌతున్న దక్షిణ కైలాసం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త):** శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకుసిద్ధమౌతుంది. కొన్ని సంవత్సరాలుగా యువత రంగంలో దిగింది. ఏర్పాట్లలో యువకులు చురుగ్గా చందాలు వసూలు చేసుకూంటూ ఏర్పాట్లలో తలమునలకయ్యారు. పరిచయాలున్న చోట్లల్లా వసూలు చేసుకుంటున్నారు. అయితే విఘ్నేశ్వరుని పండగకు ఈ ఏడాది రెవెన్యూ, పోలీసు అధికారులు ఎనలేని నిబంధనలను ప్రకటించారు. విగ్రహం 12 అడుగుల దాటరాదని ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎన్ని రోజులు ప్రతిష్టిస్తారు? ఎన్ని రోజులకు నిమజ్జనం చేస్తారు? అనే వివరాలు ఇవ్వాలి. వినాయకుని పండగకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ ఏడాది శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో అతి పెద్ద విగ్రహం ఏర్పాటు చేయుటకు సన్నాహాల చేస్తున్నారు. నిబంధనలతో నిర్వాహాకులు సందిగ్దంలో ఉన్నారు. గతంలో పలుమార్లు దేవస్తానమే చవితి సంబరాలు నిర్వహిస్తుందని ప్రకటించిన ప్రకటనలు ఏమయ్యాయో? మళ్ళీ అ ఏడాది ఆర్‌డిలో దేవస్థానం అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేస్తారని ప్రకటించారు. 2014లో ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడ్డ తెలుగుదేశం ప్రభుత్వంలో ఇక మీదట దేవస్థానమే వినాయక చవితి సంబరాల్ని అధికారికంగా నిర్వహించాలని మంత్రి హోదాలో అప్పటి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రకటించారు. అప్పటి చైరర్మెన్ కూడా ఈ ప్రతిపాదనను అమలు చేయాలని పట్టుబట్టారు. కొంత కాలం ధర్మకర్తల మండలి కూడా ఉంది కానీ ఈ ప్రతిపాదనలు ఏమయ్యాయే ముక్కంటీశునికే ఎరుక. వారి పరిపాలన ముగిసింది. కొత్త పాలకులు మాత్రం ఉత్సవాల జోలికి పోలేదు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అంతేకాక పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో దేవస్థానమే నెల నెలా ఒక్కొక్క ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ పండగలకు సంబంధించి ఈ తరం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత 20 సంవత్సరాలుగా వినాయకచవితి సంబరాల్ని హైదరాబాదును మరిపించే విధంగా నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం, పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటిలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. చవితి సంబరాలు 9 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అయితే కొంత కాలం జోరు తగ్గింది. 9 రోజులకే పరిమితమైంది. అంతేకాక పట్టణంలోని సుమారు 400 చోట్ల వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు, ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది. ఈ ఏడాది ప్రధానంగా బేరి వారి మండపం వద్ద వినాయక చవితి సంబరాలను బిజెపి నాయకుడు కోలా ఆనంద్, తెలుగుదేశం నాయకుడు దుర్గాప్రసాద్‌ల సారధ్యంలో, పెండ్లిమండపం వద్ద చవితి సంబరాలను కైకాల వారి సంఘం అధ్యక్షుడు ఒబ్బుమధుసూధన్ సారధ్యంలో నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

## సీమలో మరో రెండు కీలక సెక్షన్‌లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 22,ప్రభాతవార్త** రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఆటోమేటిక్ సిగ్నల్(ఎబిఎస్) వ్యవస్థను రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో మరో రెండు కీలక సెక్షన్‌లలో తెచ్చేందుకు సంబంధిత ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సుమారు రూ.750కోట్ల అంచనా వ్యయంతో 536.57కి.మీల రైలు మార్గాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. భద్రత, సమయ పాలనలను దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వేలోని అత్యధిక కి.మీలను ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఈ రైళ్ల విభాగంలో ఎలాంటి అవరోధం, ఆలస్యం కలుగకుండా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ వ్యవస్థను డబ్లింగ్ రైలు (అప్‌అండ్‌డౌన్)రైలు మార్గాలను ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. గుతకల్లు డివిజన్‌లో రేణిగుంట-గుంతకల్లు-వాడి మార్గం లో పనులను ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా వాడి-గుత్తి-వాడి సెక్షన్‌లో మొలగవల్లి-ఆదోని మధ్య మొత్తంగా 31.25కి.మీలలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను అందు బాటులో తీసుకోరానుంది. ఇందుకు సంబంధించిన నాన్-ఇంటర్లాంకింగ్ సాంకేతిక పనులను 29న చేపట్టి పూర్తి చేసి ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులో తీసుకోరానున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య తిరిగే రైళ్లు సెప్టెంబరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 22,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య నడుపుతున్న ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 5నుండి 28వరకు పొడిగించారు. ఈరైలు ప్రతి శుక్ర, ఆదివారాల్లో బెంగళూరు నుండి రాత్రి 9.15గంటలకు బయలుదేరి మరుసటి రోజు బీదర్ చేరుకుంటుంది.

# భారీ మొత్తంలో గంజాయి పట్టివేత

## - రైల్వే పోలీసులపై ప్రశంసల వెల్లువ




**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** నెల్లూరు రైల్వే పోలీసుల తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత కొంతకాలంగా రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే చెన్నై నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులకు చిక్కారు. ఈ సంఘటన సంబంధించిన వివరాలను నెల్లూరు రైల్వే డిఎస్పి మురళీకృష్ణ శుక్రవారం తన కార్యాలయంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు, గంజాయి రవాణాను నిరోధించే చర్యల్లో భాగంగా రైల్వే పోలీస్ సిబ్బంది తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల్లూరు, గూడూరు కావలి తదితర రైల్వేస్టేషన్లో తరచూ విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు జీఆర్పి సిఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడుతున్న సమయంలో ఒరిస్సా రాష్ట్రం రాయగడ్ నుండి చెన్నై వెళ్లే 18189 రైలు నుండి దిగిన ఒక మహిళ, మరొక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా చెన్నై నగరం ఫిషర్మెన్ పేటకు చెందిన పళని రాజేష్ వద్ద 14.5 కిలోల గంజాయి, అదే ప్రాంతానికి చెందిన జెబునిషా అనే మహిళ వద్ద 8 కిలోల గంజాయిని ప్యాకెట్ల రూపంలో పార్సిల్ చేయబడి ఉండడాన్ని గుర్తించారు. దాని విలువ రూ. 4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ సుధాకర్‌తో పాటు రైల్వే ఎస్సై హరిచందన,

ఆర్పిఎఫ్ ఎస్ఐ శివరావత్, కానిస్టేబుళ్లు జయప్రకాష్, మణికంఠ, కిరణ్ కుమార్ లను ఈగల్ ఐజి రవికృష్ణ, రైల్వే డిఐజి సత్య ఏసుబాబులు ప్రత్యేకంగా అభినందించినట్లు డిఎస్పి తెలిపారు.

# ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

## సెంట్రల్ జైలు బయట బారికేడ్ల వ్యవహారం దారుణం

## నా కుమారుడి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్ట్ 22 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అభూతకల్పనలతో కూడిన లిక్కర్ స్కాం వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, పుంగ నూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక సెంట్రల్ జైలులో లిక్కర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న తన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.విఠల్ రెడ్డి, రాజారెడ్డిలు ములాఖత్ లో భాగంగా శుక్రవారం ఉదయం కలసి మాట్లాడారు. అనంతరం జైలు బయట రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు తమ ప్రభుత్వ హయాంలో సెంట్రల్ జైలులో ఉన్నపుడు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని, జైలు బయట కూడా మీడియాతో సహా స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండేద న్నారు. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయన్నారు. జైలు దరిదాపుల్లోకి కూడా మీడియాను రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం విస్మరిస్తూ మిథున్ రెడ్డికి జైలులో సౌకర్యాలు కల్పించడంలో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తున్న తీరును తెలియజేస్తామన్నారు. ఇప్పుడు ప్రవర్తిస్తున్న తీరుకు భవిష్యత్తులో తప్పనిసరిగా ప్రతిఫలం తీసుకోక తప్పదన్నారు. ములాఖత్ కు వస్తే అనేక ఇబ్బందులు కలుగజేస్తూ ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర వైసీపీ అధ్యక్షులు మార్గాని భరత్, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల వైసీపీ కో ఆర్డినేటర్లు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయుడు, యువ నాయకులు జక్కంపూడి గణేష్, మార్తి లక్ష్మి ్మ, కానుబోయిన సాగర్, న్యాయవాది సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, ఆగస్టు22, ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగుజాతికి కళామతల్లి అందించిన ముద్దుబిడ్డ చిరంజీవి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన నటన, డ్యాన్స్, ఫైట్స్, మ్యానరిజంతో తెలుగు తెరకు కమర్షియల్ సినిమాల అర్థం చెప్పిన హీరో, కమర్షియల్ సక్సెస్ ల మధ్య నటనా ప్రావీణ్యాన్ని చూపించిన నటుడు చిరంజీవి అని అన్నారు. ఎన్నో కష్టాలు, సవాళ్లు, అవమానాలను తట్టుకొని స్వయంకృషితో సినీవినీలాకాశంలో మెగాస్టార్ గా ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. అకుంఠిత దీక్షతో ప్రతి అవకాశాన్ని పట్టువిడవకుండా అందిపుచ్చుకొని నటనలో శిఖరాగ్రాన్ని అధిరోహించిన వ్యక్తి చిరంజీవి అన్నారు.

**చిరంజీవికి బిజెపి ఎపి చీఫ్‌మాధవ్ అభినందనలు**

మెగాస్టార్ చిరంజీవికి ఆయన జన్మదినం సందర్భంగా బిజేపీ ఏపీ చీఫ్‌మాధవ్ అభినందనలు తెలిపారు. స్వయం కృషితో చిరంజీవి చలనచిత్ర జీవితంలో అద్భుత ఫలితాలను సాధించారన్నారు. రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాలతో ఆయన సామాజిక సేవలో అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు.

## బుడమేరుపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

### ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, ఆగస్ట 22,ప్రభాతవార్త ప్రతినిధి:** బుడమేరు పొంగుతుందని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఏ బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం కండ్రిక వద్ద నుంచి గుణదల 33 తూముల వరకు బుడమేరు, కాలువలను అధికారులతో లకలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...గత వర్షాకాలంలో బుడమేరు కాలువల్లోకి ఎగువ ప్రాంతాల నుంచి క్కొసారిగా భారీగా వరద నీరు వచ్చి చేరడంతో సింగ్‌నగర్ ప్రాంతం వరద ముప్పును ఎదుర్కొన్న సంగతి తెలిసిందే అని అన్నారు

# బిజెపి రాష్ట్ర నూతన కార్యవర్గం ప్రకటన

## - పార్టీ కీలక నేతలకు ప్రాధాన్యతతో కూడిన పదవులు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ బిజెపి రాష్ట్ర నూతన కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. కార్యవర్గంలో పార్టీ కీలక నేతలందరికి ప్రాధాన్యతతో కూడిన పదవులు అప్పగించారు .దాదాపు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కీలక నేతలకు నూతన కార్యవర్గంలో చోటు దక్కింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బిట్ర శివన్నారాయణ,( గుంటూరు) గారపాటి సీతారామాంజనేయ చౌదరి,( ఏలూరు) కాపు రామచంద్రారెడ్డి, (అనంతపురం) పుట్టేటి సురేందర్ రెడ్డి,(నెల్లూరు ) పైడి వేణు గోపాలం,( శ్రీకాకుళం) శ్రీ.కోలా ఆనంద్( తిరుపతి), బొల్లిన నిర్మలా కిషోర్ ( ఏలూరు), గుడిసె దేవానంద్, (శ్రీ సత్యసాయి) డాక్టర్ అశోక్ రాజు(చిత్తూరు) ఆడారి ఆనంద్ కుమార్(అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సన్నారెడ్డి దయాకర్ రెడ్డి( తిరుపతి) నాగోతు రమేష్ నాయుడు, (అన్నమయ్య) మట్టా ప్రసాద్(కృష్ణ), సాలగ్రామ లక్ష్మీప్రసన్న(కాకినాడ) నియమితులయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా కె సురేంద్ర మోహన్,( విశాఖపట్నం)రెడ్డి పావని ( విజయనగరం) బొమ్ముల దత్తు, (తూర్పు గోదావరి), సురవరం గీతా మాధురి(కర్నూలు). బొడ్డు నాగ లక్ష్మీ,(ఎన్టీఆర్.విజయవాడ). మేకల హనుమంత రావు,( పల్నాడు) ,సందిరెడ్డి శ్రీనివాసులు (అనంతపురం) బోగిరెడ్డి ఆదిలక్ష్మీ( పశ్చిమ గోదావరి) ఉమ్మిడి సుజాత (విశాఖపట్నం), ఈరోజి స్వప్న కుమారి (అల్లూరి సీతారామరాజు) రాష్ట్ర కోశాధికారిగా మొగళ్ల నాగేంద్రరావు(విశాఖపట్నం) రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా కందుకూరి సత్య నారాయణ (నెల్లూరు) రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బి.ఎల్.ఎన్.పవన్ (ఎన్టీఆర్ విజయవాడ) ,రాష్ట్ర సెల్స్ కన్వీనర్‌గా .కె.చిరంజీవి రెడ్డి (అనంతపురం) రాష్ట్ర సెల్స్ కోకన్వీనర్ గా.నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి( ప్రకాశం) నియమితులయ్యారు.

# రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు శ్రుతిమించాయి: మాజీ మంత్రి సాకే శైలజానాథ్




**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు శృతిమించాయని, అయినా ఒక్కరిపైనా కేసు నమోదు కావడం లేదని మాజీ మంత్రి వైసిపి నేత సాకే శైలజానాథ్ విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అరాచకాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేలకు చంద్రబాబు వంతపాడుతున్నారని అన్నారు. దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, మహిళలు, ఉద్యోగులు ప్రతిపక్ష నాయకులపై దాడులు యథేచ్ఛగా సాగుతున్నాయని పేర్కొన్నారు. 14 నెలల పాలనలో దాడులు, దౌర్జన్యాలతో సుపరిపాలన అనే అర్థాన్నే మార్చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎక్కడా పరిపాలన సాగడం లేదని పేర్కొన్నారు. వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారని విమర్శించారు. టిటిడి ఛైర్మన్ పదవికి మచ్చ పవిత్రమైన శ్రీవారి క్షేత్రంలో ఉండి బిఆర్ నాయుడు అనకూడని పదాలు వాడుతున్నాడని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఆయన వ్యవహారశైలి ఉందని పేర్కొన్నారు. నూజెన్, ఆర్థోఅయిల్ పేరుతో ప్రజలను వంచించాడని అన్నారు. అలాగే అటవీ సిబ్బందిపై దాడిచేసిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, అటవీ సిబ్బందిపై దాడిచేస్తే పవన్‌కల్యాణ్‌లో స్పందన లేదని విమర్శించారు.

# తిరుమల సమాచారం

## శాస్త్రోక్తంగా కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిఆధ్వర్యంలోని తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షకుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయఅర్చకులు కామాక్షిఅమ్మవారికి శ్రావణమాసంలో చివరి శుక్రవారం పవిత్రంగా లక్షకుంకుమార్చన వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గణపతిపూజ, లక్షకుంకుమార్చనతో మొదలుపెట్టిన అర్చకులు మధ్యాహ్నం లక్షకుంకుమార్చన చేశారు. సాయంత్రం 6గంటలకు స్వామిఅమ్మవార్లు తిరువీధి ఉత్సవంలో ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు. .ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని వేడుకున్నా

### - మంత్రి డోలాబాలవీరాంజనేయులు



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి పెద్దపీట వేశారని, పేదప్రజల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నారని రాష్ట్రమంత్రి డోలబాల వీరాంజనేయులు తెలిపారు. ఏడాదిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. మరిన్ని సంక్షేమపథకాలు అమలుచేయాలని సిఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, ఇందుకు దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులుండాలని ప్రార్థించానన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. కుటుంబంతో కలసి శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌దర్శనంలో మంత్రి బాలవీరాంజనేయులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో అన్నీ శుభాలు



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ఆశీస్సులందుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోలే కుటుంబంతో కలసి, సినీనిర్మాత డివివి దానయ్య, ఎస్‌పిఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ దంపతులు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. శ్రీవారి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేవుని ఆశీస్సులు దేశప్రజలందరిపై ఉండాలి

### - బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** లోకక్షేమం కాంక్షిస్తూ పుంగనూరులో మూడురోజులపాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి సహిత మహా సుదర్శన యాగం నిర్వహించడం జరిగిందని బిసివై పార్టీ అధినేత బోడేరామచంద్రయాదవ్ తెలిపారు. కలియుగదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు దేశప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. మహాసుదర్శనయాగం పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకుని కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకుని గోవిందుడి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మొదటి ఘాట్‌లో రెండు ప్రమాదాలు

### - బ్రేక్ ఫెయిల్‌తో ఆర్టీసి బస్సును ఢీ కొన్న కారు - కొండను ఢీకొన్న వ్యాన్

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలనుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో శుక్రవారం మధ్యాహ్నం రెండు ప్రమాదాలు జరిగాయి. శ్రీవారి దర్శనానంతరం కారులో తిరుపతికి దిగుతున్న భక్తులు ఘాట్‌లో 26వ మలుపువద్ద బ్రేక్‌ఫెయిలవడంతో ముందువెళుతున్న తిరుమల డిపో ఆర్టీసి బస్సును ఢీ కొంది. ఈ సంఘటనలో కారులోప్రయాణీకులకు స్వల్పగాయాలయ్యాయి. బ్రేక్ ఫెయిలవడంతో జరిగిన ప్రమాదంతో ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలకు అంతరాయం ఏర్పడింది. అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకుని కారును తప్పించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌లో తిరుగుప్రయాణమైన విజయవాడ భక్తుల వ్యాన్ అదుపుతప్పి గోడను ఢీకొంది. ముందుభాగం దెబ్బతింది. 10మంది విజయవాడ భక్తుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరంతా స్వల్పగాయాలవడంతో 108లో తిరుపతికి తరలించారు. ప్రమాదాలకు గురైన వాహనాలను అలిపిరికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పాండిచ్చేరి యూనివర్సిటీ
(కేంద్రీయ విశ్వవిద్యాలయం - NAAC చే "A+" గ్రేడ్ గుర్తింపుతో)
డైరక్టరేట్ ఆఫ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్
(AICTE & DEB, UGC చే ఆమోదింపబడిన ప్రోగామ్‌లు)
R.V. నగర్, కాలాపేట్, పుదుచ్చేరీ - 605014

DDE ప్రవేశాలు 2025-26 (విద్యా సంవత్సరం)

| UG ప్రోగ్రామ్‌లు | MBA ప్రోగ్రామ్‌లు | PG ప్రోగ్రామ్‌లు |
|---|---|---|
| BCom, BBA, BA (హిస్టరీ), BA (ఇంగ్లీష్), BA (ఎకనామిక్స్), BA (సోషియాలజీ), BA (పొలిటికల్ సైన్స్), BA (జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్) — వార్షిక ఫీజు రూ.4,975/-** | MBA (ఫైనాన్స్), MBA (జనరల్), MBA (టూరిజం), MBA (మార్కెటింగ్), MBA (ఇంటర్నేషనల్ బిజినెస్), MBA (హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంట్), MBA (ఆపరేషన్స్ & సప్లై చైన్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ.17,500/-**; MBA (హాస్పిటల్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ. 26,750/-** | MA ఇంగ్లీష్, MA సోషియాలజీ, MA హిందీ, MCom (ఫైనాన్స్) — వార్షిక ఫీజు రూ.7,425/-** |

• మరిన్ని ఫీజు వివరాలకు అడ్మిషన్ పేజీతో సహా వెబ్‌సైట్‌ను చూడండి
ప్రోగ్రామ్‌లు AICTE & DEB-UGC చే ఆమోదింపబడినవి
ప్రవేశాలు "ఫస్ట్‌కమ్, ఫస్ట్ సర్వ్‌డు" బేసిస్‌పై ఇవ్వబడును

ఫీజు రాయితీలు :
→ దివ్యాంగ వ్యక్తులకు 100% ట్యూషన్ ఫీజు కన్సెషన్
→ 50% ట్యూషన్ ఫీజు కన్సెషన్ వీరికి :
• భారతీయ సేనా దళం మరియు పారామిలటరీ ఫోర్సెస్‌లో సేవలందించే రక్షణ శాఖా సిబ్బందికి
• ఖైదీలు • తృతీయలింగ మనిషులు • వితంతువులు • నపుంసకులు
• పాండిచ్చేరి యూనివర్సిటీ యొక్క ఉపాధ్యాయేతర ఉద్యోగులు మరియు వారి బిడ్డలు (గ్రూప్ B, C & D మాత్రమే)
ఉపకార వేతనం
→ DDE ప్రోగ్రాంలలో ప్రవేశం పొందిన SC/ST విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్ర/UT ప్రభుత్వాల నుండి వివిధ ఉపకార వేతనాలు పొందవచ్చును.

డిస్టన్స్ సమూనా క్రింద ప్రత్యేక ముఖ్యాంశాలు
• ఒక కేంద్రీయ యూనివర్సిటీ నుండి డిగ్రీ
• క్వాలిటీ ప్రింటెడ్ కోర్స్ మెటీరియల్స్
• అతి తక్కువ సొలభ్యంతో ట్యూషన్ ఫీజు
• విస్తృతమైన సాంకేతికపరమైన ప్లాట్ ఫాం/సదుపాయాలు
• ఎంపికైన కేంద్రాలలో PCP తరగతులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి
చివరి తేదీ : 15-09-2025*
*UGC ప్రకటనకు సంబంధించి

తదుపరి వివరాల కొరకు
వెబ్ సైట్ : https://dde.pondiuni.edu.in
ఇ మెయిల్ : ddehelpdesk@pondiuni.ac.in
ఫోన్ : 0413-2654439/441
CBC 21232/12/0001/2526 డైరెక్టర్


వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పని చేయొద్దు, అప్పుడు అన్నీ పొరపాటే చేస్తావు.

-బల్తజాన్

# రైతు బతుకుతో ఆటలొద్దు!

ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రైతు ఎడాపెడా సమస్యలతో నిరాశానిస్పృహలతో బతుకుతున్నాడు. ఒకపక్క రుతుపవనాల కారణంగా ఎడతెరిపి లేని భారీవర్షాలతో పంట సంరక్షణకు ఆస్కారం లేక రైతాంగాన్ని కృంగదీస్తుంటే, మరోపక్క 'యూరియా' కొరత రైతు భవిష్యత్‌నే ప్రశ్నిస్తోంది. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉన్నట్లు వార్తలు వస్తున్నా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నంత కొరత మరెక్కడా లేదు. ఈ కొరత వాస్తవమైనదా! కృత్రిమ కొరతతో అర్థంకాని పరిస్థితుల్లో రైతు వ్యవసాయశాఖ దయ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఏటా వ్యవసాయ సీజనుకు ముందుగానే ఫలానా సీజన్‌లో యూరియా తదితర ఎరువులు ఎంత మేరకు కావాలి? ఈసారి ఎంత విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుంది. ఆ మేరకు ఎంత యూరియా, ఎరువులు అవసరమౌతాయో నిర్ణయించి కేంద్రాన్ని కేటాయింపులు కోరడం అనాదిగా వస్తోంది. ప్రకృతి ప్రకోపాల బారిన పడిన కర్షకుడు భారమంతా దేవుడి మీదవేస్తాడు. కానీ యూరియా కొరత భారం ఎవరి మీద వేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏకధాటిగా కురుస్తున్న వానలు, మునిగిపోయి చేలు, ఒకపక్క విచారిస్తుండడం ఒకటైతే, యూరియా కోసం అంగళ్ల చుట్టూ తిరుగుతూ, మార్క్‌ఫెడ్ దుకాణాల దయాదాక్షిణ్యాల కోసం పొద్దస్తమానం ఎదురుచూసే రైతాంగం ఒకవైపు. పైగా తమకు కావాల్సిన మొత్తం యూరియా కన్నా ఎంతో కొంత దొరికే ఎరువుకోసం ఆయా మార్కెటింగ్ దుకాణాల వద్దకు తెల్లవారుజామునే సీరియల్ కోసం తమ చెప్పులు పెట్టివస్తున్నారని ప్రత్యక్షంగా కనబడే దృశ్యాలు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటికోసం తిప్పలుపడే మహిళలుఇలాగే వారి వంతు కోసం బిందెలు పెట్టి వచ్చే ఆనవాయితీ తెలిసిందే. ఇప్పుడు పురుషుల వంతొచ్చింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఎరువులు, సాగుయంత్రాలు, అందుబాటులోకి వచ్చినప్రస్తుత సమయంలో యూరియా కోసం 'చెప్పుల' వరుసలు చూడటం మనం పురోగమనంలో ఉన్నామా! తిరోగమనంలో ఉన్నామా అనే అభిప్రాయం! కలుగకమానదు. కారణమేదైనా యూరియా కొరతకు వాస్తవ కారణం కేంద్రం రాష్ట్రానికి అవసరమైనంత యూరియా ఎరువులు కేటాయించకపోవడమేనని సుస్పష్టం. రాష్ట్ర ప్రభుత్వం లోపాన్ని ఎత్తిచూపే వారెవరైనా కేంద్రం కేటాయింపుల మీద నోరెత్తరు. పదేపదే రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువుల శాఖామంత్రి జెపి నడ్డాకు తమ అవసరాలు చెప్పి వినతులు పంపుకున్నా ఎరువుల సరఫరాలో లోటు కనపడుతూనే ఉంది. అందుకే రైతుకు తగినంత యూరియా, ఎరువులు అందించలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం మిస్ మేనేజ్‌మెంట్ చేసిందనో కృత్రిమ కొరత సృష్టించిందనో ఆరోపణలు చేసి రైతు నుంచి సానుభూతి పొందాలని కొన్ని రాజకీయ పార్టీలు ఆది లోనే రంగప్రవే శం చేసినా అవస్థలు పడుతున్న రైతాంగానికి 'యూరియా' లోటు కేటాయింపుల సంగతి గుర్తించలేనిది కాదు. ఈ ఆగస్టు నాటికే 8.3 లక్షలమెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు అవసరమౌతుంది. ప్రభుత్వం నుంచి ఎన్నో అభ్యర్థనలు, ఆఖరికి నాలుగు రోజుల క్రితం పార్లమెంటు ముందు ఎంపిల నిరసన ప్రదర్శన తర్వాతనే కేంద్రం దిగివచ్చింది. 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ఎరువులశాఖ సన్నాహాలు చేస్తోంది. రైతులకు తగినంత యూరియా సర్దలేక ప్రభుత్వం తంటాలు పడుతోంది. ఈ రేషన్ ప్రక్రియలో ఎకరాకు ఒక బస్తా యూరియా కూడా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో నైతే రైతుకు రెండు, మూడు బస్తాలే. విచిత్రమేమిటంటే యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని ఓ రైతు తన స్నేహితుని ఇంట్లో వేడుకకు కానుకగా ఒక బస్తా యూరియా తీసుకెళ్లి సమర్పించుకున్నాడు. ఇలాంటి ఎన్నిసందర్భాలైనా యూరియా కొరతను చాటిచెప్పేవే. మరికొన్ని చోట్లఎరువుల దుకాణాల వాళ్లు రైతుఆదుర్దాను ఆసరా చేసుకొని తమ వద్దనున్న మ్యూరేట్ ఆఫ్ పొటాష్, ఎన్‌పికె ఎరువుల చలామణికి ప్రతి రెండు బస్తాలకు ఒక బస్తా యూరియా తమ కొనుగోలు రేటుపై తీసుకోవాలని లింకు పెడ్తున్నారు. సరిగ్గా యూరియా వేయాల్సిన ఈ సమయంలో వేయకపోతే పంటకు సాగుపోషకాలుఅందక దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అందుకే రైతు యూరియాను అధికధరకు బ్లాక్ మార్కెట్‌లో కొనేందుకైనా సిద్ధపడుతున్నాడు. సాధారణంగా ఇతర ఎరువులతో లింకు పెట్టి యూరియా విక్రయించడం నాలుగు దశాబ్దాల నాటి బ్లాక్ మార్కెటింగ్ విధానం ఆధునికంగా ఎంతో ఎదిగినా పూర్వకాలపు నాటివిధానాల్లో రైతు దోపిడీని కొనసాగించడం విచారకరం. కేంద్రం ఆయా రాష్ట్రప్రభుత్వాలకు వారి అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు, సరఫరా చేయలేకపోవడమే నేటి రైతు దుస్థితికి కారణం. దేశీయ అవసరాలకు తగిన ఉత్పత్తి లేదు. పైగా ముందుచూపు నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత సీజన్‌లో తెలంగాణలో 1.15 కోట్ల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసినందున యూరియా డిమాండ్ ఎక్కువ ఉంది. వారికి కావల్సిన యూరియా అందించలేని ప్రభుత్వాలు రైతులు సాగులో అవసరమైన మోతాదు యూరియా కన్నా అధి కంగా వేస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నాయి. 'ఆడలేక మద్దెల' ఓడ అన్న చందాన యూరియా కొరత వ్యవహారం నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడాయూరియా కొరత వ్యవహారం బయటకొచ్చింది. వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందించలేని పరిస్థితికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. ఏదిఏమైనా యూరియా కొరతకు ఎవరు బాధ్యులైనా రైతుల బతుకుతో ఆటలాడుకోవడం ఏమాత్రం సమంజసం కాదు.



చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.

వి.జాన్సన్



ధైర్యం ఒక ఆయుధం. దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.

జార్జి. ఎలియట్

# ప్రజావాక్కు



## మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత డిఎస్సీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల కోసం డిఎస్సీ 2025 నిర్వహించింది. రేపో మాపో ఫలితాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. అయితే నేరుగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపికజాబితా విడుదల చేయాలని ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. కానీ డీఎస్సీ 2025 అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత సెలక్షన్ లిస్ట్ ప్రకటించి నియామకాలు జరపాలి. డిఎస్సీ 2025 నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్ట్ ముందు ప్రకటించి తర్వాత సెలెక్షన్ జాబితా విడుదల చేయాలి. కానీ నేరుగా సెలెక్షన్ జాబితా ప్రకటించి సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ చేయడం సరికాదు. నేరుగా సెలెక్షన్ జాబితా విడుదల చేయడం జరిగితే రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులకుఅనగాఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులకు నష్టం జరిగే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మెరిట్ లిస్ట్ ప్రకటించి అన్ని రిజర్వ్ కేటగిరీలకు కటాఫ్ మార్కులుతెలియజేసిన అనంతరం నియామకాలు చేపట్టేవారు. కాబట్టి ప్రస్తుతప్రభుత్వం గతంలోలాగా మెరిట్‌లిస్ట్ ప్రకటించిన తరువాతే నియామకాలు చేపట్టాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఉద్యోగం నుండి తొలగించే బిల్లు

ప్రభుత్వ ఉద్యోగులు ఐపిఎస్, ఐఎఎస్ నుండి అటెండర్ వరకూ అన్ని శాఖల అధికారులు లంచం తీసుకొని దొరికితే, ప్రభుత్వ ఉద్యోగులకు సస్పెండ్ కాకుండా ఉద్యోగం నుండి తొలగించే బిల్లునుతేవాలి. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలనుపేదప్రజలకు అందుతాయి. అప్పుడు ప్రభుత్వానికి ప్రజలకు నమ్మకం, గౌరవం ఉంటుంది. ప్రభుత్వానికి జవాబుదారీతనం నిలుస్తుంది. ఈ బిల్లు వాళ్ల ఎందరికో దక్కాల్సిన ప్రభుత్వ ఫలాలు, అన్యాక్రాంతం కాకుండా ఉంటుంది.

- సరాఫ్ ప్రభాకర్ చారి, మేడ్చల్

## ఢిల్లీ సిఎం మీద దాడి హేయం

ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకునేందుకు ప్రతీవారం నిర్వహిస్తున్న జన్ సున్‌వాయి కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి అమానుషం. ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే మామూలు వారి పరిస్థితి ఏమిటి అనే సందేహం కలుగుతుంది. మరో మారు ఇలాంటి ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## కుక్కల బెడద నుంచి రక్షణ కావాలి

మనుషుల్లో మానవత్వం కరవవుతున్నట్లే కుక్కల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. వీటి సంతానం దినాభివృద్ధి చెందుతోంది. ఏ వీధిలో చూసినా ఈ కుక్కలు వీరవిహారం చేస్తూ పాదచారులనుకరుస్తున్నాయి. రోజూ వందమందిని గాయపరుస్తున్నా యని ఓ దినపత్రికలో వచ్చిన వార్త. స్కూటర్లు మీదవెడుతున్న వారిని వెంబడించి మరీ కాటేస్తున్నాయి. కొందరు మహిళలు భయపడి కింద పడిపోతున్నారు. కాళ్ళు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈకుక్కలు పొరబాటున చిన్న కారుల కిందో, స్కూటర్ల కింద పడి కాలు విరిగో, చనిపోతేనో జంతు ప్రేమికుల సంఘాలు వెంటనే పోగయి విపరీతంగా గొడవలు సృష్టించి నానాయాగీ చేస్తూ వాటి వైద్యానికి డబ్బు ఇవ్వాలంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారు వచ్చివీధులలో సంచరించే కుక్కలను పట్టి ఎక్కడైనా వదలాలి. ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం

ప్రస్తుతం మొబైల్ వినియోగం అందరికీ తప్పనిసరి అయింది. ఈ స్థితిలో ఆన్లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా వివిధ మధ్యవర్తులను ఉపయోగించి జూదం ద్వారా సొమ్ము ఆర్జిస్తున్నారు. పోయినవాడు వాడి గతికి వ్యాపారం చేయించిన వాడు లాభాన్నే చూస్తాడు. కావున పార్లమెంట్‌లో దీనిపై చట్టం తేవడం అవసరమే. అమలు చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతతో అధికార యంత్రాగం కూడా పనిచేస్తే చాలా మంచిది. ముఖ్యంగా నిరుద్యోగులు, చెడు అలవాట్లకు బానిసైన వ్యక్తులు విముక్తి చెందుతారు. ఇప్పటికే విద్యార్థులను పరోక్షంగా వారి చదువులను భంగపరచి అనూహ్య పరిణామాలు వస్తున్నాయి. విజ్ఞులు ఈ విషయాన్ని వారి స్థాయిలో సహకరించి చట్టాన్ని అమలు చేయడం, సమాజ శ్రేయస్సు కోరడం తమ బాధ్యత.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రతీసోమవారం కలెక్టర్‌లు, ఎస్పీలు నిర్వహించే స్పందనకు వచ్చే సమస్యలను తక్షణం తక్కువ సమయంలో పరిష్కరించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలు వారివారి ఎన్నో సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందనకు వస్తూ ఉంటారు. స్పందనకు వచ్చే సమస్యలను పరిష్కరించేలా చర్య తీసుకోవాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమలు చేయలేని చట్టాలెందుకు?

ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరు విప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులను వదలి, ఇటు తమకు ఇష్టం లేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే.

దామెర్ల సాయిబాబ

చేయతోచే పనిని గుర్తి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం, పూర్తి చేయడమే సామర్థ్యం. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల మీద చట్టాలు తెస్తున్నా, కఠిన శిక్షలు తప్పవని ప్రకటనలు, హెచ్చరికలు చేస్తున్నా అవి అమలు చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యం, అలక్ష్యం వంటి వాటితో ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఆట పాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన కోట్లాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర పాలకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి పకడ్బందీగా సరికొత్త చట్టాలు తీసుకువచ్చామని నేతలు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక మార్గంద్వారా ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా ఏళ్లతరబడి మగ్గుతున్న బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చినా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యల వైపు అడుగులు వేయలేకపోతున్నాయి. ఇది అధికారులకు అందరికి తెలిసిన సత్యమే అయినా ప్రభుత్వాన్ని నమ్మించేందుకు కాగితాల మీద ఏవేవో రాసుకొని కాలం గడుపుతున్నారు. అందుకే చట్టాలు, శిక్షలు కాగితాలకే పరిమితం కావడంతో ఈవ్యవస్థ నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ వరకు అటు రాష్ట్రపతులందరితోపాటు ఎందరో దేశాధినేతలు బాలలపట్ల అత్యంత ప్రేమాదరణలు చూపిన వారే. ఈ బాలలే భావిభారత పౌరులని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశించిన వారే. ఆ దిశలో ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. రాజ్యాంగంలోని 24వ అధికరణం బాల కార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. వయసుకు మించిన పనుల్లో పిల్లలను వ్యక్తులు కానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంలోని 39(ఇ) అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టుకోకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించిన భారం అప్పగించకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. మరొకపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమలు, గనుల వంటి ప్రదేశాల్లో బాలలను నియమించరాదని మరో చట్టాన్ని తీసుకువచ్చారు. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాల వల్ల అంతగా ఫలితం లేకపోవడంతో బాల కార్మిక వ్యవస్థలో మార్పులు లేకపోగా మరింత పెరుగుతుండడంతో 1979లో గురుపాద స్వామి కమిటీని కేంద్రప్రభుత్వం నియమించింది. ఆ కమిటీ అధ్యయనం అనంతరం చేసిన సిఫార్సుల ఆధారంగా 1986లో బాలకార్మిక వ్యవస్థ నిషేధ నియంత్రణ చట్టం తీసుకువచ్చారు. ప్రమాదకర వృత్తుల్లో పనిచేసేవారికి పునరావాసంపై దృష్టిసారించేందుకు 1947లో జాతీయ విధానాన్ని రూపొందించారు. 1988 నుంచి కార్మిక ఉపాధికల్పన మంత్రిత్వశాఖ బాల కార్మికుల పునరావాసానికి పెద్ద సంఖ్యలో పథకాలను అమలు చేసింది. అయినా ఆశించిన ఫలితాలు చేకూరలేదు. 1994లో ఈ విషయంలో ఆందోళన చెందిన కేంద్ర ప్రభుత్వం అప్పటి ప్రధాని పి.వి

ఒక్క మాట

నర్సింహారావు పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. 2000 సంవత్సరం నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ప్రకటించారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మికుల సంఖ్యను చూసి ఆందోళన చెందిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉన్న చట్టాలతో బాలకార్మిక నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడం సాధ్యంకాదని భావించి మరో కొత్తచట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఇళ్లల్లో పనిచేస్తున్న లక్షలాది మంది బాలకార్మికుల భవిష్యత్‌కు భరోసా కల్పించి వారికి అక్షరాలు నేర్పించి చైతన్యవంతులను చేయాలని నడుం బిగించింది. ఆ చట్టప్రకారమే ఇళ్లల్లోనూ, హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, తదితర చోట్ల పనిచేసే బాల కార్మికులకు విముక్తి కల్పించి ప్రత్యామ్నాయం చూపాలని నిర్దేశించారు. ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బాలలను పనిలో నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జరిమానాలతోపాటు జైలుశిక్షలు కూడా విధించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఈ హడావుడి హంగామా చూసి కొంతలో కొంత మార్పు వస్తుందని ఆశించారు. క్షేత్రస్థాయి విషయాలపై ఎయిర్‌కండిషన్ గదుల్లో ఉంటే అధికారులకు తెలియకపోవడం, అవసరమైన సిబ్బంది లేకపోవడంతో ఆశించిన ఫలితాలు చేకూరలేదు. ఇళ్లల్లో, హోటళ్లలో, రెస్టారెంట్లలో ఇటుక బట్టీల్లో తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను కొందరిని బయటకు తీసుకువచ్చారు. వారికి విముక్తి కల్పిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. అంతవరకు బాగానేఉంది. కానీ వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా లక్షలసంఖ్యలో బాలకార్మికులు ఉంటే వేల మందిని బయటకు తీసుకువచ్చారు. వందల సంఖ్యలో మాత్రమే పునరావాసం కల్పించారు. ఆ వందల సంఖ్యలో ఉన్న పిల్లలు కూడా పునరావాసం సంతృప్తికరంగా లేకపోవడంతో తిరిగి పాత బాటే మేలని భావించి అందులోకే వెళ్లిపోయారు. పిల్లల పునరావాసం కోసం రెసిడెన్షియల్, బ్రిడ్జ్ సెంటర్లు ఎంతో విజయవంతంగా పనిచేశాయని రికార్డుల్లో రాసుకున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాల మీద నమ్మకం లేకపోయింది. ఇటు చదువు రాక, అటు పనిరాక రెంటికిచెడ్డ రేవడిలా తయారై మరోమార్గంలో వయసుమీరిన్న భయంతో పాత బాటే పట్టించారు. ఇక ప్రభుత్వపాఠశాలల్లో చేర్చే ఈ బాలల పరిస్థితి మరోరకంగా మారింది. పదేండ్లు, పదమూడేళ్ల వయసున్న పిల్లలను ఒకటో, రెండో తరగతిలోనో నాలుగైదేళ్ల వయసు ఉన్న పిల్లలతో కలిపి కూర్చోబెడితే ఏమవుతుందో పెద్దలు ఆలోచించకపోవడం దురదృష్టకరం. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా తొమ్మిది, పదేళ్ల తేడా ఉన్న పిల్లలతో కలిసి చదువుకోడానికి వారు నమూషిగా భావించారు. ఫలితంగా ఏదో కొన్ని రోజులుపాటు పాఠశాలలకు వెళ్లినా ఆ తర్వాత స్వస్తి చెప్పి పాతబాటే పట్టారు. వారికి భవిష్యత్ గురించి వివరించి, కౌన్సిలింగ్ సమర్థవంతంగా, సక్రమంగా చేయలేకపోవడం కూడా పెద్ద లోపంగా చెప్పొచ్చు. అందుకే బాలకార్మికులను కూపం నుంచి బయటకు తెచ్చి పునరావాసం కల్పించామని చేసినప్రకటనలు ప్రచారార్భాటాలుగానే మిగిలిపోయాయి. బ్రిడ్జ్ సెంటర్లు, పాఠశాలల్లో చేర్పించామని చెప్పుకున్నపిల్లల్లో అధికశాతం పాతపనుల్లోకే వెళ్లిపోయారు. ఇప్పటికైనానేతలు వాస్తవాలు గ్రహించాలి. చట్టాలు తెస్తే సరిపోదు. చట్టాలు ఎన్ని తెచ్చినా ఒరిగే ప్రయోజనం ఉండదు. వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసే సిబ్బంది కావాలి. దీనికితోడు లేత వయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్ల ముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతారో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టినకన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయంకూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరువిప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులను వదిలి, ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే. •

# చందమామ అందిన పండుగ రోజు..

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆగస్టు 23, 2025 రోజున భారతదేశవ్యాప్తంగా 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవం, లేదా 'నేషనల్ స్పేస్ డే' వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న శుభ సందర్భంగా భారతీయులు అందరూ, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు, యువతరం భావించాలి. 23 ఆగస్టు 2023 రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో చేపట్టిన చంద్రయాన్3 ప్రయోగం విజయవంతమైన రోజుగా భారత అంతరిక్ష చరిత్రలో లిఖించబడింది. ఆ రోజున విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా, సాఫ్ట్ ల్యాండింగ్ కావడం జరిగింది. అంతేకాకుండా ప్రపంచంలోనే తొలిసారి చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ కావడం ఒక విశేషంగా చెప్పబడింది. చంద్రమండల దక్షిణ ధ్రువం ప్రాంతంలో ల్యాండ్ అయిన ప్రదేశాన్ని 'శివశక్తి పాయింట్'గా కూడా నామకరణం చేయడం జరిగింది. ఈ విధంగా విజయవంతంగా చంద్రమండలంపైల్యాండ్ అయిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా 23 ఆగస్టున దేశవ్యాప్తంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముదావహం. జాతీయ అంతరిక్ష దినోత్సవ వేదికగా ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం, భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధునిక మార్పులను ఎక్కుపెట్టడం, నేటి యువతరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్షరంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను స్టెమ్ కోర్సుల వైపు ఆకర్షించడానికి 'స్పేస్ ఆన్ వీల్స్' 'స్పేస్ ట్యూటర్స్'లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చి తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి. 'పురాతన పరిజ్ఞానం నుంచి అనంత అవకాశాలు' అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రంపట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవసరంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్లానిటోరియం సందర్శనం, శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటి వన్నీ ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి. భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్, వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్‌ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు, దేశ ఆర్థికాభివృద్ధి, స్మార్ట్‌ఫోన్, ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలు మరచిపోలేనివి. •

# ఆదివాసుల్లోకి అన్య సంస్కృతుల ప్రమాదం!



గుమ్మడి లక్ష్మీనారాయణ

'ఆదివాసీలు హిందువులే' అంటూ ఇటీవల కొందరు వ్యాసకర్తలు రాస్తున్నారు. ఆదివాసులు హిందువులే అనే కంటే హిందు మతాన్ని 'అనుసరించే వాళ్లు' మాత్రమే అంటే బాగుంటుంది. సాధారణంగా హిందూ మత పండుగలను, ఆచార వ్యవహారాలను నవీన కాలంలో కొన్ని తెగల ఆదివాసీలు పాటిస్తున్నారు. కానీ హిందూ ఆచారాలు, అనేక దేవుళ్ల పుట్టుక చరిత్ర వెనుక ఆదివాసీల చారిత్రక నేపథ్యం దాగున్నదని మరచిపోతున్నారు మేధావులు. పురానేతిహాసాల్లో, వేదాలలో భక్త కన్నప్ప, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, శబరి తదితరులు గిరిజన ఆదివాసీలు కాదా? ఆదివాసులను మతపర ఉచ్చులోకి లాగడానికి ఒక అసంబద్ధ ప్రయత్నం జరుగుతోంది! ఆదిమానవులైన ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయ, ఆచారాలే క్రమంగా హిందూ మతాచారాలుగా మారాయి. కాబట్టి ఈ మూలవాసులది పురాతన 'ఆదివాసీ మతం' అనటం సమంజసంగా ఉంటుంది. విలక్షణమైన జీవితం ఆదివాసులది. వీరు ఆదిమ కాలం నుంచి ఆచార సంస్కృతులకు చిరునామాదారులు. మూలవాసీ సంస్కృతి ఆచారాలను తప్పక పాటిస్తారు. నేడు కాలానుగుణంగా వస్తున్న ఆధునిక మార్పుల్లో భాగస్వాములు అవుతున్నారు. ఆధ్యాత్మికత, భక్తి భావానికి గల భేదాలు తెలియని ఈ గిరిజనులకు తెలిసిందల్లా నమ్మకంతో ముడిపడ్డ భక్తి మాత్రమే. దానినే ఆచరిస్తారు. వారికి ఉన్నది సాధారణ పరిజ్ఞానం మాత్రమే. మౌఖిక సాహిత్యం వల్ల, ఆధ్యాత్మిక చింతనలు, పునర్జన్మలు, ముక్తి మార్గాలు వారికి తెలియవు. బ్రతికినన్ని రోజులుఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా జీవించటం మాత్రమే వారికి అవసరం. వారికి గల నిండైన కృతజ్ఞత, విశ్వాసాల సాక్షిగా నిరాకారులైన వారివారి కుల, గ్రామ దేవర్లనే పూజిస్తారు. వారి ఇలవేల్పులైన నాగోబా, జంగుబాయి, పెర్స పేన్, మేడారం సమ్మక్క, సారక్క, గుంజేడు ముసలమ్మ, కొమ్మలమ్మ, సడలమ్మ, గట్టమ్మ, దూలరాజు, మారయ్య వంటి దైవాలను గౌరవించుకుంటారు. మొక్కులు చెల్లించుకుని జీవిస్తుంటారు. వారికి వ్రతాలు, నోములు, పూజలు, మంత్రాలు, హోమాలు తదితర వాటితో సంబంధం లేదు. వాటిని ఆచరించి అంతులేని పుణ్యం, సంపదలు రావాలని వారు కోరుకోరు. వాటి అవసరం కూడా వారికి లేదు. కేవలం వారి పూర్వాచారాలే వారసత్వంగా అమలవుతున్నవి. అనారోగ్యం పాలైతే తెలిసిన మూలికా వైద్యం చేసుకుంటారు. మనోధైర్యం కోసం వారాంతపు దేవర్ల దగ్గరకు వెళ్లి పూనకం దేవర్లు చెప్పే ధైర్యపు మాటలు వింటారు. దీనితో మనోధైర్యం పెంచుకొని జబ్బుల బారి నుండి బయటపడుతుంటారు. పంటలు బాగా పండాలని కోరుకుంటారు. పంటలు బాగా పండాలని దేవర్లకు మొక్కుకుంటారు.



కృతజ్ఞతతో వారికి ధాన్యం, ఇప్పసారా, మాంసాహారం వంటి వాటిని ప్రసాదంగా సమర్పించుకుంటారు. ఒకరకంగా గిరిజనుల భక్తి భావనలో కేవలం నమ్మకం, కృతజ్ఞతలు తప్ప ప్రతిఫలాపేక్ష ఏ మాత్రం ఉండదు. ఇది ఒకనాటి గిరిజనుల భక్తి భావనల తీరు. అయితే, నేటి ఆధునికకాలంలోవస్తున్న మార్పుల్లో భాగంగా వీరి భక్తి విధానాలలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయులు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. మాల ధారణలు, దీక్షలు మొదలు పెట్టారు. మొదట జంగుబాయి, సమ్మక్క సారక్క మాలధారణ దీక్షలకే పరిమితమయ్యేవారు. వీరు, గిరిజనేతరులతో కూడా కలిసి విడివిడిగా భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే, ఇటీవల గిరిజన గ్రామాల్లో విరివిగా గణేష్ మండపాలు వెలిశాయి. గ్రామస్తులంతా చందాలు వేసుకుని పూర్తి ఆధునిక పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తున్నారు. నవ రాత్రులు మొత్తం పూజలు చేసే ఆర్థిక స్తోమత లేక మూడు లేదా ఐదు రాత్రులతో ముగించి నిమజ్జనం చేస్తున్నారు. అనంతరం సామూహిక అన్నదానంలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, నిమజ్జనం, శోభాయాత్రల్లో మాత్రం తమదైన డోలు వాయిద్యం, గిరిజన నృత్యాలతో సాంప్రదాయపు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. దీనితో తమ గిరిజన సంస్కృతిని చాటుకోవడం విశేషం. ఇదే క్రమంలో సంక్రాంతి నాడు శ్రీరామభజన చేస్తూ గిరిజనగ్రామాల్లో పల్లకి సేవలు నిర్వహిస్తు న్నారు. సమీప ప్రాంతాల్లో జరిగే శివరాత్రి నాటి శివకళ్యాణం, హోలీకి, శ్రీరామ నవమి నాటి సీతారామ కళ్యాణం జరుపుకుంటున్నారు. నృసింహ జయంతికి జరిపే నరసింహ కళ్యాణం జరుపుకుంటున్నారు. భద్రాచలంలోని రామాలయంలో శబరి స్మృతియాత్ర వంటివివిధ తీర్థాలకు గిరిజనులు అధిక సంఖ్యలో వెళుతున్నారు. ఈ మధ్యన భగవద్గీత త్రైత కమిటీ ద్వారా కృష్ణుని పల్లకి సేవ, జయంతి పూజలు చేశారు. కాని వీటి వెనుక మనువాదం మిళితం అయిందని ఆలోచించడం లేదు. కానీ, తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని గ్రహించాలి. గిరిజనుల్లో అధికంగా సామూహిక కార్యక్రమాలు, ప్రయాణాలు ఉంటాయి. మద్యపాన వ్యసనం నుండి దూరం కావడం కోసం ఈకార్యక్రమాలు చేస్తుంటారు. సాధారణ ఆరోగ్యం కోసం, గిరిజన యువత అధికంగా మాలధారణ దీక్షలు చేపడుతున్నారు. వారిదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన కొత్తలపండుగ, విత్తనాల పండుగ, వివిధ తెగల, గోత్రాలకు నిర్దేశించిన ఇలవేల్పు పండుగలను మర్చిపోతున్నారు. గ్రామపండుగలైన ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తదితర పండుగలకు, జాతర్లకు కూడా దూరమవుతున్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో అక్షరాస్యులు, ఉద్యోగులైన గిరిజనయువత ఏర్పాటు చేసుకున్న తుడుందెబ్బ, సంక్షేమ పరిషత్, ఆదివాసీ సేన తదితర గిరిజన సంఘాలు ఆధునిక భక్తి భావాలపట్ల వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. తమదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన దేవర్లను, ఇలవేల్పులను, ఆదివాసీ వీరులను మాత్రమే పూజించుకునే ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చైతన్యం దిశగా గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు పునుకోవాలి. అక్షరాస్యతద్వారా గిరిజనుల్లో వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పుల వల్ల, జీవన విధానంలో చక్కటి మార్పువచ్చింది. అది ఆనందదాయకమే. నేటి గిరిజన యువతలోని అక్షరాస్యత కేవలం ఉద్యోగాల కోసం, ఆర్థికవృద్ధి కోసం మాత్రమే కాదు. తమ దైన సంస్కృతులను, సాంప్రదాయాలను, తమ అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలి. •

# వినాయక ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

## - కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్




**కొత్తపట్నం, ఆగస్ట్ 22, ప్రభాతవార్త**

కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ,గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు ఆన్లైన్ ద్వారా తప్పనిసరిగా అనుమతి పొందాలి.ఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకల నేపథ్యంలో, భక్తులు పాటించాల్సిన నియమ నిబంధనలు మరియు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై కొత్తపట్నం ఎస్సై సూచనలు తెలిపారు. వినాయక చవితి వేడుకలలో భాగంగా పందిళ్లు,మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మండపాలు, ఏర్పాటు చేయు ప్రజల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా సింగిల్ విండో సిస్టం ద్వారా గణేష్ ఉత్సవాలకు అనుమతులను ఆన్‌లైన్‌ద్వారా గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి. ఈ అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఆన్ లైన్ లో దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ.కి సమర్పించబడుతుంది. ఎస్ హెచ్ ఓ.తనిఖీ చేసి ఏర్పాటు సురక్షితంగా మరియు నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లుగా తేలితే, క్యూఆర్ కోడ్ కలిగిన నిరభ్యంతర పత్రాన్ని జారీ (ఎన్ ఓ సి) చేస్తారు. ఈ పత్రాన్ని ప్రింట్ చేసి గణేష్ మండపంలో ఉంచాలి.

# ప్రకాశం జిల్లా మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు వేడుకలు ఒంగోలు నందు ఘనంగా నిర్వహించిన మెగా ఫ్యాన్స్ 70వ సంవత్సరం పుట్టిన రోజు సందర్భంగా సమత మహిళ వేదిక వృద్ధుల ఆశ్రమం నందు కేక్ కట్ చేసి, వృద్ధులకు కావాల్సిన నెలవారి నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యామ్, చిరంజీవి రాష్ట్ర యువత పైడి యుగంధర్, షేక్ కరిముల్లా, డుంబు కాపునాడు నాయకులు దాసరి పిచ్చయ్య, మల్లి, ఉదయ్, అశోక్, అంజి, మహేష్, శ్రీను, మెగా ఫ్యాన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఘన శ్యామ్ మాట్లాడుతూ సేవ కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ ఎప్పుడూ ముందుంటారని చిరంజీవి సేవకి ఎంతో మందికి ఆదర్శప్రాయం అని కొనియాడారు. డుంబు మాట్లాడుతూ చిరంజీవి కి భారతరత్న అవార్డు ఇవ్వాలని ఆయన చేసిన సేవ కార్యక్రమాలు ఆదర్శప్రాయంగా తీసుకొని, భారతదేశం ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. కాపునాడు జిల్లా జనరల్ సెక్రటరీ దాసరి పిచ్చయ్య నాయుడు మాట్లాడుతూ చిరంజీవి చూపించిన మార్గంలో నడుస్తామని ఆయన వందేళ్లు కలకాలం జీవించాలని మనస్పూర్తిగా కోరుకున్నారు.

# మానవతా శాంతియుత ర్యాలీ

**ఒంగోలు, ప్రభాతవార్త**




మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రపంచ మానవత దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలు నిర్మల్ నగర్ పార్కు నారాయణ పబ్లిక్ స్కూల్ దగ్గర నుంచి మంగమూరు డొంక బైపాస్ రోడ్డు మీదుగా విద్యార్థులతో శాంతి ర్యాలీ ఒంగోలు మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. మానవతా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ 2024 ఆగస్టు 22జంగారెడ్డిగూడెంలో మానవతా సేవా సంస్థ ప్రారంభించామని నేడు 13 జిల్లాలో 136 శాఖలతో 85వేల మంది సభ్యులుగా చేరి ఉచిత సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఒంగోలు నగరంలో మరణించిన వారికి మార్చురీ బాక్సులు అంతిమయాత్ర వాహనంతో పాటు పేదలకు మట్టి ఖర్చులకు ఆర్థికంగా మానవతా సేవా సంస్థ అందిస్తూ పర్యావరణం పరిరక్షణ ఉచిత వైద్య శిబిరాలు రక్తదాన శిబిరాలు మొక్కలు నాటడం పేదలకు ఆర్థికంగా అండగా ఉండి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో మానవతా సేవా సంస్థ సభ్యులతో పాటు నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచి సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ వైస్ చైర్మన్ మంగళగిరి నరసింహారావు, అధ్యక్షులు పథకమూరి శరభలింగాచారి, కోశాధికారి మద్దాల భోజిరెడ్డి, మానవతా సేవా సంస్థ నాయకులు టమటం రామిరెడ్డి, కే.వెంకట్‌రెడ్డి, కోసూరి శ్రీదేవి, చిలుకూరి ఆదిలక్ష్మి, ఎస్.కనకదుర్గాదేవి, మోటుపల్లి వెంకటేశ్వర్లు(చౌదరి), కే.వెంకట్‌రెడ్డి, తన్నీరు సురేష్, ఎం.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంతనూతలపాడులో అదనంగా 9 పోలింగ్‌స్టేషన్‌లు

**చీమకుర్తి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



సంతనూతలపాడు నియోజకవర్గంలో ఆదనంగా 9 కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. చీఫ్ ఎలెక్టోరల్ రిజిస్ట్రాషన్ అధికారి, కలెక్టర్, ఎన్నికల ఎన్నికల అధికారి, ఆదేశములు ప్రకారం చీమకుర్తి తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక ఎన్నికల సమావేశం జరిగింది. అసెంబ్లీ నియోజక వర్గంలోని ఎలెక్టోరల్ రిజిస్ట్రాషన్ అధికారి వారి ప్రతి నెల ఎలెక్టోరల్ రోల్ పై రాజకీయ ప్రతి నిధులతో సమావేశమును ఏర్పదు చేయమని ఆదేశములను జారీ చేసి యున్నారు. దీనికి అనుగుణంగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజక వర్గం పరిధి లోని చీమకుర్తి మండలము, సంతనూతలపాడు మండలము, మద్దిపాడు మండలము, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని రాజకీయ పార్టీ ప్రతి నిధులతో సమావేశము ను ఏర్పాటు చేశారు. ఈ ఆర్ ఓ అధ్యక్షతన అసెంబ్లీ నియోజక వర్గంలోని పోలింగ్ స్టేషన్ నందు 1200పై బడిన పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి చీమకుర్తి మండలంలో 4 కొత్త పోలింగ్ స్టేషన్‌లు, సంతనూతలపాడు మండలము నందు 5 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పదు చేస్తున్నట్టు తెలిపారు. ఒక పోలింగ్ స్టేషన్ నుండి మరొక పోలింగ్ స్టేషన్ కు ఓట్లను చీమకుర్తి మండలము నందు 750 ఓట్లు మరియు సంతనూతలపాడు మండలము నుండి 548 ఓట్లు లను వేరొక పోలింగ్ స్టేషన్ కు మార్పు చేస్తున్నమని సమావేశము లో తెలిపి యున్నారు. ఈ సమావేశము నందు హాజరు అయిన అధికారులు ఎలెక్టోరల్ రిజిస్ట్రాషన్ అధికారి యస్. వర కుమార్, అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రాషన్ అధికారి, చీమకుర్తి తహాసీల్దారు, ఆర్. బ్రహ్మయ్య, అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రాషన్ అధికారి, చీమకుర్తి మున్సిపల్ కమీషనర్ వై రామకృష్ణయ్య, సంతనూతలపాడు తహసిల్దార్ యస్.యల్.నారాయణరెడ్డి, మద్దిపాడు సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, నాగులుప్పలపాడు తహసిల్దార్ కే. ప్రవీణ్ కుమారు మరియు ఎన్నికల ఉప తహసీల్దారు, పి.అరుణ, రాజకీయ పార్థి ప్రతి నిధులు నాలుగు మండలముల ఎన్నికల కంప్యుటర్ ఆపరేటర్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## దావా సమన్లు

u/o :5, R-1 &5 of C.P.C

మహారాజశ్రీ కనిగిరి సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 407/2022
బిట్వీన్
గుదె తిరుపతయ్య ....వాది
మరియు
పూట్టా చెంచయ్య & మరికొందరు ...ప్రతివాదులు
టు

4వ ప్రతివాది : పుట్టా బాటకోటయ్య, తండ్రి చెంచయ్య, R/o చల్లగిరిగల గ్రామం మరియు పోస్టు, కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

పై దావా ఓ.యస్.నెం. 407/2022 నెంబరులో మీరు 4వ ప్రతివాది అయిఉన్నారు. పై దావాకు సంబంధించి శ్రీకోర్టు వారి తరపున మీకు అనేక సార్లు దావా సమయన్లు పంపిచినట్లు మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు Substitute Service ద్వారా మీకు సమను/నోటీసు నిమిత్తం ఈపేపరు i.c, వార్త ప్రకారం జిల్లా ఎడిషన్ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్డువారు తే.08-09-2025కి వాయిదా వేసినారు. కావున మీరు తేది. 08-09-2025 ఉ.గం॥ 10.30 ని॥లక పై కోర్డు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపు గా॥ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. మీరు హాజరు కానియెడల శ్రీ కోర్డువారు పరోక్షమున విచారించి తీరామనించ బడును.

(ఈ ప్రకటన శ్రీకోర్డు వారి ఉత్తర్వులు ప్రకారము) వాయిదా తే.08-09-2025.
సం/- దేవండ్ల బాలాజీ, వారి తరపున
న్యాయవాది, కనిగిరి, ప్రకాశం జిల్లా : 7995757857

# చీమకుర్తిలోమెగాస్టార్ జన్మదిన వేడుకలు

**చీమకుర్తి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



చీమకుర్తి జనసేన పార్టీ కార్యాలయం వద్ద పట్టణ పార్టీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేకు కట్ చేసి మెగాస్టార్ కు, వారి అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, బ్రహ్మయ్య,కోటేశ్వరరావు, శ్రీకాంత్, వేణు,సన్నీ,అనిల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన రాధాకృష్ణన్‌ని కలిసిన ఎంపీ మాగుంట

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌ని శుక్రవారం న్యూ ఢిల్లీలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యలను నాణ్యతతో సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**





ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులు, పీజీఆర్ఎస్ ఆడిట్ టీమ్ అధికారులతో సమావేశమై శాఖల వారీగా పీజీఆర్ఎస్‌పై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. పీజీఆర్ ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులకు నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ రాజ్, ఎడ్యుకేషన్, సీపీడీసీఎల్,మున్సిపల్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, దేవాదాయ తదితర శాఖలకు సంబంధించి ప్రజల నుండి వివిధ సమస్యలపై ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కరించిన అర్జీలు తిరిగి రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు కరెక్ట్ ఎండార్స్మెంట్ ఇచ్చారా లేదా అని, అర్జీదారులు సంతృప్తి చెందారా లేదా అని ఆడిట్ టీమ్ ఖచ్చితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్, ఆడిట్ టీమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన అర్జీలకు సంబంధించి 47,200 అర్జీలను పరిష్కరించగా, 42,487 అర్జీలను ఆడిట్ చేయడం జరిగిందని, అలాగే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు సంబంధించి 16,834 అర్జీలను పరిష్కరించగా 16,796 అర్జీలను ఆడిట్ చేయడం జరిగిందని, అలాగే రీ సర్వే కు సంబంధించి గ్రామ సభల్లో వచ్చిన అర్జీలకు సంబంధించి 8,624 అర్జీలను పరిష్కరించగా, 8,609 అర్జీలను ఆడిట్ చేయడం జరిగిందని, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి పీవీఎస్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. డివిజన్ వారీగా ఏర్పాటు చేసిన ఆడిట్ టీం చే పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, నోడల్ అధికారిణి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ పానకాల రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సెక్షన్ అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్య పరిచే శక్తి పాటకు ఉంది

- పేదలకు భూములను పంచింది, కార్మికులకు హక్కులు కల్పించింది పాట
- ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు
- రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగుతున్న ఒంగోలు కళా ఉత్సవాలు
- ఆకట్టుకుంటున్న ఏపీ ప్రజానాట్యమండలి ఆట పాట మాట

**ఒంగోలు, ప్రభాతవార్త**




ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమ మార్గంలో నడిపే శక్తి పాటకు ఉందని ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర 18వ మహాసభలను పురస్కరించుకుని ఒంగోలులోని సీబీఎన్ రీడింగ్ రూమ్ హాలులో ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు కళా మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నల్లూరు వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు భూములు పంచింది, కూలి రేట్లు పెంచింది, కార్మికులకు హక్కులను, చట్టాలకై నిర్వహించిన పోరాటాలకు ఆయుధం అయింది పాట అని అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి పాటను తన ఆయుధంగా మలుచుకొని ప్రజా నాట్యమండలి పాటను తన ఆయుధంగా మలుచుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజా చైతన్యం కోసం, సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను రూపుమాపటం కోసం కళా ఉద్యమం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కళా ఉత్సవాల పేరుతో నిర్వహిస్తున్న కళారూపాలను ప్రజలు కళాకారులను ఉత్సాహపరచాలని ఈ సందర్భంగా కోరారు. సినీ గేయ రచయిత ఎస్కే మీరా మాట్లాడుతూ పామరులకు సైతం వేదిక ఇచ్చిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టు పార్టీ ది అని పేర్కొన్నారు. తాను చదివింది మూడో తరగతి అయినా ఎర్రజెండా నీడలో ఎన్నో పాటలు, ప్రజా ఉద్యమాలలో పాల్గొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్న నల్లూరి సాదరభ్యంలో శిలగా ఉన్న తాను శిల్పంగా తయారయ్యారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాను రాసిన భక్తి కోరిన బలి, కనురెప్ప, చర్లపల్లి భూపోరాటం, పద్మవ్యూహం అంటే నాటికలు ఎంతో ప్రజాదరణ పొందాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సభలో ఇంకా ధూళిపాళ్ల సీతారామయ్య, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కే నజీర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన డప్పు నృత్యం, అనంతపురం జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన విప్లవమా వర్ధిల్లు, ఆసాది ఆసాది, ఎర్రని జెండా వెలుగుల జెండా నృత్య రూపకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే కళాకారులు ఆలపించిన విప్లవమా విప్లవమా మీది మరువని చెరితేనమ్మ, భరతమాత తల్లడిల్లుతున్నది, ఈ మనువాదుల రాజ్యంలో, గద్దర్ రచించిన తెచ్చి పెడితే తిని కూర్చుంటావు, జోలాలి జోలాలి, వంగపండు రచించిన చిన్నది కాదయ్యో మంచి పాటలు ప్రజలను చైతన్య పరుస్తూ ఆలోచనలు రేకెత్తిస్తూ, మంత్ర ముగ్ధులను చేస్తూ, ఉద్రూతలూగించాయి. అనంతరం విశాఖ జిల్లా కళాకారులు ప్రదర్శించిన ఓ రాక్షసుడు నాటిక ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో మోదీ పాలనను గుర్తు చేస్తూ సాగింది.

### ప్రజా కళలతోనే సమాజ మార్పు సాధ్యం :గోరేటి వెంకన్న

స్థానిక ఎంసీఏ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోరేటి వెంకన్న మాట్లాడుతూ కళలు, సాంకేతికత, పెట్టుబడి ఇది మూడు కలవకూడదన్నారు. కళ అనేది అంతర్లీనంగా ఉండటం కోసం, శ్రమ దగ్గర ఉండటం, ప్రజలను ఆలోచింపజేసేలా, ఆనందింప చేసేలా ఉండాలన్నారు. వీటికి అతీతంగా ప్రస్తుతం ప్రజలను భయపెట్టడం కోసం, వ్యసన పరులుగా మార్చడం కోసం, ప్రజలలోని మానవ స్వభావంలోని వికృతత్వాన్ని పెంచడం కోసం వినియోగిస్తున్నారన్నారు. అయితే నేటి సినిమాలు బూతు సాహిత్యంతో నిండుకొని, ఇవే అసలైన కళలు అన్న తీరుగా భ్రమింప చేస్తున్నాయన్నారు. అయితే సినిమా చాలా గొప్పదని, అదే సినీ రంగంలో తమన్ బోస్, సత్యజిత్ రే, హృతిక్ ఘటక్ వంటి గొప్ప కళాకారులు, దర్శకులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే నేటి సినిమా వికృతం,, భయానకం, రాచరికం తో కూడిన హింసా సంస్కృతిని పెంచి పోషిస్తుందన్నారు. అయితే నేటికీ ప్రజా కళలకు, జానపదాలకు, పౌరాణిక సాహిత్యానికి ఇటువంటి ఆదరణ తగ్గలేదన్నారు. చీమకుర్తి నాగేశ్వరరావు, రజనీ భాయ్, ఏవి సుబ్బారావు వంటి వారి కళలకు నేటికీ ప్రాచుర్యం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్ కళ లు ఆధిపత్యం సాధిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ప్రజా కళలకు వన్నె తగ్గలేదన్నారు. విలువలతో కూడిన, మంచి సాహిత్యం కలిగిన,, ప్రజలను చైతన్య పరిచే కళలను ప్రజలు ఆదరిస్తుంటారన్నారు. అన్నమాచార్యులు, త్యాగయ్య, మంగళపల్లి బాలమురళీకృష్ణ లాంటి వారి సాహిత్యానికి ఎల్లప్పుడూ ఆదరణ కొనసాగుతుందన్నారు. అక్షరాన్ని నిషేధించే దమ్ము ఎవరికీ లేదన్నారు. సరస్వతిని ఎవరన్నా బంధించగలరా అని ప్రశ్నించారు. నిషేధించిన పుస్తకాలు మరింతగా ప్రజాదారణ పొందుతాయన్నారు. నిషేధం ఎల్లకాలం నిలవదు అన్నారు. ఇటీవల కాలంలో వచ్చిన రాను బొంబాయికి రాను జానపద గీతం కోట్ల మంది ఆదరణ పొందింది అన్నారు.

# గ్రామపంచాయతీ పురోగతి శిక్షణ తరగతులకు బాయికాట్

- అధికారులు కూటమి నాయకులు చెప్పినట్లు చేస్తున్నారు..
- నిధులు వెనకకు వెళ్లినా సరే వైసీపీ నాయకులకు ఇచ్చేదే లేదు..




**కొత్తపట్నం ఆగస్టు 22 ప్రభాతవార్త**

గ్రామపంచాయతీ పురోగతి శిక్షణ తరగతుల కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు బాయికాట్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామపంచాయతీ పురోగతిపై శిక్షణ తరగతులు కావాల్సి ఉంది. అయితే కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచులు బాయికాట్ చేశారు. అల్లూరి ఎంపిటిసి సభ్యుడు శాంతారావు మాట్లాడుతూ. రాజ్యాంగం బద్దంగా ఎన్నుకున్న ప్రజలు అధికారులు వారిని చిన్న చూపు చూస్తున్నారని. కూటమి నాయకులకు కొమ్ము కాస్తున్నారని తాను ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడాల్సిన అధికారులు కూటమి నాయకులకు బానిసలుగా వ్యవహరిస్తున్నారని సభ కార్యక్రమంలో చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే నలుగురు నడిచే రోడ్డుమీద గోడ కడితే దానిని నిలుపుదల చేయాలని అర్జీలు ఇచ్చిన పట్టించుకోలేదని ఈ ఈ శిక్షణ కార్యక్రమాలకు మేము అవసరమా, ఈ పురోగతి మాకెం దుకు, మమ్ములను లెక్క చేయరా అంటూ ప్రశ్నించి మాట్లాడి, శిక్షణ కార్యాలయం నుండి వెళ్లిపోయాడు. అదే విధంగా కే పల్లిపాలెం సర్పంచ్ విశ్వనాథ్ పల్లి ఆనందరావు మాట్లాడుతూ సర్పంచులకు రాజ్యాం గం హక్కు కల్పించారు. పంచాయతీకు సర్వహక్కులు సర్పంచులకు ఇచ్చారు. ఇక్కడ మేము పంచాయతీ పురోగతి గురించి మాట్లాడితే మేము చెప్పింది చేయకుండా ఎమ్మెల్యే, లోకలు కూటమి నాయకులు చెప్పినట్లు చేస్తున్నారని. నిజంగా వారి వృత్తికి వారు న్యాయం చేయటం లేదని అందువలనే నేను కూడా ఈ శిక్షణ కార్యాలయానికి బాయ్కాట్ చేసి వెళ్ళిపోతున్నానని వెళ్లిపోయాడు. అదేవిధంగా కొంతమంది ఎంపీటీసీలు సర్పంచులు వెళ్లిపోయారు అరకొర సర్పంచులతో శిక్షణ కార్యక్రమాన్ని ముగించారు.

# మాజీమంత్రి శిద్దా నివాసంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతవేడుకలు

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా ఒంగోలులోని వారి నివాసంలో రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి, ఆధ్వర్యంలో శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలు వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీవ్రతం పునస్కరించుకొని లక్ష్మీదేవిని శ్రీ వరలక్ష్మీ దేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. శిద్దా లక్ష్మీపద్మావతి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని బంగారు,ఆభరణాల అలంకారంలో సాక్ష్యాత్తూ వరాలిచ్చే వరలక్ష్మీ మాతగా భక్తులకు దర్శనం భాగ్యం కలిగించారు. వేద పండితులు నేలబోట్ల రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు, మన్యం సునీత, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మావతి అమ్మవారికి పసుపు కుంకుమ, స్వర్ణ ఆభరణాలు, పట్టు చీర, కలువ పుష్పాలు, కదంబ పుష్పాలు, సమర్పించారు.శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి దర్శనం చేసుకున్నారు. లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో భక్తులు ఆలపించిన అమ్మవారి భక్తి పాటలతో శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం శ్రీ వరలక్ష్మీ వ్రతానికి విచ్చేసిన ముత్తైదువులకు శిద్దా లక్ష్మీ పద్మావతి వారి కోడలు శిద్దా శృతి, కుమార్తె మన్యం సునీత, మనవరాలు శిద్దా ఆరాధ్య స్వయంగా అమ్మవారి తీర్థప్రసాదాలు,పసుపు కుంకుమలు ముత్తైదువులకు అందచేశారు. వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులకు, మన్యం సునీత లకు వేద ఆశీర్వదాలు, తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్.ఎల్.ఏ దామచర్ల జనార్దన్ సతీమణి దామచర్ల నాగ సత్యలత, శిద్దా కుటుంబ సభ్యులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఒంగోలు, చీమకుర్తి, దర్శికి చెందిన వాసవి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.









# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



**సింగరాయకొండ,ఆగస్టు22,ప్రభాతవార్త**
గ్రామపంచాయతీల స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సాధించిన పురోగతిని అంచనా వేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కృష్ణారావు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ పురోగతి సూచిక (PPI 2.0) శిక్షణా కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణారావు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తొమ్మిది థీములపై ఆచరణాత్మకమైన డేటా సేకరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు డేటా నమోదు సమయంలో ఖచ్చితత్వం, నాణ్యత పాటించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ వివరాలను అన్ని స్థాయిలలో సమగ్రపరచి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీల పనితీరు ఆధారంగా 2023-24 సంవత్సరానికి అవార్డులు నిర్ణయించనున్నట్లు కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు, పశువైద్యాధికారి హజరత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పిరయ్య, ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్, ఏపిఎం భాగ్యవతి, అంగన్వాడీ సూపర్వైజర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం



**పొన్నలూరు , ఆగస్టు 22, ప్రభాతవార్త**
స్థానికమండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ పురోగతి సూచిక 2.0 పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ పి.సుజాత మాట్లాడుతూ గ్రామ పంచాయతీల యొక్క పనితీరును పంచాయితీ పురోగతి సూచిక ద్వారా పరిశీలించివారికి మార్కులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన సమాచారంలో ఏవైనా పొరపాట్లు గుర్తిస్తే ఆయా శాఖల మండల స్థాయి అధికారులు వాటిని సరిచేయుటకు తిరిగి పంపించాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు వారు విధులు నిర్వహించే పంచాయతీలకు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించే విధంగా మెరుగైన స్కోరు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు .

## ఆంధ్ర కేసరిలో వృక్షో రక్షతి రక్షితఃకు అధిక ప్రాధాన్యత

### - మొక్కలు నాటిన వి.సి, ప్రిన్సిపాల్ తదితరులు





**ఒంగోలు - ప్రభాతవార్త**
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నందు " స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా వృక్షోరక్షతి రక్షితః విధానం ద్వారా మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతను కల్పించి యూనివర్సిటీ పరిసరాలను అత్యంత పచ్చదనంగా తీర్చి దిద్దుతామని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త డాక్టర్ మండే. హర్ష ప్రీతం దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్‌మూర్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్‌ఎన్. నిర్మలామణి, ఫైనాన్స్ అధికారి కృష్ణారావు తదితరులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి మాట్లాడుతూ మొక్కలను అధికంగా పెంచడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తాయని అంతేకాకుండా యూనివర్సిటీ పరిసరాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయని అన్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తారతమ్యం లేకుండా, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం ద్వారా హరిత వనాలను విరివిగా అభివృద్ధి చేయవచ్చునని, ఇందులో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ విద్యార్థులు తప్పకుండా భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. మొక్కలు నాటిన అనంతరం పలువురు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లకు వి.సి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్, ఆక్వా కల్చర్ విభాగం సహాయక ఆచార్యుడు డాక్టర్ బి.సురేష్, డాక్టర్ అశ్వర్థ నారాయణ, గార్డెనర్ రమేష్ తోబాటు బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఏ.కే.యూ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదు

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భరోసా

**దొనకొండ,ఆగస్టు 22,ప్రభాతవార్త**
అర్హులైన ఏ ఒక్కరికి పెన్షన్లు రద్దు కావని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగులు కాని వారు కూడా సర్టిఫికెట్లు పొందిన దందా వెలికి తీసేందుకే ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అని ఆమె వివరించారు. నిజమైన దివ్యాంగులకు ఎవరికైనా పెన్షన్ తొలగిస్తారన్న ఆందోళన అవసరం లేదని దర్శి నియోజకవర్గంలో అలా ఎక్కడైనా జరిగితే తనను సంప్రదించాలని డాక్టర్ లక్ష్మీ వివరించారు. వైసిపి సోషల్ మీడియా దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తారన్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు దివ్యాంగుల పెన్షన్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంపై సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఆమె తెలిపారు. పూర్తిగా ఆరోగ్యవంతులుగా ఉండి ఎలాంటి వైకల్యం లేకుండా అక్రమంగా సర్టిఫికెట్లు పొంది పెన్షన్లు పొందుతున్న వారికి మాత్రమే ఇది ఇబ్బందికరమని ఆమె తెలిపారు. అనర్హులైన పెన్షన్లను ధ్రువీకరించేందుకు మాత్రమే వైద్య బృందాలను నియమించడం జరిగిందని ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. నకిలీ పెన్షన్లు మాత్రమే తొలగిస్తారని అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దు కాదని ఆమె భరోసా ఇచ్చారు. అర్హులైన పెన్షన్ దారుల పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని దివ్యాంగులు ఎవరు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వివరించారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పెన్షన్లు హెల్త్ పెన్షన్లు పొందే వారికి కూడా ఎప్పటిలాగానే నెలల పెన్షన్లు అందుతాయని ఆమె తెలిపారు. వారికి ఇచ్చిన నోటీసులు కూడా వెనక్కి తీసుకోవాలని కూడా మన ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని ఆమె వివరించారు. దివ్యాంగుల సర్టిఫికేషన్ పేరుతో ఎవరైనా దళారులు డబ్బులు డిమాండ్ చేస్తే తనకు తెలియజేయాలని డాక్టర్ లక్ష్మి పెన్షన్ దారులను కోరారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

## ఎల్‌ఓసీ చెక్కు అందజేత





**మార్టూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అత్యవసర చికిత్స కొరకు లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్‌ఓసీ ద్వారా మార్టూరు గ్రామానికి చెందిన వెర్రబోయిన లలితశ్రీకు రూ.8లక్షలు మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో ఎస్సీ మాలకార్పొరేషన్ చైర్మన్ విజయ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పొగడదండ రవి, ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా పూనూరు గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అంజమ్మకు మంజూరైనరూ.70వేలు చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

# భూమిలో సేంద్రీయ కర్బనం పెంపొందించుకోవాలి



**అద్దంకి ,ఆగస్టు 22, ప్రభాతవార్త**
భూమిలో సేంద్రీయ కర్బనం పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ధర్మవరం రైతు సేవా కేంద్రం వద్ద ఆత్మ ప్రకాశం జిల్లా వారి సౌజన్యం తో భూసారాన్నిపెంపొందించుటకు తీసుకోవసిన చర్యలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని సూచించారు. భూసార పరీక్షలలో మండలంలోని భూములలో సేంద్రీయ కర్బనం చాలా తక్కువ ఉంది అని భూమిలో సేంద్రీయ కర్బనం పెంపొందించడానికి పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నాలని సూచించారు. వరి మరియు మొక్కజొన్న పంటలలో వచ్చే తెగుళ్ళు, పురుగుల గురించి తెలియజేసి వాటి సస్య రక్షణ చర్యల గురించి తెలియజేశారుమండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకం వలన భూసారం తగ్గిపోయి భూములు చౌడు బారిన పడుతున్నాయని ,బావి తరాలకు మంచి భూమి, ఆరోగ్యం అందించాలంటే రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రీయ కర్బనం పెంపొందించుకోవడానికి నవధాన్యాల సాగు శ్రేయస్కరమని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ పాలడుగు శేషారావు మాట్లాడుతూ ఆత్మ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో రైతులకు నూతన వంగడాలు, సాగు పద్ధతుల పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ కోట రామిరెడ్డి మాట్లాడుతూ అపరాల సాగులో మెళుకువలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ అశోక్ మాట్లాడుతూ ప్రతి రైతు కనీసం ఒక ఎకరా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చావల కళ్యాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు శేషయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ,గూడాల పెద్దిరెడ్డి, చాగంటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**అద్దంకి ,ఆగస్టు 22 ,ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు టవర్ లైన్ పనుల కారణంగా భవాని సెంటర్, వినాయక స్వామి గుడి వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఎడమవైపున, కాకాని పాలెం చుట్టుపక్కల ప్రాంతాలు నందు శనివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగును. సదరు పట్టణవాసులు ఈ విషయమును గమనించి తగు ముందస్తు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా డిఇ దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు.

## గ్రామ పంచాయతీల నందు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు నడుం బిగించండి

### - ఎంపీడీఓ సురేష్‌బాబు





**సంతనూతలపాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
గ్రామ పంచాయతీలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఐక్యంగా శిక్షణా తరగతుల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనకు నడుం బిగించాలని సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్ బాబు కోరారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు గ్రామ పంచాయతీ పురోగతి సూచికపై జరిగిన శిక్షణా తరగతులు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు ముఖ్య అభివృద్ధి అని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి ముందు సైడు కాలువలు లేకపోతే ఇంకుడు గుంటలు ఏర్పాటుకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను సంప్రదించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు వెల్లడించారు. పండ్ల తోటల పెంపకం కు పాటుపడాలన్నారు. ఈ శిక్షణా తరగతుల ద్వారా గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో ఉత్తమ అవార్డులు సాధనకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, గ్రామాల అభివృద్ధి అధికారులు పాటుపడాలని ఎంపీడీఓ సురేష్‌బాబు కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, కార్యదర్శులు ఐక్యంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధికి పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, తమతమ ప్రసంగాల్లో కోరారు. గ్రామాల్లో నీటిని సంరక్షించుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒక సారి శానిటేషన్ చేపట్టాలని, ప్రతి రోజు తాగునీటిని క్లోరినేషన్ కార్యక్రమం నిర్వహించాలని, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈబీ మధుసూదన్‌రావు ఈ శిక్షణ తరగతుల్లో పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని వేములపాడు ఆరోగ్యశాఖ ప్రతినిధి బి.శేషారావు శిక్షణ తరగతుల్లో వివరించారు. దోమలు నివారణ చర్యలకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. గ్రామ పంచాయతీలలో పురోగతి, ముఖ్యంగా పారదర్శకత, సుపరిపాలన తదితర 9 అంశాలపై శిక్షణా తరగతులలో రిసోర్స్ పర్సన్ మైనంపాడు పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్ వివరించారు. ఆరోగ్యం, నీటి సంవృద్ధి, ఆరోగ్యవంతమైన గ్రామం, పచ్చదనంతో కూడిన గ్రామం, మౌలిక సదుపాయాలు, తదితర వాటిపై వివరించారు. 2023-24 శిక్షణ యాక్షన్ ప్లాన్ 2025-26 తయారీపై శిక్షణా తరగతుల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ రమణమ్మ, మండల పరిషత్ ఏవో శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, పార్వతీ బాయ్, ఆర్‌డబ్ల్యూసీ జేఈ మధుసూదన్‌రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఈసీ ఈశ్వరి, వైస్ ఎంపీపీలు మండవ సులోచన, తన్నీరు రాగమ్మలు, ఎంపీటీసీలు బడే వెంకట కిష్టారెడ్డి, ఎల్.నాగేశ్వరరావు, సర్పంచ్‌లు ఎం.రామానాయుడు, ఓ.బలరామిరెడ్డి, డి.రమణ, దర్శి నాగమణి, నాదెండ్ల మల్లయ్య, బొడ్డురామారావు, ఈర్ల విజయలక్ష్మి, పి.శైలజ అమర్నాథ్, ఆరోగ్యశాఖ ప్రతినిధి శేషారావు, కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

### - 15 లక్షల సొత్తు స్వాధీనం

### - 102 గ్రాములు బంగారం, 230 గ్రాముల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు రికవరీ





**బల్లికురవ, ఆగస్టు 22, ప్రభాతవార్త**
బాపట్ల, పలనాడు, తూర్పుగోదావరి, కర్నూలు, జిల్లాల్లోనివాస గేహాలు చోరీలు, ద్విచక్ర వాహనాల అపహరణకు పాల్పడ్డ అంతర్ జిల్లాల దొంగ కత్తి రవికుమార్‌ను శుక్రవారం మండలంలోని గొర్రెపాడు క్రాస్ రోడ్డువద్ద, పోలీసులు అరెస్టుచేశారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు పర్యవేక్షణలో సంతమాగులూరు సీఐ వెంకటరావు సారథ్యంలో బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభి రామారావు సిబ్బందితో కూడిన రెండు బృందాలు ప్రత్యేక వ్యూహంతో ముద్దాయిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన కత్తిరవికుమార్ 18 సంవత్సరాలవయసు నుండి దుర్వ్యసనాలకు బానిసై, గృహదొంగతనాలు, ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతూ పలు సందర్భాలలో పోలీసులు అరెస్టు చేయగా, జైలుకు వెళ్ళటం, తిరిగి బెయిల్‌పై రావడం, మరలా చోరీలకు పాల్పడటం జైలుకు వెళ్లడం ఇదే వృత్తిగా కొనసాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో జరిగిన చోరీ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసు యంత్రాంగం ఈ కేసును ఛేధించేందుకు బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభిరామయ్యతో కూడిన రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ముద్దాయి రవికుమార్ నుండి మొత్తం ఐదు కేసులలో 102 గ్రాములు బంగారం, 230 గ్రాముల వెండి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ పరిధిలో ఒక కేసులో 32 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, పల్నాడు జిల్లా పరిధిలో నాదెండ్ల పోలీసు స్టేషన్ పరిధిలో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీసు స్టేషన్‌పరిధిలో ఒక కేసులో ఒక ద్విచక్ర వాహనం, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, కర్నూలు జిల్లా కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక కేసులో 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అంతర్ జిల్లాల దొంగ కత్తి రవికుమార్‌ను అరెస్టు చేయటంలో విశేష ప్రతిభ కనపరిచిన బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులును, సంతమాగులూరు సీఐ కే.వెంకటరావు, బల్లికురవ ఎస్సై వై.నాగరాజును, సంతమాగులూరు ఎస్సై ఎం.పట్టాభిరామయ్యను జిల్లా ఎస్పీ తుషార్ డుడి అభినందించి రివార్డు ప్రకటించారు.

## పమిడిపాడు హాస్టల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**కొరిశపాడు ,ఆగస్టు 22, ప్రభాతవార్త**
మండలంలోని పమిడిపాడు గ్రామంలోని హాస్టల్ విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ పాత్రికేయులు దివంగత పేరం బాబురావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం హాస్టల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పమిడిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు ఇతర విద్యాసామాగ్రిని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబురావు తన పాత్రికేయ వృత్తిలో మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం లో కూడా అందరికీ తలలో నాలుకలా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారన్నారు బాబురావు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు విద్యార్థులకు ఈ విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టటం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో ఏ హాస్టల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని తాను కోరుకుంటున్నాను అని అందుకు నిర్వాహకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు హాస్టల్ వార్డెన్ సామ్యూల్ జార్జ్, బాబురావు తనయుడు సతీష్, సౌజన్య, చిన్న హనుమంతరావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నవరాత్రుల మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



**జె. పంగులూరు ,ఆగష్టు 22, ప్రభాతవార్త**
మండలంలోని ప్రజలు గ్రామాలలో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని రేణింగవరం ఎస్సై వినోద్ బాబు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై వినోద్ బాబు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకుని వినాయకుని విగ్రహాలు పెట్టి ఉత్సవాల నిర్వహించుకొనేవారు ముందుగా పోలీస్‌శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రశాంతంగా, శాంతియుతంగా అందరి సహాయ సహకారంతో ఉత్సాహంగా నిర్వహించుకోవాలన్నారు. మండపాలలో యంత్రాలను, సౌండ్ సిస్టలు రాత్రి పది గంటల తరువాత వినియోగించరాదన్నారు. ట్రాఫిక్ కు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, మద్యం సేవించి వేడుకలలో పాల్గొనరాదన్నారు. అశాంతి, అసౌకర్యాలు కలిగించే నినాదాలు, పాటలు ప్రదర్శనలను పూర్తిగా నిషేధం. నిమజ్జనం సమయంలో క్రమశిక్షణ పాటించి పోలీసుశాఖ సూచించిన మార్గాలలోనే వెళ్లాలన్నారు. నిర్వాహకులు మండపాలలో సీసీ కెమెరాను, ఫైర్ ఎక్స్‌ంగ్విషర్ వంటి భద్రత చర్యలు చేపట్టాలని, ఎవరైనా అనుమానాస్పదమైన వ్యక్తులు మండపాలలో సంచరించిన గమనించి వెంట 112 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వినాయక విగ్రహమును ఏర్పాటు చేసుకొనుటకు మండపం కమిటీ మెంబర్స్ పోలీస్ వారి పరిమిషన్ కొరకు పోలీస్ యాప్ లో నమోదు చేసుకోవాలని, సరైన పత్రాలు ఉండాలని, అందులోనే పర్మిషన్ కూడా జారీ చేయడం జరుగుతుందనన్నారు. వినాయక మండపా లు ఏర్పాటు చేసినవారు రాత్రి సమయంలో అక్కడ పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. వినాయక విగ్రహం ఊరేగింపు సమయంలో గానీ, మండపాల వద్ద గాని, బాణసంచా పేల్చడం చేయరాదు. ప్రజలందరూ పోలీసులు ఇచ్చే ఈ సూచనలు పాటించి వినాయక నవరాత్రుల పండుగను ప్రశాంతంగా, శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్!



**దొనకొండ,ఆగస్టు 22,ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆయా మండలాలకు శుక్రవారం నాటికి స్మార్ట్ కార్డులు చేరుతాయి. ఈ నెల 25న కార్డుల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాలకు చేరిన కార్డులను సచివాలయాలకు తరలిస్తారు. ఆ పై సిబ్బంది ద్వారా నేరుగా కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు.

25 నుంచి పంపిణీకి ఏర్పాట్లు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు ప్రింటింగ్ కార్యాలయాల నుంచి మండలాలకు చేరాయి. ఈ నెల 25 నుంచి కార్డుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు అందజేయనున్నారు. దీనిపై కార్డుదారు ఫొటో, కుటుంబసభ్యుల వివరాలు ఉంటాయి. కొత్తగా స్మార్ట్ ఈపోస్ మెషీన్లనూ అందుబాటులోకి తీసుకురానున్నారు.

## ఘనంగా మా లక్ష్మమ్మ తల్లికి పూజలు



**సింగరాయకొండ, ఆగస్టు 22,ప్రభాతవార్త**
మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రావణ శుక్రవారం సందర్భంగా మా లక్ష్మమ్మ తల్లికి విశేషా పూజలు నిర్వహించారు. ముందుగా మా లక్ష్మమ్మ తల్లినీ పసుపు, కుంకుమ పూలమాలలుతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మా లక్ష్మమ్మ తల్లి కలిశంతో బోళ్లావులతో ఊరేగింపుగా గ్రామ ప్రధాన వీధుల్లో కోలాహలం గా ఊరేగించారు. అనంతరం మహిళలు వడపప్పు పానకం నైవేద్యంగా సమర్పించి మాలక్ష్మమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా లు పాల్గొన్నారు.

## కనిగిరి పరిశుభ్రతకు కమీషనర్ స్పెషల్ యాక్షన్ ప్లాన్



**కనిగిరి, ఆగష్టు 22, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో పారిశుధ్య సమస్యల పరిష్కారంపై మున్సిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్‌రెడ్డి శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం కార్యాలయం లో శానిటరీ సెక్రటరీలతో జరిగిన ఈ సమావేశంలో పట్టణ పరిశుభ్రతకు సంబంధించిన అనేక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

**ఇంటింటి చెత్త సేకరణపై దృష్టి :**
పట్టణంలోని ప్రతి ఇంటి నుండి చెత్తను 100 శాతం సేకరించాలని, అలాగే తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా వేరు చేసి తరలించాలని కమీషనర్ ఆదేశించారు.

**మురుగు నీరు నిల్వపై కఠిన చర్యలు :**
మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆయన సూచించారు. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీస్థలాలనుశుభ్రపరచకపోతే సంబంధిత యజమానులకు నోటీసులుఇవ్వాలని ఆదేశించారు. అలాగే నీరు నిల్వ ఉండకుండా పిచ్చి మొక్కలను తొలగించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**దోమల నియంత్రణ ప్రత్యేక చర్యలు :**
పట్టణంలో ఎక్కడా దోమల లార్వా పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమీషనర్ ఆదేశించారు. నీరు నిలిచిన ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయడం, యాంటీ లార్వా పిచికారి నిరంతరంగా నిర్వహించాలని సూచించారు.

**ఫిర్యాదులపై తక్షణ స్పందన :**
పౌరులు అందించే పారిశుధ్య ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందిని హెచ్చరించారు.

**స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా హ్యాండ్ వాష్ కార్యక్రమం :**
రేపు శనివారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరగనున్న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర 2047లో భాగంగా హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమీషనర్ కోరారు. సమావేశంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వివిధసచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఆకుపాటి ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు





**పామూరు, ఆగష్టు 22, ప్రభాతవార్త**
ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో మెగాస్టార్ 70వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బెంగుళూరు బి..నారాయణపురలోని జీఎంఆర్‌పీజీ నందు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలలో ముఖ్య అతిథిగా కర్ణాటక (రాయల్ పీపుల్స్ ఫ్రంట్) అధ్యక్షులు మంజునాథ్ రాయల్, ప్రకాశం జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మహేంద్ర, పాలపర్తి రాంబాబు తదితరులు ఆకుపాటి మిత్రబృందం పాల్గొన్నారు. తొలుత కేక్‌ను కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పురోగతి సూచికలో అందరూ భాగస్వాములు కావాలి



**రాచర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త**
పురోగతి సూచికలో అందరూ భాగస్వాములు కావాలని మండల ఎంపిడిఓ సూర వెంకట రామిరెడ్డి శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో అన్నారు. ఈ కార్యక్రమం గురించి రాచర్ల ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం అన్నిశాఖల అధికారులకు, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ,కార్యదర్శులు, అన్నిశాఖల అధికారుల కు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పురోగతిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. సంవత్సరానికి సంబంధించి చేపట్టే కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ఎన్నుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యం అన్నారు. అధికారులు బాధ్యతగా ఈ కార్యక్రమం విజయవంతానికి కృషిచేయాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు కూడా అధికారులకు సహకారం అందించాలన్నారు. ప్రజలు సంపూర్ణ సహకారం అందించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ వాడకూడదు - ఎస్సై మహమ్మద్ రఫీ



**కొరిశపాడు ,ఆగస్టు 22, ప్రభాతవార్త**
ఈగల్ టీం బాపట్ల ఆధ్వర్యంలో మేదరమెట్లలో జరిగిన అవేర్నెస్ ప్రోగ్రాం లో పాల్గొన్న విద్యార్థులకు మహమ్మద్ రఫీ డ్రగ్స్ వాడకూడదు అని పిలుపు నిచ్చారు. శుక్రవారం మేదరమెట్లలోని రాధాస్ గీతం స్కూలులో విద్యార్థిని విద్యార్థులకు బాపట్ల ఈగల్ టీం డ్రగ్స్ నివారణగురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ మహమ్మద్ రఫీ విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వలన కలిగే అనేక దుష్పరిణామాలను గురించి సవివరంగా వివరించారు. అంతేకాక డ్రగ్స్ వినియోగించిన రవాణా చేసిన కఠిన శిక్షలకు గురువుతారని ఆ నేరాలకు విధించే శిక్షల గురించి తెలియజేశారు. సరదా కోసం మొదలై వ్యసనంగా మారుతాయి, మాదకద్రవ్యాల వాడకం జీవితాన్ని చిదిమేస్తాయి డ్రగ్స్ వాడవద్దు బ్రో వంటి నినాదాలను ప్రదర్శింపజేశారు. ఇలా డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు స్క్రీన్ మీద ప్రదర్శింపజేశారు. అలాగే నిషేధిత డ్రగ్స్ గురించి సమాచారం అధికారులకు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1972 గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది జిల్లా ఈగల్ టీం సభ్యులు రాధాస్ గీతం స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాళ్లూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
మండలంలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తాళ్లూరు విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. దొడ్డవరం, ఇలపావులూరు గ్రామాల మధ్య విద్యుత్ లైన్ ఏర్పాటు కారణంగా గుండ్లపల్లి నుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. తాళ్లూరు, శివరాంపురం, మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు శివరాంపురం, కొర్రపాటివారిపాలెం, తాళ్లూరు, విఠలాపురం, రజానగరం, మాధవరం, కొత్తపాలెం రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. ఆయా గ్రామాల రైతులకు శుక్రవారం రాత్రి 7గంటల నుండి ఉదయం వరకు వ్యవసాయ విద్యుత్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కావున రైతులు విషయాన్ని గమనించి శనివారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఆయా గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

## వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి

### - సీఐ వెంకట్రావు



**బల్లికురవ, ఆగస్టు 22, ప్రభాతవార్త**
గ్రామాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయకముందే పోలీసుశాఖ అనుమతులు తీసుకోవాలని సంతమాగులూరు సీఐ వెంకట్రావు వినాయక విగ్రహ కమిటీలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్లో బల్లికురవ ఎస్సై వై.నాగరాజు,సంతమాగులూరు ఎస్సై ఎం.పట్టాభిరామయ్యలతో పత్రికా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ కనీసం ఐదుగురు సభ్యులు ఉండాలని, గుర్తింపు కార్డులు, యజమాని అనుమతి తప్పనిసరి అన్నారు. మండపాల వద్ద అగ్నిమాపక, విద్యుత్ భద్రత చర్యలు ఉండాలన్నారు. విగ్రహ ఎత్తు, బరువు, నిమజ్జన తేది, సమయం, ప్రదేశం, తదితర వివరాలు పోలీసులకు ముందుగానే తెలియచేయాలన్నారు. అదే విధంగా వినాయక మండపాలు రోడ్లపై ఏర్పాటు చేయకూడదని, నిమజ్జన సమయంలో మత్తు పదార్థాలు నిషేధించటమైందని అన్నారు. ఉత్సవ సమయాల్లో అనుమానస్పద పరిస్థితులు గమనిస్తే సత్వరం పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. వినాయక చవితి ఆరంభం నుండి నిమజ్జనం వరకు పచ్చని పల్లె సీమలలో శాంతి వెల్లివిరియాలన్నారు. ప్రజలంతా పోలీసుశాఖకు తమ వంతు సహకారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

## బొబ్బేపల్లి గ్రామంలోని పాఠశాలలను పరిశీలించిన ఎంఈఓ



**మార్టూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
మండలంలోని బొబ్బేపల్లి గ్రామం నందు ఎస్సీ కాలనీలోని పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్ సందర్శించారు. మొదటిగా పడమర ఎస్సీ కాలనీలోని ఫౌండేషన్ పాఠశాలను సందర్శించి అక్కడ కేవలం రెండో తరగతిలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండటాన్ని గమనించి విద్యార్థుల సంఖ్యను పెంచటానికి తగిన ప్రణాళిక చేసుకొని, పరిసర ప్రాంత పేరెంట్స్, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకొని ఎన్‌రోల్‌మెంట్ పెరగటానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా టీచర్ రమాదేవికి సూచించారు. అనంతరం తూర్పు ఎస్సీ కాలనీ నందున్న ఎల్ఈ పాఠశాలను కూడా సందర్శించి పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న తరగతి గదిని పరిశీలించి దానిని తరగతి గదులు నిర్వహించడానికి ఉపయోగించవద్దని పాఠశాల టీచర్‌కు సూచించి శిథిలావస్థలో ఉన్న తరగతి గదిని తగిన మరమ్మత్తులు చేయించడానికి మండల సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం వారితో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. తదుపరి మధ్యాహ్న భోజనాన్ని, ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన సెల్ఫ్ అసెస్మెంట్ బుక్లెట్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఆర్పీ జి.రమేష్ పాల్గొన్నారు.

## పట్టు పురుగుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ



**కొనకనమిట్ల, ఆగస్టు 22, ప్రభాతవార్త**
మండలంలోని ముగనపాడులో మేరా రేషమ్ మేరా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టుపురుగుల పెంపకం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన శిక్షణ నిర్వహించారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి డాక్టర్ సుజయ్ కుమార్ మాట్లాడుతూ జాగ్రత్త తీసుకొని పట్టు పరిశ్రమ చేపట్టినట్లయితే లాభాలు పొందవచ్చు అన్నారు. పట్టు పరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మైసూర్ సీఎస్ఆర్ ఎఫ్ టీఐ శాస్త్రవేత్త డాక్టర్ జాయిస్ రాణి, డాక్టర్ పురుషోత్తమ్(రిటైర్డ్ జేడీసీఎస్ఆర్ఎఫ్‌టీఐ' శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ పొదిలి టీఏ ఇన్‌ఛార్జీ వి.పాండురంగస్వామి మార్కాపురం ఏఎస్ఓ శ్రీధర్, సాంకేతిక సహాయకులు వెంకటేశ్వరరెడ్డి,బి.రఫీ, చిన్నచెంచయ్య, సుధారాణి, క్షేత్ర సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరం



**కొనకనమిట్ల, ఆగస్టు 22, ప్రభాతవార్త**
గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరమని ఇన్‌ఛార్జీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో శుక్రవారం జరిగిన పంచాయతీ పురోగతి 2.0 సూచికలో ఒక్క రోజు శిక్షన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వారి గ్రామపంచాయతీ అభివృద్ధి చేసుకొనుటకు అధికారులకు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిసోర్స్ పర్సన్ తిరుపతయ్య శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మోరబోయిన మురళీకృష్ణ, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఈవోఆర్డీ జి.శ్రీదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న విఠలాపురం వాసి




**తాళ్లూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
గ్రామ్య సంవృద్ధి గ్రామ్, సంవృద్ధి భారత్ ఇనిషియేషన్ వార అందించిన గ్రామ ఐకానిక్ అవార్డు-2025 ను మండలంలోని విఠలాపురం వాసి మారం అనంతరెడ్డి అందుకున్నారు. న్యూఢిల్లీ డిప్యూటీ స్పీకర్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రధానంలో సీఎండీ ఛైర్మన్, ఏఎన్ఏఆర్ఈ గ్రామ్య అధ్యక్షుడు డాక్టర్ పంజాబ్ శుక్లా చేతుల మీదుగా ఐకానిక్ -25 అవార్డును అందుకున్నారు. ప్రకాశం జిల్లాలో అత్యధిక పాల ఉత్పత్తితో పాటు, దేవాలయాల నిర్మాణానికి, సాంస్కృతిక సంరక్షణ, గో సేవకు ఆయన చేసిన అసాధారణ కృషికి, అంకిత భావంకు, ప్రభాత వంతమైన సేవకు గాను ఈ గ్రామ్య ఐకానిక్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న అనంతరెడ్డిని ఆయన బంధుమిత్రులు, తోటి రైతులు అభినందనలు తెలిపారు.

## పంచాయతీ అభివృద్ధికి దోహదపడండి



**నాగులుప్పలపాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
పంచాయతీ అభివృద్ధికి ప్రనాళికలు సిద్ధం చేసుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో దోహదపడాలని ఎంపీడీఓ తేళ్ళ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై ఎంపీటీసీలు,సర్పంచ్‌లు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సుస్థిరత అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గ్రామ పంచాయతీల్లో 9 అంశాలపై 556 సూచికలకు సంబంధించి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల పురోగతి సూచికల యాప్‌లో నమోదు చేయాలన్నారు. అధికారులు సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్త వహించి శ్రద్ధతో సమాచారం అందించడం ద్వారా దేశంలో 2.50 లక్షల గ్రామాల అభివృద్ధికి అంచనా వేయడం సుసాధ్యమవుతుందని తెలిపారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ఉత్తమగ్రామాలుగా తీర్చిదిద్దుకోవడానికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి, ఎంపీపీ నలమలపు అంజమ్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన



**టంగుటూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశముల మేరకు ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలో డ్యాప్కు లీడ్ ఎన్జీవో - మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నాడు టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మదర్ ల్యాండ్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమాజంలో కలిసి మెలిసి ఉండాలని, ఎఆర్‌టీ మందుల వాడకం గురించి వివరించారు .ఈ కార్యక్రమంలో మద్ ల్యాండ్ సొసైటీ సిబ్బంది ఎం.వెంకటరావు, కే.నాగమణి, ఏ.సుభాషిణి, పీఈలు పాల్గొన్నారు.

## పీఆర్ఆర్ జడ్పీహెచ్ ప్లస్ జూనియర్ కాలేజీలో ఎయిడ్స్‌పై అవగాహన



**టంగుటూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో గురువారం గ్రో ఆర్గనైజేషన్ సీసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు కరవదిలోని పీఆర్ఆర్ జడ్పీహెచ్ ప్లస్ జూనియర్ కాలేజీ ఆవరణం లో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు ప్రతినిధి అయినటువంటి ఆర్.భవానీ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి కారకాలు ఎలా వ్యాపించదు, మెచ్ఐవీ యొక్క లక్షణాలు అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలాగా కలిసి జీవించాలో, క్షయవ్యాధి సంబందం గురించి, సుఖ వ్యాధులు, చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగాలు గురించి హెచ్ఐవీ యాక్ట్ 2017 ఏఆర్టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ మీ ద్వారా తెలియని వారికి తెలియపరచడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఎన్.రవికుమార్ సహకారంతో కళాశాల సైన్స్ టీచర్ అయిన ఈ.లక్ష్మీ ప్రసన్న, ఏ.పద్మ ఫిలోమైనా, వి.అరుణ, ఎం.వెంకట్రావు, ఎస్కే బ్రాహ్మణి, ఎల్ శివపార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



**పుల్లలచెరువు, ఆగస్టు 22 ,ప్రభాతవార్త**
వినాయక చవితి సందర్భంగా మండలం లో ఏర్పాటు చేయనున్న గణపతి మండపాలకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని విలేకరుల సమావేశంలో సిఐ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు అందరూ సహకరించాలన్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే మండపాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల నిర్వహణకు కొన్ని నిబంధనలు పాటించాలని సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రాంతం వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించకూడదని, రహదారిని అడ్డుకునే విధంగా ఉండకూడదని, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే లౌడ్ స్పీకర్లు ఉపయోగించేటప్పుడు అనుమతించిన సమయాల్లోనే వాడాలని,అతిశబ్దం వలన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జం సందర్భంగా శాంతిభద్రతల విషయంలో ప్రతి మండప నిర్వాహక సంఘం పోలీసులతో సమన్వయం చేసుకోవాలని, ర్యాలీలు లేదా శోభాయాత్రలు చేపట్టాలంటే ముందుగానే తెలియజేసి అనుమతులు పొందాలని తెలిపారు. గ్రామ పంచాయితీ అధికారులు, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. ప్రభుత్వం, పోలీసులు నిర్దేశించిన నిబంధనలు పాటిస్తే ఎటువంటి సమస్యలు ఉండవని, అన్ని అనుమతులు పొందిన మండపాలకు పోలీసులు పూర్తి భద్రత కల్పిసార్తరని తెలిపారు. అలాగే బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టడం నేరమని అటువంటి యాప్‌లను దేశంలో నిషేధించారని సిఐ అన్నారు. సోషల్ మీడియా వేధికగా కొంతమంది ప్రజలను మోసపూరిత యాప్‌లతో మోసపుచ్చుతున్నారని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ఈ యాప్‌లు మాస్టర్, హాగ్, షేర్ బూస్టర్, హీజ్ ఇవన్నీ మోసపూరిత యాప్‌లు వచ్చాయని ఈ యాప్‌లను నమ్మి యువత మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంపత్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కందిపంట సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం



**అర్ధవీడు, ఆగస్టు 22 ,ప్రభాతవార్త**
మండలంలోని కాకర్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ ఆధ్వర్యంలో కంది పంట వేసే ముందుగా రైతులు తమ పొలాలలో మట్టి నమూనాలు తీసుకోవాలని తెలిపారు. కంది పంట వేసే పొలాలలో ఒక ఎకరాకు 10 నుంచి 15 నమూనాలను సేకరించి మొత్తం మట్టిని కలిపి నాలుగు సమభాగాలుగా చేసి ఎదురెదురు భాగాలను తొలగించి మిగిలిన రెండు భాగాలను కలపాలని సూచించారు. ఇలా 500గ్రాముల మట్టి వచ్చే విధంగా చేసుకుంటూ పోవాలని తీసుకున్నటువంటి మట్టిని శుభ్రంగా జల్లిపోసి మట్టి పరీక్ష కేంద్రాలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏ ఉమర్, గ్రామరైతులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి


### - ఏవో విజయభాస్కర్ రెడ్డి



**గిద్దలూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మండలంలోని సంజీవరాయునిపేట, వెల్లుపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆత్మ పథకంలో భాగంగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరాయునిపేటలో పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు జిగురు అట్టలు (పసుపు పచ్చ, బులుగు, తెలుపు అట్టలు) ఉపయోగించుటపై ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేసి వాటి వలన కలిగే ఉపయోగాలని వివరించారు. పసుపు పచ్చ జిగురు అట్టలు ఉపయోగించడం వలన పేనుబంక, ఆకుతొలుచు పురుగులు, తామర పురుగులు, పచ్చదోమ, ఈగలు, తెల్లదోమ మొదలైన కీటకాలను ఆకర్షించి నిర్మూలించడానికి ఉపయోగపడతాయన్నారు. వెల్లుపల్లి గ్రామంలో రసాయనిక ఎరువులు (యూరియా, కాంప్లెక్స్) ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ జీవ ఎరువులు మరియు నానో ఎరువులు అయిన నానో యూరియా, నానో డిఏపి వాడకంపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించి జీవ ఎరువులు మరియు నానో ఎరువులు యొక్క ఉపయోగాన్ని తెలియజేస్తూ ఖర్చును ఏవిధంగా తగ్గించుకోవాలో తెలియజేసి నానో యూరియా, నానో డిఏపిని రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శంకరమ్మ, వరలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన పార్వతి అమ్మవారి శ్రావణమాస వేడుకలు





**సంతనూతలపాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి వారి ఆలయంలో శుక్రవారంతో ఘనంగా శ్రావణమాస వేడుకలు ముగిసినవి. జులై 21వ తేదీన ఆలయంలో శ్రావణమాసం వేడుకలు ప్రారంభం కాగా ఈనెల 22వ తేదీతో ఈ వేడుకలు ముగిసినవి. ప్రతి శుక్రవారం నాడు శ్రావణమాసంలో పార్వతి అమ్మవారికి అభిషేకాలు, వస్త్రాలంకరణ, పూలంగి సేవ, శ్రీసూక్త , దుర్గా సూక్త, మన్య సూక్త సహస్రనామ కుంకుమ పూజలు జరిగాయి.ఈ సందర్భంగా శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.బుచ్చిబాబు శర్మ ఆధ్వర్యంలో పండితులు ఎస్.పృద్వి శశాంక శేఖర్ శర్మ తదితరులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎండోమెంట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎన్.నారాయణరెడ్డి, ఆలయ ఛైర్మన్ శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, అర్చకులు సోమరాజుపల్లి, బుజ్జిబాబుశర్మ ఆధ్వర్యంలో ఎండోమెంట్,దాతలు సహకారంతో ఘనంగా శ్రావణమాసం వేడుకలు జరిగాయి. సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు నేలబట్ల శ్రీనివాసాశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఘనంగా ఈ వేడుకలు జరుగుతున్నాయి.

## వల్లూరమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**టంగుటూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన దేవాలయంలో ఒకటైన టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ దేవస్థానం నందు శ్రావణమాసం సందర్భంగా చివరి శుక్రవారం మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2000 మంది మహిళా భక్తులు పాల్గొని వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి కూడా దేవస్థానం వారు పూజా సామాగ్రి కిట్లు అంతయును దాతలు ద్వారా ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2 వేల మంది మహిళలు పాల్గొని కన్నుల పండుగగా ఉందని చాలా సంతోషంగా ఉందని తెలియజేయడం జరిగింది. ఇంత పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని తమ యొక్క పూజలు నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియజేశారు. అదే విధంగా ఈ యొక్క పూజా కార్యక్రమాలకు సహకరించిన దాతలకు పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. వరలక్ష్మీ వ్రతాలలో పాల్గొన్న మహిళ భక్తులు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా దేవస్థానం అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాటు నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. పూజ కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, వారి ధర్మపత్ని విజయలక్ష్మీ పాల్గొన్నారు. అదే విధంగా ఒంగోలు శాసనసభ్యులు సతీమణి నాగసత్యలత పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ యొక్క వరలక్ష్మీ వ్రత కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రతి పేరుపేరునా దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

## జనసేన వీర మహిళలకు చీరలు పంపిణీ



**సింగరాయకొండ, ఆగస్టు 22, ప్రభాతవార్త**
పట్టణంలో మండల జనసేన కార్యాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ ఆధ్వర్యంలో వీర మహిళాలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వీరమహిళలు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాజేష్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు.నీతి,నిజాయితీ, పట్టుదలతో ముందుకు సాగుతూ పార్టీని బలపరుస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల అధ్యక్షులు గూడ శశిభూషణ్, సొసైటీ కూనపరెడ్డి రంగారావు, సంగు వసంతయ్య, మండల ప్రధాన కార్యదర్శి కాసులశ్రీనివాస్, కార్యదర్శులు అనుములశెట్టి కిరణ్‌బాబు, గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి తగరం రాజు తదితరులు పాల్గొన్నారు.

## 28న రాష్ట్ర సిపిఐ మహాసభలు జయప్రదం చేయాలి

### - సిపిఐ సీనియర్ నాయకులు అందె నాసరయ్య



**మార్కాపురం రూరల్, ఆగస్టు 22, ప్రభాతవార్త**
పట్టణంలోని పూలసుబ్బయ్య భవన్‌లో శుక్రవారం ఏఐటియుసి కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా సిపిఐ సీనియర్ నాయకులు అందె నాసరయ్య పాల్గొని మాట్లాడుతూ ఒంగోలు నందు శనివారం జరగనున్న 28వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని, 1000మందికి తగ్గకుండా కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కొన్ని తీర్మాణాలు ప్రస్తావించారు. మున్సిపల్ పరిధి నుంచి పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు వెంటనే 2వేలకోట్లు కేటాయించాలని, మార్కాపురం పట్టణమును జిల్లాగా చేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను వెంటనే పున:ప్రారంభించాలని, పేదలకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలని, పల్లెటూర్లలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండుసెంట్లు ఇవ్వాలని రాష్ట్ర మహాసభలో తీర్మాణం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హరిబాబు, యేసు, రాజు, కోటమ్మ, ఖాశింబీ, తదితరులు పాల్గొన్నారు.

## నిన్ను మరువము వీరన్న..

## ఘనంగా కంచర్ల వీరయ్య 3వ వర్ధంతి కార్యక్రమం



**పుల్లలచెరువు, ఆగస్టు 22, ప్రభాతవార్త**
పుల్లలచెరువు మండల కేంద్రంలో వైసిపి మండల నాయకులు, ఎర్రగొండపాలెం మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ కంచర్ల వీరయ్య యాదవ్ 3వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, చాపలమడుగు సర్పంచ్ సత్తిరెడ్డి మాట్లాడుతూ పుల్లలచెరువు మండలానికి ఎన్నో సేవలు అందించిన మన కంచర్ల వీరయ్య అన్న వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించడం బాధాకరం అన్నారు. ఆయన లేని లోటు తీరనిదని యాదవ సామాజిక వర్గానికి, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయాలు అన్నారు. మండలపార్టీ అధ్యక్ష పదవి పొందడం ఆయన కృషి, నిజాయితీకి నిదర్శనం అన్నారు. ఎవరు ఇబ్బందిలో ఉన్నా ముందుండి అండగా నిలిచిన వ్యక్తి వీరయ్య అన్నారు. నీకు ఎటువంటి ఇబ్బంది రానివ్వను అని నమ్మకం ఇచ్చిన మన పెద్దలు ఈ రోజు మనతో లేరన్న విషయం కలచివేస్తోందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కుటుంబ సభ్యులు కూడా కష్టాలను ఎదుర్కొంటూ పార్టీకోసం శ్రమిస్తున్నారన్నారు. అలాంటి కుటుంబానికి మనం అండగా నిలవడం మనందరి బాధ్యత అన్నారు. వీరయ్య ప్రాణం ఉన్నంతవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేసి పార్టీకోసం విశేషమైన సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, వైసిపి రాష్ట్ర పంచాయితీ వింగ్ భూమిరెడ్డి సుబ్బారెడ్డి, మల్లపాలెం సర్పంచ్ రమణారెడ్డి, వైసిపి ప్రకాశం జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ కోర్లకుంట జానకి, రఘు, యర్రగొండపాలెం కన్వీనర్ ముసలరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**గిద్దలూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త**
సెప్టెంబర్ 13వ తేదీన గిద్దలూరు కోర్టు నందు జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని శుక్రవారం రెవెన్యూ, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, మున్సిపల్ అధికారులకు గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవల కమిటీ ఛైర్మన్ ఏ ఓంకార్ తెలియజేశారు. కోర్టుల వరకు వెళ్లని ప్రీలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవలసిందిగా తెలియజేశారు. కోర్టులలోని అన్ని రకముల సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్జి తెలియజేశారు.

8_8.qxd 8/23/2025 12:26 AM Page 1



## కనకదుర్గమ్మ ఆశీస్సులు పొందిన వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల

**కనిగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ శుక్రవారం ఉదయం విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూసుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన ఎలిపారు. దుర్గమ్మ ఆశీస్సులతో కనిగిరి అభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు శక్తి ప్రసాదించమని కూడా ప్రార్థించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సైకం ఏడుకొండలురెడ్డి, బొడే కొండారెడ్డి, సూరెడ్డి వెంకటరెడ్డి, కుందురు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి వైద్య సేవలకు బంగారు అక్షరాల్లో మైలురాయి

**కనిగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం భారీ అడుగులు వేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధికి గాను మొత్తం 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)కు రూ.51.75కోట్లు మంజూరు చేసింది. ఈ జాబితాలో కనిగిరి కమ్యూనిటీ వైద్య ఆసుపత్రి కూడా చోటు దక్కించుకోవడం కనిగిరి ప్రజలకు గర్వకారణంగా మారింది. కనిగిరి ప్రాంత ప్రజల తరుపున ఈ సదుపాయాన్ని సాధించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నిరంతర ప్రయత్నాలు, ప్రభుత్వంతో చర్చలు, ప్రజల అవసరాలను ప్రతిపాదించడంతోనే ఈ ఫలితాన్ని సాధించగలిగామని కనిగిరి మున్సిపాలిటీ 7వ వార్డు అధ్యక్షుడు అచ్చాల రవి తెలిపారు. ఈ నిధులతో ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, శస్త్ర చికిత్స గదులు, ప్రసూతి విభాగం అత్యవసర సేవల విస్తరణ, రోగులకు శ్రేయస్కరమైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. కనిగిరి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇకపై మెరుగైన వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండనున్నాయి. ఈ నిర్ణయం కనిగిరి వైద్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఉర్దూ పాఠశాలలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం వైపు అడుగులు

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శుభారంభం

**కనిగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని టకారిపాలెం ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటిసమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు మున్సిపల్ చైర్మన్‌షేక్‌అబ్దుల్ గఫార్ ముందడుగు వేశారు. ఇటీవల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో పాఠశాల బోరు బావి నీరు ఆగిపోవడంతో ఏర్పడిన ఇబ్బందులను గమనించిన చైర్మన్ వెంటనే అధికారులను ఆదేశించి తాత్కాలికంగా బోరు వెల్ మరమ్మత్తులు చేయించారు. తదుపరి శాశ్వత పరిష్కారం నీటి కుళాయి ఏర్పాటుకు శుక్రవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రమైన మరుగుదొడ్లతో పాటు పచ్చదనం పెంపు, విద్యార్థుల చేతుల శుభ్రత కోసం తగిన ఏర్పాట్లు చేస్తాం అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీవెన, బంగారు బాల్యం మిషన్ కమిటీ సభ్యులు, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి రమేష్‌బాబు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ గొట్టిపాటి ఆధ్వర్యంలో ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు

### - మెగాస్టార్ చిరంజీవి యువతకు స్ఫూర్తిదాయకం డాక్టర్ కడియాల

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**




దర్శి పట్టణంలోని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల మాట్లాడుతూ 150కి పైగా సినిమాలలో నటించిన మహానటుడు డాక్టర్ పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకల్లో పాల్గొనడం నాకెంతో గర్వంగా ఉందన్నారు. ఆయన సినీ జీవితంతో పాటు ప్రజా జీవితం ఆయన దాతృత్వం ఈనాటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి కోట్లాది మందికి ప్రాణదానం చేసిన అసాధారణ ప్రతిమ ఉన్న మహోన్నత వ్యక్తి చిరంజీవిగా కొనియాడారు. విశ్వంభరుని అద్భుతమైన మీ ప్రయాణం మీ దాతృత్వం మీ అంకిత భావం సేవా భావం మరువలేమన్నారు. 70వ జన్మదినం జరుపుకుంటున్న చిరంజీవి ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ లలిత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ మాదపాకుల శ్రీనివాసరావు, దర్శి మండలం టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, టౌన్ టీడీపీ అధ్యక్షులు చిన్నా, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



దర్శి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ వైద్య నిపుణులచే దర్శి పిబిసిన్ కాంప్లెక్స్‌లో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుంచి అత్యంత అనుభవం కలిగిన గుండె, ఊపిరితిత్తులు, స్త్రీ సంబంధిత, కంటి, గ్యాస్ట్రబుల్, కీళ్ళ ఎముకలకి సంబంధించిన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొనడం జరిగింది. ఆ డాక్టర్లు జి.రమేష్‌బాబు, ఆనంద్ యాదవ్, బి.హైందవి, కె.జగదీశ్వర్‌రెడ్డి, పి.ఉదయ్ కుమార్, కంకణాల మాధవి, సుజిని సుంకర, సౌమ్య, కొంగర హాస్పిటల్ నుండి రావడం జరిగింది. ఈ వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా దర్శి మండల తహశీల్దార్ శ్రావణ్ కుమార్, దర్శి నగర పంచాయతీ కమిషనర్ మహేష్, దర్శి ఎస్సై మురళి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గంలోని ప్రజలు సుమారు 850 మంది శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య సేవలను వినియోగించుకున్నారు. అక్కడికి అనారోగ్య సమస్యలతో వచ్చినటువంటి ప్రజలకి డాక్టర్లు సూచించిన మేరకు ఉచితంగా ఈసీజీ, ఈసీ ఎకో, షుగర్ బీపీ పరీక్షలను ఉచితంగా జరిపి వారికి తగిన మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మొత్తం రోటరీ క్లబ్ డిజిటల్ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బొయ్యిల నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి అంబవరపు నారాయణరెడ్డి, సెక్రటరీ కర్ల రమణారెడ్డి, రోటరీ సభ్యులు మారం శివకోటిరెడ్డి, కేవీ రెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, పేరిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్ లక్ష్మీ నారాయణరెడ్డి, ఎమురు నారాయణరెడ్డి, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, నర్సులు, కోఆర్డినేటర్ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 6,7 వ వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**

దర్శి మున్సిపల్ పరిధిలోని 6,7వ వార్డుల్లో పర్యటించారు. మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి పైప్‌లైన్ ను ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. పలు చోట్ల వీధిలైట్లు ఏర్పాటుకు అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, డినకర్, రామకృష్ణ, మాల్యాద్రి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించిన కనిగిరి ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్

**కనిగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం మోపిదేవి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని శుక్రవారం మధ్యాహ్నం కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆశీర్వచనాలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనసారా ప్రార్థించినట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకం ఏడుకొండలు రెడ్డి, బొడే కొండారెడ్డి, సూరెడ్డి వెంకటరెడ్డి, కుందురు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దర్శి వ్యాపార షాపుల యజమానులు అందరూ సహకరించండి

### - ఎస్సై ఎం.మురళి

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



దర్శి పట్టణం రోజు రోజుకి అభివృద్ధి చెందుతుందని దర్శి గడియారస్తంభం సెంటర్లో, మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకి పెరిగిపోతుందని దీనికి వ్యాపారస్తులు షాపు యజమానులు చిరు వ్యాపారస్తులు, తోపుడు బండ్ల వాళ్లు సహకరించాలని ఎస్సై ఎం.మురళి తెలిపారు. రోడ్లకి ఇరువైపులా తోపుడు బండ్ల వాల్లు ముందుకు వస్తున్నారని రోడ్ల పైన ఉన్న సైడు కాలువల లోపల మాత్రమే వ్యాపారస్తులు తోపుడుబండ్లవాల్లో ఉండాలని అదే విధంగా ఎవరి షాపులు ముందు వారు పార్కింగ్ కేటాయించుకోవాలన్నారు. అలా లేనియెడల రోడ్లపైకి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై ఎం.మురళి తెలిపారు.

### వినాయక విగ్రహాల ఏర్పాటుకి పర్మిషన్ తీసుకోవాలి

ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండుగని పురష్కరించుకుని సందర్భంగా వినాయకుని విగ్రహాలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకునే వాళ్ళు ఖచ్చితంగా పోలీసు స్టేషన్ నందు పర్మిషన్ తీసుకోవాలని, వారు ఎన్ని రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించుకుంటారు అదే విధంగా ఎన్నో రోజు నిమజ్జనం కార్యక్రమం జరుపుకుంటారు. వీటి వివరాలను పోలీసు స్టేషన్లో నమోదు చేసుకొని, అదే విధంగా వారి ఆధార్ కార్డులు తెచ్చుకుని ఖచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలని ఎస్సై ఎం.మురళి తెలిపారు. లేనియెడల అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని విగ్రహాలని ఏర్పాటు చేసుకునేందుకు పర్మిషన్‌లు ఇవ్వడం కుదరదని ఆయన తెలిపారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకి పర్మిషన్ తీసుకోవాలి

### - ఎస్సై కమలాకర్

**ముండ్లమూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త**




ఈనెల 27వ తేదీన వినాయక చవితి పండుగని పురష్కరించుకుని సందర్భంగా వినాయకుని విగ్రహాలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకునే వాళ్ళు ఖచ్చితంగా పోలీసు స్టేషన్ నందు పర్మిషన్ తీసుకోవాలని, వారు ఎన్ని రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించుకుంటారు అదే విధంగా ఎన్నో రోజు నిమజ్జనం కార్యక్రమం జరుపుకుంటారు. వీటి వివరాలను పోలీసు స్టేషన్లో నమోదు చేసుకొని, అదే విధంగా వారి ఆధార్ కార్డులు తెచ్చుకుని ఖచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలని ఎస్సై కె.కమలాకర్ తెలిపారు. లేనియెడల అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని విగ్రహాలని ఏర్పాటు చేసుకునేందుకు పర్మిషన్‌లు ఇవ్వడం కుదరదని ఆయన తెలిపారు.

## అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



దర్శి మండలంలో ఉన్న అర్హులైన చెవిటి, మూగ, గుడ్డి, ఓయో పరిమిత వృద్ధులు పెన్షన్ తొలగించడం అన్యాయమని రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షులు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే, దర్శి ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ వజ్ర నాయక్ కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర దళిత సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జి.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో మూగ, చెవిటి, గుడ్డి ఎలాంటి ఆధారాలు లేని, వయోవృద్ధులను గత 20 సంవత్సరాలు నుండి 75 రూపాయల పెన్షన్ తీసుకుంటున్న పెన్షన్ దారులకు ప్రభుత్వం ఎంక్వయిరీ పేరుతో తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరిని పరిశీలించి పింఛన్లు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షులు, రాచపూడి మోషే, వివిధ అర్హులైన పింఛన్ దారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదు

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ భరోసా

**దర్శి, ఆగస్టు 22, ప్రభాతవార్త**



అర్హులైన ఏ ఒక్కరికి పెన్షన్లు రద్దు కావని దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికేట్లతో దివ్యాంగులు కాని వారు కూడా సర్టిఫికేట్లు పొందిన దందా వెలికి తీసేందుకే ఈ సర్టిఫికేట్ల వెర్ఫికేషన్ అని ఆమె వివరించారు. నిజమైన దివ్యాంగులకు ఎవరికైనా పెన్షన్ తొలగిస్తారన్న ఆందోళన అవసరం లేదని దర్శి నియోజకవర్గంలో అలా ఎక్కడైనా జరిగితే తనను సంప్రదించాలని డాక్టర్ లక్ష్మీ వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దివ్యాంగుల పెన్షన్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంపై సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఆమె తెలిపారు. పూర్తిగా ఆరోగ్యవంతులుగా ఉండి ఎలాంటి వైకల్యం లేకుండా అక్రమంగా సర్టిఫికేట్లు పొంది పెన్షన్లు పొందుతున్న వారికి మాత్రమే ఇది ఇబ్బందికరమని ఆమె తెలిపారు. అనర్హులైన పెన్షన్లను ధృవీకరించేందుకు మాత్రమే వైద్య బృందాలను నియమించడం జరిగిందని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నకిలీ పెన్షన్లు మాత్రమే తొలగిస్తారని అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దు కాదని ఆమె భరోసా ఇచ్చారు. అర్హులైన పెన్షన్ దారుల పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని ఆమె తెలిపారు.

## ప్రకృతి పండ్లతో మంచి ఆరోగ్యం

### - ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవీ ఆర్ - ఘనంగా సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఫ్రూట్స్‌డే వేడుకలు


**చీరాల టౌన్, ఆగస్టు 22 ప్రభాతవార్త**




పట్టణంలోని స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీషన మీడియం స్కూల్‌లో శుక్రవారం కిండర్ గార్డెన్ చిన్నారులతో ప్రత్యేకంగా ఫ్రూట్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆపిల్, అరటి, మామిడి, జామ, ద్రాక్షతో పాటు విబిన్న రకాల పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు వివరిస్తూ ప్రకృతి ప్రసాదించిన పండ్లు పిల్లల శారీరక మానసిక వికాసానికి మేలు చేస్తాయని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జెవీఆర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందుతుందని పండ్లు తినే అలవాటు ఆరోగ్యవంతం అన్నారు. జంక్ ఫుడ్ నివారణపై కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్, చిప్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటివి ఎక్కువగా తీసుకోవడం వలన కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. శరీర బరువు పెరుగుదల జీర్ణ సమస్యలు దంత సమస్యలు వంటి సమస్యలు పిల్లల్లో చిన్న వయసులోనే వస్తాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆహారపు అలవాట్లపై శ్రద్ధ చూపాలని, వారిని సహజ ఆహారం వైపు మళ్లించాలని సూచించారు. విద్యార్థులు కూడా పండ్లతో చేసిన ఆకర్షణీయమైన అలంకరణలు, పోస్టర్లు ప్రదర్శించారు. కొంత మంది చిన్నారులు పండ్ల ప్రయోజనాలపై ప్రత్యేకంగా రైమ్స్ పాడి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌కు కుర్చీలు బహుకరణ

**చీరాల, ఆగస్టు 22, ప్రభాతవార్త**



చీరాల ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ టీచర్స్ కూర్చొనుటకు రూ.6,500లు విలువ గల 10 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, శ్రీరాం రమేష్, జీవై ప్రసాద్,రంగా, హనుమంతరావు,హెడ్ మాస్టర్ బి.సాల్మన్, టీచర్స్ సురేష్, వెంకటేశ్వరరెడ్డి, జయచంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా శ్రావణ మాస సామూహిక కుంకుమ పూజలు

**సంతనూతలపాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త**





సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం నాడు శ్రావణ మాస సామూహిక కుంకుమపూజలుఘనంగా జరగాయి. అర్చకులు పరాంకుశం అజయ్‌బాబుచార్యులు, పి.ప్రసాద్ చార్యులు ఈ కుంకుమ పూజలు నిర్వహించారు. జులై 25వ తేదీ నుండి స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం వేడుకలను ప్రారంభించి ఈనెల 22వ తేదీత శ్రావణమాస చివర శుక్రవారంతో ఈ పూజలు ముగిశాయి.ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల అధిక సంఖ్యలో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ శ్రావణ మాస వేడుకలు ఘనంగా ముగిసినవి. శ్రావణమాసంలో భాగంగా ఐదుశుక్ర వారాలలో కుంకుమపూజలు నిర్వహించారు.

## సింగరకొండలో ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

### - 4 వందల మందికిపైగా పాల్గొన్న మహిళలు

### - 750 మందికి తీర్థ ప్రసాదాలు, అన్నదానం

**అద్దంకి ,ఆగస్టు 22, ప్రభాతవార్త**





ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండపై వెంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భం గా సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా జరిగాయి. పాలక మండలి, అధికారుల ఆధ్వర్యంలో ఈ సామూహిక వరలక్ష్మి వ్రతపూజలు నిర్వహించగా అద్దంకి పట్టణంతోపాటుపరిసర గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.400 మందిపైగా మహిళలు, వరలక్ష్మి వ్రత పూజలలో పాల్గొన్నారు. పూజారులు వీరిచే వరలక్ష్మి పూజలు నిర్వహింపచేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాల ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 750మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. పాలకమండలి అధ్యక్షులు గుంజి శ్రీనివాసరావుతోపాటు పాలకమండలి సభ్యులు, ఆలయ ఇఒ శ్రీనివాసరావులు ఈ వరలక్ష్మి వ్రతానికి అవసరమైన ఏర్పాట్లును చేశారు. తీర్థ ప్రసాదాలను ఆలయ అధికారులు సమకూర్చగా, అన్న ప్రసాదాలనుపాలకమండలి అధ్యక్షులు ఏర్పాటు చేశారు. ఆలయం ముందు వరలక్ష్మి వ్రత పూజల నేపద్యంలో ప్రత్యేక పెండాల్స్‌ను పాలకమండలి అధ్యక్షులు ఏర్పాటు చేయించారు.

## వినాయక మండపాలు ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

### - నిమజ్జనాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీఎస్పీ

**సింగరాయకొండ, ఆగస్టు 20, ప్రభాతవార్త**




వినాయక మండపాలు ఏర్పాటు,నిమజ్జనాల నిర్వహణలోతప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు.శుక్రవారం స్థానికసీఐ కార్యాలయం లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండల పరిధిలో విగ్రహాలు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసిన వెంటనే పరిశీలించి పర్మిషన్ మంజూరు చేస్తామని తెలిపారు. విగ్రహాలను అనువైన ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని,అభ్యంతర ప్రదేశాల్లో పెట్టరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించరాదని, మైకులు, డీజేలు తక్కువ శబ్దంతో వినియోగించుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో మండపాల వద్ద కనీసం ఒకరు లేదా కొంతమంది కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, వాలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. రాజకీయ ప్రసంగాలు, ఇతర మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు.అసభ్యకర నృత్యాలు,డాన్సులు పూర్తిగా నిషేధించబడ్డాయని డీఎస్పీతెలిపారు. ప్రతి మండపంలో కనీసం రెండు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఆదేశించారు. నిమజ్జనాలు పగటి పూట పోలీసుల సూచన మేరకు మాత్రమే జరగాలని, అనుమతి లేకుండా రూట్ లేదా తేదీలను మార్చరాదని స్పష్టం చేశారు.పాకల సముద్రతీర ప్రాంతంలో నిమజ్జనాలకు అన్నీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆయా సమయంలో మాత్రమే నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసుకోవాలని,శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీలను ఆదేశించారు.గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ సిహెచ్. హాజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్రతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 50 యానాది కుటుంబాలకు జాబ్ కార్డులు పంపిణీ

**చీరాల టౌన్, ఆగస్టు 22 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు చీరాల మండలం తోటవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామయ్య కాలనీలో నివసిస్తున్న 50 ఎస్టీ యానాదుల కుటుంబాలకు ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డులు ఎంపీడీఓ శివ నారాయణ మంజూరు చేసి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు యానాదుల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం ద్వారా లభించే అవకాశాలు లాభాలు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, నిరుద్యోగ సమస్యలను తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎంపీడీఓ శివ నారాయణ తెలిపారు. అందరూ యానాదులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ఉపాధి పనుల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు దేవరకొండ రాము మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఆచరణలోకి వస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అటువంటి పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దాసు,టీఏ జయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత,పంచాయతీ కార్యదర్శులు భారతి, పావని తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

**చీరాల, ఆగస్టు 22, ప్రభాతవార్త**



చీరాల క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత డిపార్టుమెంట్స్ పంపించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సుమారుగా 135 అర్జీలు రాగా పెన్షన్ 20 అర్జీలు ఇళ్లస్థలాలు 110 అర్జీలు ఇతర సమస్యలు 5 అర్జీలు. ఈ కార్యక్రమంలో చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, కారంపూడి పద్మిని, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ కడియం మురళి అనారోగ్యంతో మృతి

**చీరాల, ఆగస్టు 22, ప్రభాతవార్త**



చీరాల సాక్షి రిపోర్టర్ కడియం మురళి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు.ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మళ్ళా చంద్రశేఖర్, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు వాసుబాబులు స్థానిక జర్నలిస్టులతో కలిసి హరిప్రసాద్ నగర్‌లోని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులుగా మురళి ఎనలేని సేవలు అందించారని చంద్రశేఖర్ అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలిపేలా కథనాలు రాయడమే కాక జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కృష్ణారెడ్డి, గురునాథ్, నక్కల రమేష్, ప్రదీప్, బద్రీ, దిలీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

23-8Pg5 9th_23-8Pg5.qxd 8/22/2025 10:11 PM Page 1





# శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు

## ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఆరోపణలు

### సిఐడి అదుపులో మాజీ అధ్యక్షుడు

**కొలంబో, ఆగస్టు 22:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు ధ్రువీకరించినట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ పేర్కొంది. ప్రస్తుతం విక్రమసింఘే కొలంబో సిఐడి ఆధీనంలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయనకు సమన్లు అందజేసి విచారణ కూడా చేపట్టారు. 2023 సెప్టెంబరులో విక్రమసింఘే లండన్‌లో పర్యటించారు. తన భార్యతో కలిసి ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆ విస్తృత విదేశీ పర్యటన అధికారంగా చేపట్టింది కాదని తర్వాత ప్రకటించారు. కానీ, దానికి ప్రభుత్వ నిధులను వినియోగించారు.

హవానాలో జి-77 సద స్సులో హాజరై తిరిగి వస్తూ లండన్‌కు వెళ్లిన ప్పుడు తన భార్య ఖర్చులను ఆమే పెట్టు కుందని ప్రభుత్వ నిధులను వినియోగించలేదని విక్రమసింఘే వాదిస్తున్నారు. కానీ, సిఐడి మాత్రం ఆ పర్యటనలో ప్రభుత్వ సొమ్మునే వాడారని.. దీంతోపాటు ఆయన అంగరక్షకులకు కూడా చెల్లింపులు చేశారని చెబుతోంది. ఇక ఆయనను ఫైనాన్షియల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ విచారించి కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చింది.

రణిల్ విక్రమసింఘే 2022లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు పదవిలో ఉన్న గొటబయ రాజపక్సె వైదొలగడంతో ఈ బాధ్యతలను స్వీకరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించారన్న పేరును ఆయన సంపాదించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.



# దారికి రాకుంటే.. నరకమే..

## హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

**టెల్‌అవీవ్, ఆగస్టు 22:** హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. హమాస్ మా దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరకదారులు తెరుచుకుంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వ్యాఖ్యానించారు. వెంటనే తమ బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'హమాస్ ఆయుధాలు వదిలిపెట్టి, బందీలందర్నీ విడుదల చేసి,యుద్ధం ముగించేందుకు షరతులు అంగీకరించాలి. లేదంటే త్వరలోనే వారికి నరకానికి ద్వారాలు తెరుచుకుంటాయి' అని ఇజ్రాయెల్ మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అంగీరించకుంటే గాజా నగరం మరో రఫా, బీట్ హనౌన్‌గా మారిపోతుందని హెచ్చరించారు. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం తెలిపిన ప్రధాని నెతన్యాహు ఇందుకోసం మరో ఆపరేషన్ చేపడతామన్నారు. హమాస్‌ను అంతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన యుద్ధం ముగించి, బందీలవిడుదల కోసం చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రక్షణమంత్రి మరోసారి స్పందించారు. మరోవైపు గాజాపై మరో దశ దాడులు చేస్తామని చెబుతోన్న ఇజ్రాయెల్.. రానున్న రోజుల్లో 60 వేలమంది రిజర్విస్టులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2లక్షలకు చేరుకుంటుందని అంచనా.

# పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం

## గోడదూకి లోపలికి ఆగంతకుడు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ ప్రాంతంలో ఒక చొరబాటుదారుడు చెట్టు ఎక్కి గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనానికి చెందిన గరుడ గేట్ వద్దకు చేరుకున్నాడని అధికారులు తెలిపారు. ఆ చొరబాటుదారుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 2023లో



పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన 22 ఏళ్లు అయిన డిసెంబర్ 13న ఆ ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదే రకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులో కూడా ఈ తరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు ఆ నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. తాజా ఘటనలో పేర్కొన్న నిందితుడిది ఉత్తరప్రదేశ్. అతడి పేరు రామా అని అధికారులు వెల్లడించారు. 20 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అతడు ఏ ఉద్దేశంతో ఇలాంటి చర్యకు పాల్పడ్డాడో తెలుసుకునేందుకు ఐబి, ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అతడిని ప్రశ్నిస్తోంది.




## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా

# ఎథెల్ కాటర్‌హామ్ రికార్డు

**లండన్, ఆగస్టు 22 :** ఎథెల్ కాటర్‌హామ్.. ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఖ్యాతి గాంచారు. ఆమె తన 116వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. గురువారం అంటే ఈ నెల 21వ తేదీ సర్రేలో లైట్‌వాటర్‌లోని సంరక్షణ కేంద్రంలో ఆమె ఈ వేడుకలు చేసుకున్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి ఆమె చాలా సాదాసీదాగా ఈ జన్మదినాన్ని జరుపుకున్నారని హల్‌మార్క్ కేర్ హోమ్స్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎథెల్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దీంతో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఎథెల్ కుటుంబసభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే ఏ యేడాది జన్మదినం సందర్భంగా ఎథెల్ కేటర్ హామ్ ఎవరికి ఎటువంటి ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. అయితే కింగ్ చార్లెస్-3 ఆమెతో మాట్లాడటానికి సిద్ధంగా ఉంటే అంగీకరిస్తామని సంరక్షణ కేంద్రం వివరించింది. ఇక దేశంలో 100వ జన్మదిన వేడుకలు జరుపుకొనే పౌరులను అభినందిస్తూ.. వ్యక్తిగతంగా బ్రిటన్ చక్రవర్తి లేఖ రాసారు. ఆ క్రమంలో ఎథెల్ కాటర్‌హామ్‌కు గతేడాది 115వ పుట్టినరోజు సమయంలో కింగ్ చార్లెస్-3 లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

1909, ఆగస్టు 21వ తేదీన ఎథెల్ కాటర్‌హామ్ జన్మించారు. అంటే టైటానిక్ విపత్తుకు సరిగ్గా మూడేళ్ల ముందు ఆమె జన్మించారు. ఆమె.. తన 18వ ఏటా భారత్‌కు వచ్చారు. భారత్‌లో ఒక సైనిక కుటుంబానికి సహాయకురాలిగా విధులు నిర్వహించేందుకు ఆమె ఈ దేశానికి వచ్చారు. కొద్దిరోజుల తర్వాత ఆమె స్వదేశానికి పయనమయ్యారు. ఆ కొద్దిరోజులకే ఆమె ఒక పార్టీకి వెళ్లారు. ఆ పార్టీలో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు పరిచయం అయింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో 1933లో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు వివాహం జరిగింది. తర్వాత ఆ జంట హాంకాంగ్‌కు తరలివెళ్లింది. ఆ తర్వాత జిబ్రాల్టర్‌కు మకాం మార్చింది. చివరకు దక్షిణ ఇంగ్లాండ్‌లో స్థిరపడింది. అయితే 1976లో భర్త నార్మన్ కాటర్‌హామ్ మరణించారు. ఇక ఎథెల్ కాటర్ హామ్‌కు ముగ్గురు మనవళ్లతోపాటు ఐదుగురు మునిమనవళ్లు ఉన్నారు.

ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు ఇనా కాన్‌బారో లూకాస్. ఆమె వయసు 116 సంవత్సరాలు. నన్‌గా పనిచేసే ఆమె 116వ యేట మరణించింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఎథెల్ కాటర్‌హామ్ ఖ్యాతి పొందారు.



# దేశీయ విమాన ప్రయాణం ఫ్రీ

## విదేశీ పర్యాటకులకు థాయ్ బంపర్ ఆఫర్

**బ్యాంకాక్, ఆగస్టు 22:** భారతీయులతో సహా విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలోని పర్యాటక ప్రదేశాలు ఆదరణ పొందేందుకు కొత్త ట్రావెల్ స్కీమ్ ప్రవేశపెట్టనుంది. దీని కింద దేశీయ విమాన ప్రయాణాన్ని ఫ్రీగా కల్పించనుంది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్, బ్యాంకాక్ వంటి ప్రదేశాలకు మాత్రమే విదేశీ పర్యాటకులు ఎక్కువగా వెళ్తున్నారని గ్రహించిన ప్రభుత్వం.. వారు మిగిలిన ప్రదేశాలను కూడా చూసేలా తమ దేశంలో విమాన ప్రయాణం ఉచితం చేయాలని చూస్తోంది. 'బై ఇంటర్నేషనల్, ఫ్రీ థాయ్‌లాండ్ డొమెస్టిక్ ఫ్లైట్స్' పేరిట ఆ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ప్లాన్ కింద దేశీయ విమానాల్లో ప్రయాణించే వారికి వన్‌వే టికెట్ ధర 1,750 బాత్, రౌండ్ ట్రిప్స్ అయితే 3,500 బాత్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని యోచిస్తోంది. ఈ యేడాది ఆగస్టు నుంచి డిసెంబరు మధ్యలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉండొచ్చని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

థాయ్‌లాండ్‌కు స్టాండర్డ్ ఇంటర్నేషనల్ టికెట్స్ తీసుకున్న ప్రయాణికులు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్స్, మల్టీసిటీ ఆప్షన్స్, ఫ్లైత్రూ సర్వీసెస్, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్స్ వద్ద ఈ ఆఫర్‌ను పొందొచ్చు. ప్రతి ప్రయాణికుడు రెండు దేశీయ విమాన టికెట్లు పొందడానికి వీలుంటుంది. 20 కిలోల బ్యాగేజీని అనుమతిస్తారు. ఈ ప్రాజెక్టు కింద రెండు లక్షల మంది అంతర్జాతీయ పర్యాటకులను రప్పించాలన్నదే థాయ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల అన్ని రకాలుగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు 21.80 బిలియన్ బాత్ మేర ప్రయోజనం కలగనుందని అంచనా. అందుకోసం ఆ దేశ టూరిజం అథారిటీ.. ఆరు దేశీయ విమానయాన సంస్థలతో పనిచేయనుంది.

# కర్ణాటక డి.సిఎం ఆరెస్సెస్ గీతాలాపన



## చర్చనీయాంశంగా మారిన డికె తీరు

### అసెంబ్లీలోనే ఆలపించడంపై రాజయకీయ వర్గాల్లో ఊహాగానాలు

**బెంగళూరు, ఆగస్టు 22:** కర్ణాటకలో సిఎం మార్పు అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. అయిదేళ్లు తానే ముఖ్యమంత్రినని ఓ వైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నా అటు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తన చేతుల్లో ఏమీలేదంటూనే ఆశ పడటంలో తప్పు లేదు కదా అనే సంకేతాలిస్తున్నారు. ఈ పరి ణామాల నేపథ్యంలో తాజాగా డికె వ్యవహ రించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ ఆరెస్సెస్‌తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన నమస్తే సదా వత్సలేను ఆయన పాడడంతో బిజెపి నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ బల్లలపై చప్పట్లు చరుస్తూ నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట చర్చ మొదలైంది. తనకు సిఎం పీఠం ఇవ్వకపోతే బిజెపిలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈ విధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో మోడీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డికె శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలు వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సిఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. అయితే సిఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తానని పలుమార్లు బహిరంగంగానే చెప్పిన డికె, తన వ్యాఖ్యల వల్ల ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు.



## బెంగాల్ జైళ్లలో ఎఐ

# కరడుగట్టిన ఖైదీలపై నిఘా

**కోల్‌కతా, ఆగస్టు 22:** జైళ్లలో నేరుగా కదలికలను ఎప్పటికప్పుడు గమనించడానికి బెంగాల్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంది. నేరగాళ్లపై నిఘా కోసం ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి ప్రణాళికలు వేయడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్లాన్ చేస్తుండటంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు. అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించి, అడ్డుకునేందుకు వీలుగా ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 60 పరివర్తన కేంద్రాల్లో ఇప్పటికే అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకుంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. అందువల్లే వాటిని ఎఐతో అనుసంధానిస్తున్నామన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటి వాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ఇందులో ఉన్న ముఖ గుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. ముఖ్యమైన కేసుల్లో అరెస్టయిన కరడుగట్టిన నేరగాళ్లు ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ఎఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, పదునైన ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు.

ఈ ఎ1- ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను కూడా అంచనా వేయగలవన్నారు. దీనివల్ల అధికారులు ముందుగానే జోక్యం చేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు.

# సంక్షిప్తంగా..



## గాజా సిటీలో తీవ్ర క్షామం

### ధ్రువీకరించిన ఐరాస నివేదిక

**జెరూసలేం, ఆగస్టు 22:** ఇజ్రాయిల్, హమాస్ మధ్య సాగుతున్న పోరుతో గాజా సిటీలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సిటీలో ఆర్తనాదాలు వినిపిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితికి చెందిన శాఖ ధ్రువీకరించింది. ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూర్టీ ఫేస్ క్లారిఫికేషన్(ఐపిసి) తొలిసారి తన వార్నింగ్‌ను అయిదో దశకు చేర్చింది. ఆ వార్నింగ్ స్థాయి బట్టి గాజాలో తీవ్ర దుర్భిక్షం ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. గాజాలోని గాజా సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ఆ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఈనెలాఖరులోగా డెయిర్ అల్ బాలాహ్, ఖాన్ యూనిస్‌కు కూడా చేరనున్నట్లు తెలుస్తోంది. గాజా స్ట్రిప్‌లో ఉన్న సుమారు అయిదు లక్షల మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. ఆకలి చావులను అడ్డుకోవాలంటే నిరవధిక సాయం అందాలన్నాయి.

## కొలంబియాలో పోలీసు హెడ్‌క్వార్టర్‌పై దాడి: 17 మంది మృతి

**బొగోటా, ఆగస్టు 22:** కొలంబియా దేశంలో ఒకేరోజు రెండు భయానక ఘటనలు చోటు చేసుకున్నాయి. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) రెండు వేర్వేరు ఉగ్రదాడులు జరగడంతో 17 మంది మరణించారు. అంతియోక్వియా ప్రాంతంలో కొకైన్ ఉత్పత్తికి ఉపయోగించే కోకా మొక్కల సాగును తొలగించే కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఈ హెలికాప్టర్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌తో మొదటి దాడికి పాల్పడ్డారు. ఈ దాడి కారణంగా హెలికాప్టర్‌లో భారీగా మంటలు చెలరేగేలా చేసింది. ఇక ఘటనలో 12 మంది పోలీసు అధికారులు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని



అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ దాడి ఇటీవల జరిగిన కొకైన్ పట్టి వేతకు ప్రతీకార చర్యగా జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో దాడి కాలి నగరంలో మిలిటరీ ఏవియేషన్ స్కూల్ సమీపంలో జరిగింది. కారుబాంబు పేలడంతో ఐదుగురు మరణించగా, 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ రెండుఘటనలకు కారణంగా దేశవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## సుదర్శన్ నక్సల్స్ మద్దతుదారుడు: అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకోసం ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తున్నది. అధికార, విపక్ష పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి, నామినేషన్ కూడా వేయించాయి. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు హీటెక్కుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిగురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతుగా తీర్పులు ఇచ్చారనిఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. సుదర్శన్ రెడ్డి సల్వా జుడుం తీర్పు వెలువరించకపోతే, దేశంలో తీవ్రవాద వామపక్ష ఉద్యమం 2020కి ముందే ముగిసి ఉండేదని అన్నారు.

## ప్యాసింజర్ రైళ్ల నంబర్ల మార్పు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్యాసింజర్ రైళ్ల విషయంలో అధికారులు కీలక మార్పులు చేశారు. ప్రయాణికులు ఈ కొత్త మార్పులను గమనించాలని రైల్వే శాఖ సూచించింది. కాచిగూడ స్టేషన్ నుంచి వెళ్లే ప్యాసింజర్ రైలు (57601/57602) నంబర్లను 67785/ 67786గా మార్చినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

అదేవిధంగా, కాచిగూడరాయచూర్ మధ్య సేవలందించే ప్యాసింజర్ రైలు (77647/77648) నంబర్‌ను 67787/67788గా మార్చారు. ఈ మార్పు ఆగస్టు 26 నుంచి వర్తిస్తుంది.

నంబర్ల మార్పుతో పాటు, కోచ్‌లలో కూడా కీలక మార్పులు చేస్తున్నారు. కాచిగూడ రైలులో ప్రస్తుతం ఉన్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక మెమూ రేక్‌ను, అలాగే కాచిగూడ -రాయచూర్ మార్గంలో డెమో స్థానంలో కూడా మెమూ రేక్‌ను వినియోగిం చనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

# మీరు చోద్యం చూస్తున్నారా?

## ఆధార్‌కార్డును గుర్తింపుగా అంగీకరించాల్సిందే..

### 'బీహార్ ఓట్ల తొలగింపు'లో పార్టీల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓటర్ల జాబితా సవరణ తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. బీహార్ ఎన్నికలకు ముందు సుమారు 65 లక్షల మంది ఓట్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారంటూ వస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా రాజకీయంగా తీవ్ర సంచలనంగా మారాయి. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఓట్ల తొలగింపుపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చేందుకు.. అవసరమైన ధ్రువపత్రాల జాబితాలో ఆధార్ కార్డు ను కూడా చేర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ కోసం సమర్పించాల్సిన 11 ధ్రువపత్రాల్లో ఆధార్ కార్డు కూడా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఈసీకి సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ ఓట్లను జాబితా నుంచి తొలగించారని లక్షలాది ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికోసం ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. జాబితా నుంచి పేర్లు తొలగించిన వారు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కూడా సమర్పించవచ్చని సూచించింది. వారు సమర్పించిన ఆధార్ కార్డులను ఎన్నికల సంఘం తప్పకుండా ఆమోదించాలని తేల్చి చెప్పింది.

**రాజకీయ పార్టీలపై సుప్రీంకోర్టు అసంతృప్తి:** బీహార్‌లో ఓటర్ల జాబితాలో లక్షల మంది ఓట్లు తొలగించారంటూ దేశంలోని చాలా రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఓట్ల తొలగింపులపై ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలుపుతున్నప్పటికీ.. తొలగించబడిన ఓటర్లకు సహాయం చేయడంలో మాత్రం రాజకీయ పార్టీలు సరైన రీతిలో పని చేయడం లేదని సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మీకు ఓటు హక్కు లేదా.. 15 రోజుల్లోనే ఓటర్ ఐడీ కార్డులు, అప్లికేషన్ స్టేటస్ ఇలా తెలుసుకోండి!

రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజకీయ పార్టీలు తమ పనిని తాము సరిగా నిర్వహించడం లేదని మండిపడింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడిన వారికి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా సహాయం చేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమ ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నారని పార్టీలు ఆరోపిస్తున్నప్పటికీ.. తమ ఏజెంట్ల ద్వారా అభ్యంతరాలను సమర్పించడం లేదని.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రమే ముందుకు వచ్చినట్లు కోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మరింత పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అర్హులైన వారు తమ పేర్లను మళ్లీ ఓట్ల కోసం నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

# ఆదాయానికి మించి ఆస్తుల్లో కార్మికశాఖ పరిపాలనాధికారి ఇంట్లో ఏసిబి సోదాలు



**తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆయన కార్మికశాఖలో క్రిందిస్థాయి నుండి పైకి ఎదిగిన అధికారి. ఆయన మాటలు కార్మికులకు తేనెలా ఉన్నా ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించాడనే ఫిర్యాదులు భారీగా అవినీతినిరోధకశాఖ(ఏసిబి)కి అందాయి. ఆ పక్కా సమాచారంతో విజయవాడ ఏసిబి హెడ్‌క్వార్టర్ నుండి ఆదేశాలతో తిరుపతిలోని కేశవాయనగుంటలో ఉన్న కార్మికశాఖ సంయుక్తకమిషనర్ కార్యాలయంలోని పరిపాలనఅధికారి ఎం.బాలూనాయక్ ఇంటిపై శుక్రవారం ఉదయం ఏసిబి అధికారులు దాడులు చేశారు. ఉదయం ఇంట్లోనే ఉన్న బాలునాయక్‌ను ఏసిబి అదనపు ఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో రెండు బృందాలు సమగ్రంగా విచారణ చేశాయి. అందిన ఆధారాలతో ఇంట్లోని రికార్డులు, బంగారు నగలు, బ్యాంకు బ్యాలెన్స్ పాసుపుస్తకాలు, ఆస్తులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏకకాలంలో తిరుపతిలోని కేశవాయనగుంట ఇంట్లో, గతంలో ఆయన పనిచేసిన మదనపల్లి ,రాయచోటి కార్మికశాఖ కార్యాలయాలు, ఆయనకు సంబంధించిన ఇళ్ళలో, బంధువుల ఇళ్ళలో, కర్నూలులోని ఆయన కార్యాలయంలో ఏసిబి దాడులు కొనసాగిస్తుంది. తిరుపతిలో సాయంత్రం వరకు సాగిన ఈ దాడుల వివరాలను ఎంతమేరకు ఆస్తులు కూడబెట్టారు, బ్యాంకు వివరాలు, బంగారు తదితర వివరాలను శనివారం ఏసిబి వెల్లడించనుంది.

## ఇది వైకాంగ్రెస్‌పార్టీ ప్రజలకు చేసిన ద్రోహం కాదా?: వైఎస్ షర్మిల

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ ముసుగు మళ్ళీ తొలగిందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ,భాజాపాకు వైకాపా...బీ టీం అని నిజ నిర్ధారణ జరిగిందన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి మద్దతుతో మరోసారి తేటతెల్లమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది మోడీ పక్షమేనని తేలింది. అవినీతి కేసులకు భయపడి భాజాపాకు వైకాపా మళ్ళీ దాసోహం అంటోంది. ఓటు చోరీతో రాజ్యాంగం ఖూనీ అయ్యేది వైకాపాకు కనిపించదు. ఓ తెలుగు బిడ్డ,న్యాయ నిపుణుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే మద్దతు ఇవ్వలేరా? ఇది తెలుగు ప్రలకు చేసిన ద్రోహం కాకపోతే మరేంటో వైకాపా చెప్పాలి'అని షర్మిళ ప్రశ్నించారు.

## సత్యదేవుని సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

### పూజలో పాల్గొన్న పదివేల మంది మహిళలు..

**శంఖవరం, ఆగష్టు 22. ప్రభాతవార్త :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు.శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మండపంతో పాటు,6 వ్రత మండపముల యందు మహిళలు ఈ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు దంపతులు జ్యోతి వెలిగించి ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతములు ప్రారంభించారు.అర్చకులు, వేద పండితులు వరలక్ష్మి దేవితో పాటు, సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారికి వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించి, వరలక్ష్మీ దేవి వ్రతాలకు అర్చక స్వాములు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న మహిళా భక్తులు తమ వెంట కొబ్బరికాయ, అరటి పండ్లు, పువ్వులు తీసుకొని రాగా మిగతా పూజా సామాగ్రి దేవస్థానం వారు ఏర్పాటు చేసారు.సుమారు పదివేల మంది మహిళా భక్తులు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతములు నిర్వహించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు ఏర్పాటు చేసారు. పూజలలో పాల్గొన్న భక్తులందరికీ వరలక్ష్మీ దేవి రాగి రూపు, రవికల ముక్కలు, స్వామి వారి ప్రసాదం అందజేసారు. మహిళా భక్తుల రాకపోకలకు ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు.ముత్తైదువులు వేలాదిగా తరలిరావడంతో రత్నగిరి ప్రాంగణాలు కళకళలాడాయి.

# ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు అమెరికాలో అరుదైన గౌరవం

**విజయవాడ,ఆగస్టు22, పభాత వార్తప్రతినిధి:** రాజ్యసభ మాజీ సభ్యులు, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు టెక్సాస్ రాష్ట్రంలో అరుదైన గౌరవం లభించింది. టెక్సస్ రాష్ట్ర ప్రభుత్వంతో సహా, డాలస్ పరిసర ప్రాంతంలోని మూడు ముఖ్య నగరాలైన ఫ్రిస్కో, గార్లండ్, లిటిల్ ఎల్మ్ నగరాల మేయర్లనుండి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభినందన పూర్వక అధికారిక గుర్తింపు పత్రాలు పొందడం తెలుగువారం దరికి గర్వకారణంగా నిలిచింది. గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్ తో జరిగిన ప్రత్యేక సమావేశంలో డా. యార్లగడ్డకు అధికారిక గుర్తింపు పత్రాన్ని మేయర్ స్వయంగా అందచేసి అభినందిం చారు. సాహిత్య రంగంలోనే గాక, సాంస్క ృతిక రాయబారిగా, రచయితగా, ఉత్తర, దక్షిణ ప్రాంతాల భారతదేశ వారధిగా తన రచనలతో సౌభ్రాతృత్వం, జా తీయ ఐక్యతను పెం పొందించి నదుకు గాను టెక్సాస్ రా ష్ట్ర ప్రభుత్వంతో సహా టెక్సాస్ రాష్ట్రంలోని లిటిల్ ఎల్మ్, గా ర్లాండ్, ఫ్రిస్కో నగ రాలు ఆయన్ను అభి నందిస్తూ లేఖలు విడుదల చేశాయి. ఫ్రిస్కోలో స్థానిక తెలుగు వారు ఏ ర్పాటు చేసిన ఆత్మీ య సమావేశంలో ఆయా నగరాల అధికార ప్రతినిధులు ఆచార్య యార్లగడ్డకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రవాసాంధ్రులు డా. యార్లగడ్డ ను ఘనంగా సత్కరించారు. టెక్సాస్ రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వానికి, ప్రజలకు, ఆయా నగరాల మేయర్లకు, ప్రజలకు లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేణు భాగ్యనగర్, ఆత్మచరణ్ రెడ్డి, గోపాల్ పోనంగి, డా. తోటకూర ప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శారద సింగిరెడ్డి, అనంత్ మల్లవరపు, సమీర్, చాంద్ పర్వతనేని, సుబ్బారావు పర్వతనేని, లెనిన్ వేముల, ఉదయగిరి రాజేశ్వరి, రమణ్ రెడ్డి క్రిస్టపాటి, మాధవి లోకిరెడ్డి, డా. ఆళ్ల శ్రీనివాసరెడ్డి, డా. తుమ్మల చైతన్య, చినసత్యం వీర్నపు, కాకర్ల విజయమోహన్, అత్తలూరి విజయలక్ష్మి, ఎల్ శివకుమారి, జ్యోతి వనం, మడిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డా. యార్లగడ్డకు అధికారిక గుర్తింపు పత్రాన్ని అందిస్తున్న గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్

# తిరుమల గదుల్లో భక్తులకు సకల సదుపాయాలు

- యుద్ధప్రాతిపదికన విశ్రాంతి గృహాలు కాటేజీలు మరమ్మతులు
- రద్దీకి అనుగుణంగా మూడవ అన్నప్రసాదభవనం
- టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** మరోనెలరోజుల్లో తిరుమలలో ప్రారంభమయ్యే శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతి సదుపాయం ఇబ్బంది లేకుండా చూడాలని, విశ్రాంతి గృహాలు కాటేజీల మరమ్మతులు సకాలంలో పూర్తిచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వసతికి సంబంధించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని గదుల్లో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు,వేడినీళ్ళు ఇతర మరమ్మతులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24వతేదీ నుండి ప్రారంభంకానున్న నేపథ్యంలో భక్తుల వసతి సదుపాయాలు, అన్నప్రసాదాలు ఇతరత్రా సౌకర్యాలపై శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమ్లానాయక్, విఎస్ఒ సురేంద్రతో కలసి ఇఒ శ్యామలరావు సమీక్షించారు. బ్రహ్మోత్సవాల్లో తిరుమలకు వచ్చే భక్తులకు వసతి,ఇతర సౌకర్యాలకు సంబంధించి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వసతికల్పనవిభాగంతో సమన్వయంచేసుకుని ఇంజనీరింగ్ విభాగం పనులు పూర్తిచేయాలన్నారు యాత్రికుల వసతిసముదాయాల్లోనూ సెంట్రలైజ్డ్ బుకింగ్ విధానం అప్లికేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో భక్తులరద్దీ పెరిగినందున వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులు వేచిఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయని, వేచిఉండే సమయం కూడా ఎక్కువగా ఉన్నందున మరో ప్రాంతంలో కూడా అన్నప్రసాద భవనం ఏర్పాటుచేయడానికి పరిశీలించాలని ఆదేశించారు. ఇప్పటికే తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం (పిఎసి)4లో మినీ అన్నప్రసాద భవనం నడుపుతున్నారు. మరోమూడోచోట భక్తుల అవసరాలకు అనుగుణంగా మరో అన్నప్రసాద భవనం పిఎసిల ప్రాంతంలోనే ఏర్పాటుకు మార్గం సుగమంచేస్తున్నారు. ఇక తిరుమలలోని నూతనంగా ఏర్పాటుకానున్న హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అలాగే పంచాయతి,రెవెన్యూ విభాగాలు ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, హోటళ్ళలో ఏర్పాటుచేసిన ధరలపట్టికను పరిశీలించాలని స్పష్టంగా తెలిపారు. సాంప్రదాయ భోజనం భక్తులకు అందించాలన్నారు. లడ్డూప్రసాదం వితరణ శాలలో అన్ని కౌంటర్లు పనిచేయాలన్నారు. భక్తుల నుండి సేకరించే అభిప్రాయాలపై సమీక్షించి అమలుకు చూడాలన్నారు.

## త్వరలో భూమన జైలుకెళ్లడం ఖాయం

### - ఆయన అక్రమంగా కోట్లుసంపాదించారు

**- రాష్ట్రబయోడైవర్సిటీ ఛైర్మన్ విజయకుమార్**

**తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి కోట్లరూపాయలు అక్రమాస్తులు సంపాదించాడని, ఆయన టిటిడి నిధులు దుర్వినియోగంచేసి తప్పుచేశాడని వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిపై టిడిపి అధికారప్రతినిధి, రాష్ట్ర బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ ఘాటైన విమర్శలు చేశారు. తప్పుచేసిన భూమన ఎక్కడికీ తప్పించుకుపోలేడన్నారు. చట్టంముందు దోషిగా ఆయనను నిలబెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన త్వరలో జైలుకెళ్ళడం ఖాయమని నీలాయపాళెం అన్నారు .టిటిడిపై దుష్ప్రచారం చేస్తూ హిందూ ధర్మాన్ని విమర్శిస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి ప్రస్తుత టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును విమర్శించడం ఏమిటన్నారు. ఆయన చేసే మంచిపనులు, నిజాయితీని చూసి విమర్శించే అర్హత భూమనకు లేదన్నారు. ఆయన కష్టంతో పైకివచ్చిన వ్యక్తిఅన్నారు. టిటిడిలో ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో కరుణాకర్‌రెడ్డి చేసిన అవినీతిని త్వరలోనే బయటపెడతామని అన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతిలో టిడిపి నాయకులు వట్టికుంట శంకరనారాయణ, ఊకా విజయకుమార్, పాతకం వెంకటేశ్‌తో కలసి విజయకుమార్ మీడియా సమావేశంలో భూమన కరుణా కర్‌రెడ్డిపై ఘాటుగా స్పందించారు.

గత కొంతకాలంగా కరుణాకర్‌రెడ్డి ఓ పత్రిక టిటిడిపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకుని తప్పుడు కథనాలు వండి వారిస్తున్నారని వ్యంగ్యాలు చేశారు.

# జూనియర్ ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలు దుర్మార్గం

### - నందమూరి హరికృష్ణ సతీమణిని అవమానిస్తే చర్యలుండవా?

### - వైఎస్సార్సీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త బ్యూరో)** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అనంతపురం జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అసభ్యంగా మాట్లాడిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను చంద్రబాబు మందలించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తూ నందమూరి హరికృష్ణ సతీమణిని అవమానిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీ ఎమ్మెల్యేల అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి. టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు బరితెగించి మహిళల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం, వ్యవహరించడం చూస్తున్నాం. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ పైన దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని ప్రోత్సహిస్తూ, పైకి మాత్రం వారిపై ఆగ్రహంతో ఉన్నట్లుగా నటిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లి నందమూరి హరికృష్ణ భార్య. స్వర్గీయ ఎన్టీఆర్ కోడలు. నందమూరి బాలకృష్ణ, పురంధేశ్వరికి స్వయాన వదిన. అంటే నందమూరి కుటుంబానికి చెందిన మహిళపైనే, ఎన్టీఆర్ స్థాపించిన పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడు నోరు పారేసుకుంటే, పైపై మందలింపుల డ్రామాతో సరిపెట్టడానికి చంద్రబాబు ఎందుకు తంటాలు పడుతున్నారు. మీ సతీమణి భువనేశ్వరిపై ఎవరో వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున యాగీ చేసిన చంద్రబాబుకు, తన సోదరి వరస అయ్యే హరికృష్ణ సతీమణి పై సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎందుకు సీరియస్ గా తీసుకోవడం లేదు? నేను కొట్టినట్టు కొడతా.. మీరు ఏడ్చినట్టు ఏడ్వండి అన్న చందాన చంద్రబాబు తీరు ఉంది. నాలుగైదేళ్ల కిందట సోషల్ మీడియాలో మహిళల పట్ల పోస్టులు పెట్టారంటూ రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో సోషల్ మీడియా యాక్టివిస్టులను వెదికి వెదికి పట్టుకుని, జైళ్ళ పాలు చేశారు. మరి మీ పార్టీలోనే ఎమ్మెల్యేలుగా ఉన్న వారు, మీ కుటుంబంలోని ఒక మహిళ పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎందుకు కఠినంగా స్పందించడం లేదో చంద్రబాబే చెప్పాలి. సీఎం అండతోనే టీడీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోతున్నారు అని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సాటి నటుడిగా పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఎమ్మెల్యే టిక్కెట్ల కోసం చంద్రబాబుకు, నారా లోకేష్‌కు కోట్ల రూపాయలు ఇచ్చాం... ఇప్పుడు సంపాదించుకోవడం మా హక్కు అని టీడీపీ ఎమ్మెల్యేలు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉండే అనంతపురంలో కూటమి ప్రభుత్వ వచ్చాక అరాచకాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు పెచ్చు మీరాయన్నారు. ఇటీవల అనంతపురంలో మైనార్టీకి చెందిన మహిళను దగ్గుపాటి అసభ్యంగా దూషించారని తెలిపారు. ఇంటి స్థలానికి సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

# వరలక్ష్మిగా అనుగ్రహించిన కనకదుర్గమ్మ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 22, ప్రభాతవార్త** శ్రీ దుర్గామలేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాల సందర్భంగా రెండు బ్యాచ్‌లుగా నిర్వహించబడిన ఈ వ్రతాలు ఉదయం 7 గంటల నుండి 9 వరకు రు.1500 రుసుముతో ఆర్జిత సేవగాను, ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు ఉచితంగాను ఘనంగా నిర్వహించామని, ఈ రెండు బ్యాచ్‌ల వ్రతాల్లో పాల్గొన్న వారికి కుంకుమ, జాకెట్ ముక్క, శ్రీ అమ్మవారి ప్రసాదం, శక్తి కంకణం అందించామని ఈవో వికె శీనా నాయక్ తెలిపారు. వ్రతానంతరం మహిళ భక్తులకు అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఏలూరు న్యూ అశోక్‌నగర్‌కు చెందిన పి శ్రీరామ్ సీతారామయ్య ప్రియాంక దంపతులు త్రిలోక్య ఆర్య పేరు మీద రు.1,00,000/-ల విరాళాన్ని నిడమానూరు రామాలయం వీధికి చెందిన శివరామకృష్ణ ప్రసాద్ జేష్ట దంపతులు రూ.1,00,005/-లు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం, అమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.



వరలక్ష్మిగా కొలువైన దుర్గమ్మ



దాతలకు దుర్గమ్మ జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం


# మైపాడుకు కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి

### - టూరిస్టుల భద్రత కోసం బీచ్‌లో లైఫ్ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం :ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**గఇందుకూరుపేట, ఆగష్టు 22, ప్రభాతవార్త** మైపాడు బీచ్‌ను ఒక సమగ్ర ప్రణాళికతో కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు సంకల్పమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మైపాడులో నిర్వహించిన బీచ్ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మైపాడు బీచ్ అభివృద్ధికి సంబంధించిన కార్యచరణపై జిల్లాకలెక్టర్, టూరిజం అధికారులతో ఆమె చర్చించారు. అనంతరం బీచ్ సమీపంలో నిర్మిస్తున్న బంగారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించి ద్వార బందర ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మైపాడు బీచ్ సమీపంలో ఉన్న ఉప్పు కాలువలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పీ 4 కార్యక్రమం ద్వారా సిల్ట్ క్లియరెన్స్ కు ముందుకు వచ్చిన స్థానికులను అబినందించారు. ఈ సిల్ట్ క్లియరెన్స్ చేయడం ద్వారా మత్స్యకారుల బోట్లు నేరుగా సముద్రంలో వెళ్లేందుకు రూట్ క్లియర్ అవుతుందన్నారు. దాదాపు 6 వేల మీటర్లు ఉన్న ఉప్పు కాలువలో కేరళ తరహా బోట్ రైడింగ్స్ నిర్వహించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. వీకెండ్స్ లో కుటుంబ సమేతంగా సరదాగా గడపాలంటే నెల్లూరు జిల్లాలో ఉన్న ఏకైక పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌ను అభివృద్ధి చేయాల్సిన అసవరం ఎంతైనా ఉందన్నారు. గతంలో పర్యాటకులు నెల్లూరు నుంచి మైపాడు బీచ్ చేరుకోవడానికి రోడ్డు మార్గం ప్రధాన అవరోధంగా ఉండేదని, గత ప్రభుత్వ హయాంలో కేవలం శిలాఫలకానికే పరిమితం అయి ఉన్న మైపాడు నెల్లూరు రహదారి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక కదలిక వచ్చిందని త్వరలోనే ప్రారంభోత్సవం చేసుకోబోతున్నామన్నారు. మైపాడు పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటల్స్, రిసార్ట్‌లు, హోమ్ స్టేలు, ఫుడ్ కోర్టులు వంటి సౌకర్యాల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. టూరిస్టుల భద్రత కోసం బీచ్‌లో లైఫ్ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మైపాడు బీచ్‌తో పాటు ఇందుకూరుపేట మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక ఇందుకూరుపేట మండలంలో లో ఓల్టేజి సమస్యను నివారించేందుకు కుడిత పాళెం వద్ద 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు సహాయ సహకారాలతో శంకుస్థాపన పరిమితం అయి ఉన్న ముదివర్తి- ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. పెన్నానదిపై ముదివర్తి- ముదివర్తి పాళెం కాజ్ వే నిర్మాణం పూర్తయితే ఇందుకూరుపేట- విడవలూరు మండలాల మధ్య ప్రస్తుతం గంటల్లో ఉన్న ప్రయాణ దూరం నిమిషాలకు చేరుతుందన్నారు.

# ఆగస్టు 25 నుంచి ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులు : మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ,ఆగస్టు22,,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు సంక్షేమంతోపాటు పారదర్శకంగా కొత్త సాంకేతికతతో ఆగస్టు 25 నుంచి ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానూరులోని సివిల్ సప్లైస్ భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శుక్రవారం వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సామాన్యుడిని ఆదుకునే విధంగా నిజాయితీతో పనిచేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేస్తుంటారని, ఆవిధంగా పనిచేస్తున్నామన్నారు. ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టామన్నారు. నాలుగు దశల్లో 1 కోటీ 45 లక్షల స్మార్డ్ కార్డుల పంపిణీ ఆయా రేషన్ కార్డుల దుకాణాల వద్దనే గ్రామ, వార్డు సచివాలయాల సహకారంతో పంపిణీ చేస్తున్నామన్నారు. 6,71,000 కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, 16,67,032 రేషన్ కార్డుల అప్లికేషన్స్ కి అప్రూవల్ ఇచ్చామని,కార్డుల జారీ నిరంతర ప్రక్రియని, ఆన్ లైన్ లో ధరఖాస్తుల ప్రక్రియ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. రేషన్ పంపిణీ 93 శాతానికి పెరిగిందన్నారు. రేషన్ డెలివరీ లో సర్వీసు పెరిగిందన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీకి సంబంధించి సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించామన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు సాంకేతికతను ఉపయోగించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారీ స్థాయిలో సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం దేశంలో బహుశా ఇదే మొదటిసారి అని అన్నారు. స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నంతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు, సేఫ్టీ కోసం క్యూఆర్ కోడ్, కస్టమర్ టోల్ ఫ్రీ నంబర్ కూడా ఉంటుందన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1967 కు ఎవరైనా ఎప్పుడైనా ఫోన్ చేయొచ్చన్నారు. 2 నెలలుగా స్మార్ట్ రేషన్ కార్డుల కసరత్తు చేశామన్నారు. చివరి మైలులో ఉన్న వ్యక్తికి కూడా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. స్మార్ట్ కార్డులు రాష్ట్రం నుంచి జిల్లాకు అక్కడ నుంచి మండలాలకు, మండలాల నుంచి ఆయా రేషన్ షాపులకు బాక్స్ ల్లో భద్రంగా క్యూఆర్ కోడ్ తో చేరుస్తామన్నారు. దీనివల్ల ట్రేస్ బులిటీ సులువుగా ఉంటుందన్నారు.

ఇప్పటికే ప్రతి నెలా దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన దాదాపు 16,73,000 మందికి రేషన్ ను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు.ఆగస్టు 25 నుంచి 9 జిల్లాల నుంచి ఉచిత స్మార్ట్ కార్డుల పంపిణీని ఆయా జిల్లాల్లో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పండుగ వాతావరణంలో ప్రారంభిస్తారన్నారు.

# తప్పులకు ఆస్కారం లేకుండా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

### రైతులకు ఇచ్చేముందు మరోసారి పూర్తి స్థాయి పరిశీలన : మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** గత ముఖ్యమంత్రి ఫోటోల పిచ్చితో తన బొమ్మను ముద్రించుకున్న పట్టాదారు పాస్ పుస్తకాల స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ఎటువంటి తప్పులకు అస్కారం లేకుండా పకడ్బందీగా సమాచారాన్నంతా క్షుణ్ణంగా పరిశీలించి ప్రింట్ చేయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖా మాత్యులు అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదని, ఇంతవరకు తప్పులతో ఒక్క పాస్ పుస్తకం కూడా ఇవ్వలేదని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని, ఇందు కోసం 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మంచి ఉద్దేశ్యంతో రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల్లో 50 శాతం పుస్తకాల్లో తప్పుల తడకలే ఉన్నాయంటూ ఒక పత్రికలో వచ్చిన కథనాల్లో.,ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వం కాలంలో హడావిడిగా చేసిన రీ సర్వే కారణంగా చాలా తప్పులు దొర్లాయని, వారిచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల్లోనూ ఆ తప్పులు ఉన్నాయని చెప్పారు. అయితే వీటిని సరి చేసేందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీ సర్వే జరిగిన 6688 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా 2 లక్షల 79 వేల అర్జీలు వచ్చాయని, వాటన్నంటినీ వంద శాతం పరిష్కరించామని చెప్పారు. అంతే కాక ఆ తర్వాత 17,600 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, వాటిల్లో వచ్చిన లక్షా 85 వేల అర్జీలను పరిష్కరించామని చెప్పారు.

# స్థానిక ఎన్నికలకు ముందే పదవులు పంచాలి

## నేడు పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశం



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో బిసి రిజర్వేషన్, పదవుల పంపిణీ వంటి అంశాలు ఉత్కంఠ రేపుతోంది. హైదరా బాద్ గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం ఏఐసిసి వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రు లు, కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తదుపరి కార్యాచరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి అని ప్రభుత్వం చూస్తుండగా ఆర్డినెన్స్ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ కూడా న్యాయ సలహా కోసం పంపడంతో అది కూడా పెండింగ్‌లోనే ఉంది. కాగా స్థానిక ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన గడువు సెప్టెంబరు 30 సమీపి స్తుండగా.. ఎన్నికలపై ఏం చేయాలా అని ప్రభుత్వం ఆలోచనలో పడింది. రిజర్వేషన్ల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేపట్టాలా వద్దా? ఒక వేళ ఎన్నికలకు వెళ్లాలనే భావి స్తే రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వాలా లేదా మరేదైనా మార్గం చూడాలా అనే విషయంలో పార్టీలోని మెజార్టీ నేతల అభిప్రాయం మేరకు నిర్ణయించ బోతున్నారు. దీంతో శుక్రవారం సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే పిసిసి సమావేశం ముగిశాక ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగబోతు న్నది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు, రిజర్వేషన్ల విషయంలో అధికార పక్షం తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌పై యాదవ సామాజికవర్గ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమకు పదవుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, 5 కార్పొరేషన్ ఛైర్మన్లు, 5 డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వా లని డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైన్ షాపులలో ఎస్సీ, ఎస్టీ, గౌడ్స్‌తోపాటు బీసీలకు 30 శాతం రిజర్వే షన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# మట్టి గణనాథుల పంపిణీకి 34 కేంద్రాలు ఏర్పాటు చేసిన హెచ్‌ఎండిఏ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో మొదలు కానున్నాయి. అయితేపర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులను వాడొద్దని, మట్టి గణపతులనే పూజించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండిఏ) పిలుపు నిచ్చింది. పర్యావరణహిత వినాయకులను పూజించాలని పిలుపునివ్వడమే కాదు, ప్రతియేడులాగే ఈ యేడాది కూడా వేలాది మట్టి గణపతులను భక్తులకు ఉచితంగా పంచేందుకు సిద్ధం అయింది. నగరంలో పలు కేంద్రాల్లో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించింది. దాదాపు 34 కేంద్రాల్లో ఈ మట్టి గణపతులు పంపిణీ పూర్తిగా ఉచితం అని పేర్కొంది. నగరవ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో ఈనెల 24, 25, 26 తేదీల్లో లక్ష వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపింది.

# యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 సర్వీస్ రోడ్ల పనులు పూర్తి చేయాలి

## కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వరంగల్ ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 22:** కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఢిల్లీలో శుక్రవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి- వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవేను నాలుగు లైన్లుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ కేంద్ర మంత్రికి వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘనపూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా, జనగాం నుంచి ఈ గ్రామాల మధ్యలో లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దీంతో గ్రామాల వాహనాలు నేరుగా ప్రధాన హైవేపైకి రావడం వల్ల రద్దీ పెరుగుతోందని, ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని ఎంపీ కడియం కావ్య తెలిపారు. నాలుగు లైన్ల సమయంలోనే అవసరమైన భూమి సేకరించారని, ఇప్పుడు కేవలం నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎంపీ డా.కడియం కావ్య కేంద్ర మంత్రిని కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని పరిశీలిస్తానని, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారని ఎంపీ కావ్య తెలిపారు.

# పాత పెన్షన్ సాధించే దాకా పోరాడుదాం

## ఉపాధ్యాయులతో టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పాతపెన్షన్ విధానం సాధించే వరకు పోరాడుదామని నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులతో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి.. పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు జరిగే పోరాటంలో ప్రతీ ఉపాధ్యాయుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూటీఎస్ నేతృత్వంలో పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాల్లోని టీచర్లకు ఫోన్ చేసి ఆయన నేరుగా మహాధర్నా ఆవశ్యకతను వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడిని పాత పెన్షన్ కోసం చేపట్టే ఆందోళన వైపు నడిపించాలని సూచించారు. సిపిఎస్ రద్దు కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, ఈసారి తమ గళాన్ని గట్టిగా విన్పించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. జిల్లా బాధ్యుల నుంచి ఫోన్లు అందుకున్న టీచర్లు ఇతర ఉపాధ్యాయులతో మహాధర్నా అవసరాన్ని ఫోన్ ద్వారా వివరిస్తారని శ్రీపాల్ తెలిపారు. గ్రామ స్థాయి ఉపాధ్యాయుల వరకూ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తీసుకెళ్తున్నట్టు ఎమ్మెల్సీ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ నేతలు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమభవన్ ముందు ధర్నాకు దిగిన ఆర్.కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.

# ఫీజు బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

## ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

## మహాధర్నాలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉదృతం చేస్తామని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ విధానాన్ని నీరుగారిచే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముందు మహాధర్నా కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నినాదాలతో సంక్షేమ భవన్ దద్ద రిల్లింది. మహా ధర్నాలో ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువు కోసం ఎంతగానో ఉప యోగపడే స్కాలర్షిప్ పథకానికి ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నామని గొప్పలు చెప్ప డం తప్ప అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపిం చారు. గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. కార్య్ర కమంలో గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, నందగోపాల్, ప్రీతం, సుధాకర్, చంద్రశేఖర్, రాజేందర్, లింగయ్య, రాఘవేందర్, మణికంత, నరసింహ గౌడ్, ఉమేష్‌రాకేష్, అరవింద్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఇచ్చిన పార్టీని చులకన చేయడం తగదు

## కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ నేడు కెటిఆర్‌కు చిల్లర పార్టీ అయిందా, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన నేతలు ఉన్న పార్టీని చులకన చేయడం తగదని అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడతూ అసలు ఇన్నాళ్లు కల్వకుంట్ల కుంటుంబం రాజకీ యాల్లో కొనసాగుతున్నారంటే తమ పార్టీ పెట్టిన భిక్షేనని అన్నారు. నాడు సోనియాగాంధీ ఇంటికి వెళ్లి కలిసినప్పుడు ఏం అనిపించ లేదా సెటైర్లు వేశారు. కెసిఆర్, కెటిఆర్ వెలిగిపోవడానికి కారణం కాంగ్రెస్ అన్న విషయం గుర్తు పెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కెటిఆర్ వ్యక్తిత్వం లేని వాడని అన్నారు. ఇంకా ఆయనకు రాజకీయ పరి పక్వత రావాల్సి ఉందని తెలిపారు. నిండు అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియాగాంధీ అని చెప్పిన విషయం మరిచారా అని గుర్తు చేశారు. కాంగ్రెస్‌పార్టీ థర్డ్ క్లాస్ పార్టీ అయితే.. కెటిఆర్ అయ్య కూడా అదే థర్డ్‌క్లాస్ వ్యక్తి అంటూ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 33 బాటిళ్ల డిఫెన్స్ మద్యం పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో బేకర్ దుకాణం. మరో పక్క బ్యాంకుల్లో రుణాలు కావాల్సిన వారికి రుణాలు ఇప్పిం చడం చేస్తున్న జి.సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా డిఫెన్స్ మద్యం బాటిళ్లను అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సమా చారం అందుకున్న మహబూబ్‌నగర్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కవిత, ఎస్సై రాజేందర్,

సిబ్బంది కలిసి సుదర్శన్‌రెడ్డి ఇంట్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 33 డిఫెన్స్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టు కున్న మద్యం విలువ రూ. 1.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. డిఫెన్స్ క్యాంటిన్‌లో నెలవారి కోటా కింద తీసు కునే మద్యం బాటిళ్లను తక్కువ ధరలకు సేకరిస్తూ ఉంటాడు. డిఫెన్స్ బాటిళ్లు అంటూ ఎక్కువ ధరలకు అమ్మ కాలు జరుపుతూ సొమ్ము చేసు కుంటున్న సుదర్శన్‌రెడ్డిని అరెస్టు చేశారు.

# వివిధ సెట్స్ ప్రవేశాల్లో బేషరతుగా అడ్మిషన్స్ కల్పించాలి

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఎబివిపి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సెట్స్‌కి సంబంధించిన అడ్మిషన్స్‌లో ఎలాంటి షరతులు లేకుండా చూడాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు శుక్రవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అంద చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గసభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు దృహన్, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐ సెట్, ఎడ్ సెట్, లా సెట్‌కి సంబంధించిన ప్రవేశాలు జరుగు తున్న తరుణంలో కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపి సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని రాంబాబు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సర్టిఫికెట్స్ ఇవ్వాలంటే మొత్తం ఫీజు విద్యార్థులే కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యకనతం చేశారు. విద్యార్థులు వారు గతంలో చదివిన కళాశాలల నుండి కస్టోడియన్ సర్టిఫికెట్ తీసుకొచ్చినప్పటికి కూడా అడ్మిషన్ పొందిన ప్రస్తుత కళాశాలలు వాటిని అంగీకరించట్లేదన్నారు. ఈ కారణాల వల్ల అడ్మిషన్ వచ్చిన విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ర్యాంక్ సాధించినప్పటికీ ఇలాంటి కారణాల వల్ల విద్యార్థులు ఉన్నత కోర్సుల్లో అడ్మిషన్ పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడమేనని రాంబాబు విమర్శించారు. ప్రభుత్వ తప్పులకు విద్యార్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. కాబట్టి ఎలాంటి షరతులు లేకుండా అడ్మిషన్స్ చేసుకోవాలని కాలేజీలు, యూనివర్సిటీలను ఆదేశించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# ఐసెట్ కౌన్సెలింగ్‌కు 13,056 మంది దరఖాస్తు

## మొదటి రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 2992 మంది హాజరు

## 25 నుంచి వరకు వెబ్ ఆప్షన్లు.. సెప్టెంబరు 2న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 13,056 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కాగా.. మొదటి రోజు 2992 మంది హాజరయ్యారు.

ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# ఉన్నతాధికారులకు బదలీలు.. మాకు సస్పెన్షన్‌లా?

## ఆందోళనకు సిద్ధమవుతున్న అర్చకులు, పూజారులు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేవాలయాల్లో పనిచేసే అర్చకులు, పూజారులు బయట ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడాదనే దేవాదాయ శాఖ ఉత్తర్వులను వ్యతిరిక్తి ఆందోళనలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఎవరో ఒకరు ఇద్దరు చేస్తున్న పనిని దృష్టిలో ఉంచకుని ఈ విధంగా పూజారులు, అర్చకులను కించపరిచే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదంటు న్నారు. తాము ఆహర్నిషలు కృషించి దేవాల యాల అభి వృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి తమను అవమా నిస్తోందని మండి పడుతున్నారు.

తమ పూజాపునస్కారాలతో ఉదయం లేచి ఆ భగవంతుని సేవలో తరిస్తూ అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుని ప్రార్థి స్తున్నామన్నారు. ఎటువంటి సెలవులు, వారాంత రపు సెలవులు లేకుండా పని చేస్తున్న తమపై ఇటువంటి బలవంతపు ఉత్తర్వులు సరికాదం టున్నారు. పుణ్యదినాలు, పండగ రోజుల్లో తాము ఎటువంటి విరామం విసుగు లేకుండా పని చేస్తున్నామని, పండగ రోజుల్లో ఉదయం 3.30 గంట లకు లేచి దేవాలయాన్ని శుభ్రం చేసుకొని పూజా కార్యకమ్రాలు అనంతరం మరోసారి దేవాలయాన్ని పరిశుభ్రం చేసుకుని కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్న తమ శ్రమను గుర్తించకుండా ఇటువంటి అర్ధంపర్థం లేని ఉత్తర్వులతో తము ఇబ్బంది పెట్టడమే అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్త లోకోసుఖినో భవంతు: అని భావించి తాము భక్తులను దీవిస్తామని, దీని వెనుక ఎటువంటి ఉద్దేశ్యాలు ఉండవని లేనిపోనివి అభాండాలు, మాకు ఆపాదించి భగవంతునికి భక్తునికి అనుసంధా నంగా ఉండే మమ్మల్ని అవమానించడం కాక మరేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేపడుతుండటంతో ఆయా ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుండటంతో ఆలయాలకు కూడా పెద్ద మొత్తంలో కానుకలు, ఇతర రూపాల్లో ఆదాయం కూడా భారీగా పెరుగుతోందంటున్నారు. ఒక వైపు ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతూ మరో వైపు ఆ దేవుళ్ళన్న నమ్ముకుని వారినే ఆరాధిస్తున్న జీవితాలను గడుపుతన్న మమ్మల్ని ఈ నూతన ఉత్తర్వులు ఎంతో కృంగదీయడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోగులాం గద్వాల్ దేవాలయంలో నూతన ఉత్తర్వులు ప్రకారం ఇద్దరి అర్చకులను సస్పెండ్ చేసి, ఇఒను మాత్రం బదిలీ చేయడం ఎంతవరకు సబబుని వారి ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు అధికారులకు ఒకలా అర్చకులు, పూజారులకు మరోలా ఉండవని కానీ ప్రభుత్వం ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులను ఒకలా అర్చకులను, పూజారులను మరోలా చూస్తూ పక్షపాత ధోరణి అవలంబిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి నిబంధనల పెట్టి వేద మంత్రోచ్చరణ చేసే తమ నోర్లు మూయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేసేందుకు కూడా వెను కాడమని ఆయా సంఘాల నేతలు హెచ్చరి స్తున్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సిపిఐ సిద్ధం కావాలి

## పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి





గాజులరామారంలో జరిగిన రాష్ట్ర సిపిఐ నాలుగో మహాసభ మూడోరోజు సమావేశంలో ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి.

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఆగస్టు 22, ప్రభాత వార్త:** ప్రజాసమస్యల పరిష్కారంకోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో ప్రాతినిత్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం పొట్లూరి నాగేశ్వరరావు నగర్ లోని కామ్రేడ్ ఎన్.బాల మల్లేశ్ హాలు (మహారాజా గార్డెన్స్)లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాలుగవ మహాసభల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

భూమి కోసం, భుక్తికోసం వెట్టిచాకిరీ విముక్తికోసం పోరాడిన కమ్యూనిస్టుపార్టీ వద్దకు వెళితేనే తమకు ఇంటిస్థలం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో నిలిచిఉంటడం తమపార్టీ గొప్పదనమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ఉధ్యమాలే ఊపిరి అని ఉధ్యమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉధ్యమించి ప్రజాప్రతినిధులుగా గుర్తింపుకోసం నినంతరం శ్రమించాలన్నారు. మతోన్మాద ఆర్.ఎస్.ఎస్ మద్దతుతో బిజెపి గత 11ఏళ్లుగా డిల్లిలో ఎర్రకోటపై జాతీయజెండాను ఎంతో దురష్టకరమన్నారు.

బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విదానాలకు వ్యతిరేకంగా బిజెపి హఠావో దేశ్‌కు బచావో నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేశ్ ప్రసంగించారు. మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్, సమావేశానికి జిల్లా నలుమూడల నుండి భారీగా మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ పరిశ్రమల ట్రేడ్‌యూనియన్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ప్రాంగాణమంతా ఎర్రరంగు పులుకున్నతీరుగా మారింది.


# ఎఫ్‌సెట్ ఇంటర్నల్ స్లైడింగ్‌లో 3,590 సీట్ల కేటాయింపు

## నేడు కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలి.. 9,419 మంది వెబ్‌ఆప్షన్లు

## ఇంటర్నల్ స్లైడింగ్ అనంతరం 85 శాతం సీట్ల భర్తీ.. 13,453 సీట్లు ఖాళీ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంట ర్నల్ స్లైడింగ్ వెబ్ ఆప్షన్లు ముగియగా శుక్రవారం సీట్ల కేటాయింపు చేపట్టారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో భాగంగా 9419 మంది తమ బ్రాంచ్‌లను మార్చుకోవడం కోసం 9419 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 3590 మందికి సీట్లను కేటాయించారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు నేడు(శనివారం) కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 97,369 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు.

రాష్ట్రంలో 180 కాలేజీల్లో 90,246 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నా యి. వాటిలో ఇంటర్నల్ స్లైడింగ్ పూర్తయ్యే నాటికి 76,793 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ తెలిపారు. మొత్తం కన్వీనర్ సీట్లలో 85.1 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కోస్గిలోని గవర్నమెంట్ కాలేజీలో 198 సీట్లకి 49 సీట్లు భర్తీ కాగా మరో 149 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీ కాలేజీలు 21 ఉండగా వాటిలో 6440 సీట్లకిగాను 4482 సీట్లు భర్తీకాగా.. మరో 1958 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లు ఉంటే.. వాటిలో 1340 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 82,222 సీట్లు ఉండగా.. వాటిలో 70,922 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా కన్వీనర్ కోటాలో 90,246 సీట్లు అందుబాటులో ఉంటే 76,793 సీట్లు భర్తీకాగా.. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నాయి.



ధర్నాలో నినాదాలు చేస్తున్న రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

# రేషన్ డీలర్ల హామీలను అమలు చేయాలి

## డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ఇచ్చిన అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కనీస గౌరవవేతనం ఐదు వేల రూపాయలు, 300 రూపాయల కమీషన్ పెంపును తక్షణమే ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ నుండి ఆగస్ట్ వరకు రావల్సిన ఐదు నెలల కమీషన్‌ను వెంటనే ఇప్పించి, రేషన్ డీలర్ల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ షాపులను మిని సూపర్‌మార్కెట్‌లుగా గుర్తించి, మరిన్ని నిత్యావసర సరుకులను పేదప్రజలకు అందుబాటులోకి తేవాలని, రేషన్‌డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే భరించాలని, పాత బకాయిలను చెల్లించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మండ్లు మా ట్లాడుతూ గోదాం ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, పోర్టబిలిటీ సిస్టం వచ్చినందున రేషన్‌కార్డుల బైఫర్గేషన్ విధా నాన్ని నిలుపుదల చేసి, కొత్తషాపుల ఏర్పాటు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 324

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 324 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 74దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 57దరఖాస్తులు, హోంశాఖకు సంబంధించి 26 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

23-08pg10 12 ONG_23-08pg10.qxd 8/22/2025 10:19 PM Page 1



# మహిళల ప్రపంచకప్ టీమ్ ఖరారు




## అమన్‌జోత్ ఎంట్రీ
## షెఫాలీకి దక్కని చోటు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరగనున్న మహిళల ప్రపంచకప్ కోసం టీమ్‌ఇండియా సభ్యుల పేర్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. స్వదేశంలో జరగనున్న ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో కూడిన జట్టును కూర్పు చేసింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే ఈ టీమ్‌లో లేడీ సెహ్వాగ్, స్టార్ ఓపెనర్ షెఫాలి వర్మకు షాక్ తగిలింది. వన్డే ప్రపంచకప్ సహా ఆస్ట్రేలియా సిరీస్‌కు సైతం ఎంపిక కాలేదు. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో షఫాలీ ఇండియా జట్టులో భాగమైంది. కానీ ఆమె ఆడిన గత మూడు వన్డే మ్యాచ్‌లతో సహా ఆరు వైట్‌బాల్ మ్యాచ్‌లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో షఫాలీ వర్మను పక్కన పెట్టనట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో సత్తా చాటిన ప్రతీక రావల్పై సెలక్టర్లు నమ్మకముంచారు. పేసర్ రేణుక సింగ్ జట్టులో పునరాగమనం చేసింది. మరో పేసర్ క్రాంతి గౌడ్ జట్టులో స్థానం సంపాదించింది. టీమ్ విషయాని కొస్తే అంచనాలకు తగ్గట్టుగానే జట్టు కూర్పు జరిగినట్లు తెలుస్తోంది.

ఆల్ రౌండర్ అమన్‌జోత్ కౌర్ ప్రస్తుతం గాయపడి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటోంది. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. వరల్డ్ కప్ కోసం ఆమె ఫిట్‌గా అవుతుందని భావిస్తున్నట్లు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ చెబుతోంది.

ఇక ప్రపంచ కప్‌తో పాటు, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత మహిళా జట్టును కూడా బిసిసిఐ ప్రకటించింది. అయితే ప్రపంచకప్ జట్టుతో పోలిస్తే ఆస్ట్రేలియా సిరీస్‌లో జట్టులో ఒకేఒక్క మార్పు జరిగింది.

సయాలి సత్ఘారే ఈ సిరీస్‌కోసం జట్టులో చేర్చారు. మహిళల ప్రపంచ కప్ కోసం ఎంపిక చేసిన టీమ్‌ఇండియా జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా. రిజర్వ్ ప్లేయర్స్‌గా తేజల్ హసబ్నిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా చెత్రీ, మిన్ను మణి, సయాలి సత్ఘారేను ఎంపిక చేశారు.



## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# ఎలావెనిల్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీలో భారత ఒలింపియన్ ఎలావెనిల్ వలరివన్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించింది. కజికిస్తాన్‌లో శుక్రవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వలరివన్ స్వర్ణం సాధించి జాతీయ రికార్డు సృష్టించింది. జకార్తాలో జరిగిన 2024 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన తర్వాత, ఈ తాజా విజయం ఆమె కాంటినెంటల్ ఈవెంట్‌లో వరుసగా రెండవ వ్యక్తిగత పతకాన్నిసాధించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల ఈ అమ్మాయి ఫైనల్లో అద్భుతమైన సంయమనాన్ని ప్రదర్శించింది, 253.6 పాయింట్లతో అద్భుతమైన స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ అద్భుతమైన స్కోరు కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ఆమెతో పాటు చైనాకు చెందిన పెంగ్ జిన్లు రజత పతకం, దక్షి ణ కొరియాకు చెందిన క్వాన్ యున్‌జి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఇక ఈ పోటీలో ఉన్న మరో భారతీయురాలు మెహులి ఘోష్ ఎనిమిది షూటర్ల ఫైనల్లో 208.9 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచింది. ఆమె మొదట 10వ స్థానంలో నిలిచింది. కానీ ఇద్దరు ఉన్నత స్థానంలో ఉన్న భారతీయ షూటర్లు, ఆర్య బోర్సే, సోనమ్ మస్కర్ ర్యాంకింగ్ పాయింట్ల కోసం మాత్రమే పోటీ పడుతున్నందున పక్కకు తప్పుకోవడంతో ఫైనల్‌కు చేరుకుంది. ఎలావెనిల్, మెహులి ఘోష్ మరియు నాయుడు అనన్య త్రయం టీమ్ ఈవెంట్‌లో 1891.0 స్కోరుతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల అనధికారిక టెస్ట్‌లో..
# భారత్ ముందంజ
### 141 రన్స్ వెనుకబడిన ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడటంతో 300కు ఒక్క పరుగు తక్కు వద్ద ఆలౌట్ అయింది. బ్రిస్బేన్‌లో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 5 వికెట్లనష్టానికి 158 పరుగులకే పరిమితమైంది. వర్షం కారణంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లకు 72 పరుగులకు పరిమితమైన భారత్ కష్టాల్లో పడింది. కానీ ఓవర్ నైట్ 26 పరుగులతో ఉన్న బిస్ట్, మొదట రాధా యాదవ్ (33)తో 6 వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకుంది. తర్వాత మిన్ను మణి (28)తో కలిసి 75 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను ఇబ్బందుల నుండి గట్టెక్కించింది. భారత ఇన్నింగ్స్ 63వ ఓవర్లో మీడియం పేసర్ మైట్లాన్ బ్రౌన్ ఆమెను క్లీన్ అవుట్ చేసి మణిని కూడా ఔట్ చేసింది. కానీ జోషిత, టైటాస్ సాధు (23) 9వ వికెట్‌కు 75 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని పంచుకున్నారు, తద్వారా భారత్ 300 పరుగులమార్కును చేరుకుంది. జోషిత ఆఫ్‌స్పిన్నర్ లిల్లీ మిల్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయింది. ఆస్ట్రేలియా తరఫున మీడియం పేసర్లు జార్జియా ప్రెస్ట్‌విడ్జ్ (3/37) మరియు బ్రౌన్ (3/65) తమ మధ్య 6 వికెట్లు పంచుకున్నారు. ఇక ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఇండియా తరఫున మీడియం పేసర్ సైమా ఠాకూర్ (2/21), ఎడమచేతి వాటం స్పిన్నర్ రాధా (2/40) చెరో 2 వికెట్లు పడగొట్టగా, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్‌గా సాధు (1/27) రాణించింది. కెప్టెన్ తహిలా విల్సన్ 49పరుగులు చేయగా, రాచెల్ ట్రెనామన్ (21)తో కలిసి ఓపెనింగ్ భాగస్వామ్యానికి 46 పరుగులు జోడించింది. స్టంప్స్ వద్ద, వికెట్ కీపర్ నికోల్ ఫాల్టమ్ (30 నాటౌట్), సియానా జింజర్ (24 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా భారత్ కంటే 141 పరుగులు వెనుకబడి ఉంది.

## విన్‌స్టన్ సేలం ఓపెన్‌లో..
# రోహన్ బోపన్న జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** విన్‌స్టన్‌సేలం ఓపెన్-2025, పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ జంట రోహన్ బోపన్న-రొమైన్ ఆర్నియోడో ద్వయాన్ని ఓడించింది. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన ఎటిపి 250 టోర్నమెంట్, 25వ విన్స్టన్‌సేలం ఓపెన్‌లో భారత స్టార్ ఆటగాడు యుకీ భాంబ్రీ మరియు అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. 1 గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో ఈ జంట ఇండోమోనెగాస్క్ జంట రోహన్ బోపన్న మరియు రొమైన్ ఆర్నియోడోపై వరుస సెట్లలో (76(2), 6 3) విజయం సాధించింది. వరుసగా మూడు టోర్నమెంట్లలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన రెండో సీడ్ ఇండోన్యూజిలాండ్ జోడీకి ఇది ఈ ఏడాది తొలి సెమీఫైనల్ అవుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో, రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంలో సవాళ్లను ఎదుర్కొంటూ తీవ్రంగా పోరాడారు. మొదటి సెట్‌లో ప్రతి ఒక్కరూ రెండు బ్రేక్‌లు ఇవ్వడంతో, టైబ్రేకర్‌కు దారితీసింది, అక్కడ రోహన్, రొమైన్ 2-7 తేడాతో ఓడిపోయారు. ఇండోకివీ ద్వయం రెండవ సెట్ ప్రారంభంలో ఇబ్బంది పడింది, మొదటి గేమ్‌లో బ్రేక్ కోల్పోయింది, కానీ అద్భుతంగా పుంజుకుంది, తరువాతి గేమ్‌లలో రెండు బ్రేక్‌లు సాధించి వరుస సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## మహిళల ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ విజయం
### బంగ్లాదేశ్ 2-0 తేడాతో ఓటమి


**న్యూఢిల్లీ:** మహిళల ఛాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో భారత్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో జరిగిన శాఫ్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి 2-0 తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. పెర్ల్ ఫెర్నాండెజ్ మరియు ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ యంగ్ టైగ్రెస్సెస్‌కు గోల్స్ చేశారు. ఈ విజయంతో, భారతదేశం ఆరు పాయింట్లను సాధించి పట్టికలో అగ్రస్థానంలో తన స్థానాన్ని సుస్థిరంచేసుకుంది. పెర్ల్ ఫెర్నాండెజ్ (13 నిముషం) మధ్యలో బలమైన పరుగుతర్వాత స్కోరింగ్‌ను ప్రారంభించింది. 75వ నిమిషంలో ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ అలీషా లింగ్డో కార్నర్ నుండి అద్భుతమైన వాలీని కొట్టడంతో యంగ్ టైగ్రెస్‌లు తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేశారు. 14వ నిమిషంలో, సెంటర్‌బ్యాక్ దివ్యని లిండా డీప్ నుండి స్ఫూర్తిదాయకమైన పరుగు చేసి బంతిని తీసుకొని మిడ్‌ఫీల్డ్ గుండా వెళ్లింది. డిఫెండర్లు ఆమెపైకి చేరుకోవడంతో, ఆమె తెలివిగా దానిని పెర్ల్‌కు అందించింది, ఆమె బాక్స్ అంచున గుర్తు లేకుండా మిగిలిపోయింది. బంగ్లాదేశ్ కీపర్ ఇయర్జాన్ బేగం బంతిని కొట్టినప్పటికీ, ఆమె దానిని ఆపలేకపోయింది. రెండవ అర్ధభాగం కూడా ఇదే లయను అనుసరించింది, భారత్ ఆటను నియంత్రించింది. ఇక బాంగ్లాదేశ్ ఆల్పి అక్టర్ భారత గోల్ కీపర్ మున్నీ ఒత్తిడి తెచ్చినా ముందుకు సాగలేకపోయారు.

## భారీ నష్టాల్లో సూచీలు



**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. జాక్సన్‌హక్షల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చీఫ్ వడ్డీరేట్లపై ఎలాంటి ప్రకటన చేయబోతున్నారనే దానిపై ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. అయితే దీనికి తోడు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 25శాతం పన్నుల భారం ఆగస్టు27 నుంచి అమలుచేయనున్నారు. గడువు దగ్గర పడుతుండడంతో వారాంతంలో మార్కెట్ సూచిలు నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ సుమారు 700 పాయింట్ల మేర నష్టపోగా..నిఫ్టి మళ్లీ 25వేల స్థాయిలో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,951,48 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమయింది. రోజంతా నష్టాలతోనే సాగింది. ఇంట్రాడేలో 81,291,77 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకిన సూచి చివరకు 693.86పాయింట్ల నష్టంతో 81,306.85వద్ద స్థిరపడింది. నిఫ్టి 213.65 పాయింట్ల నష్టంతో 24,870,10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయ మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30సేచిలో ఏషియన్ పెయింట్స్ అల్ట్రాటెక్ సిమెంట్,ఐటిసి, టాటా స్టీల్, హెచ్‌సిఎల్, టెక్నిలజిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్ర అండ్ మహీంద్ర, మారుతి, సుజుకి, సన్‌ఫార్మా, బీఈఎల్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి.

## మ్యూచువల్ ఫండ్స్‌లో ఆరు కొత్త స్కీమ్‌లు




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారికి ఆయ ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల కొత్తగా ఆరు స్కీంలను అందుబాటులోకి తెచ్చాయి. ఈటిఎఫ్, ఫండ్ ఆఫ్ ఫండ్ వంటి కేటగిరీలతో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆయా కంపెనీలు పేర్కొన్నాయి. ఈక్విటీ పెట్టుబడుల ద్వారా హైరిటర్న్ అందుకోవచ్చనే కారణంతో చాలా మంది ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాన్ని బట్టి అనువైన ఫండ్స్ ఎంచుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగిస్తుంటారు. అయితే, చాలా మంది ఇప్పటికే అందుబాటులో ఉన్న పథకాలను గత చరిత్ర, పనితీరును బట్టి ఎంచుకుంటున్నారు. ప్రధానంగా మీరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన మీరే అసెట్ గోల్డ్ సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్, ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఆఫర్‌లు ప్రారంభమయ్యాయి. మొదటి స్కీమ్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉండగా.. అలాగే ఏంజెల్ వన్ ఫండ్ స్కీం సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతోంది. అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (డొమెస్టిక్)స్కీం గడువు ఆగస్టు 25 వరకు ఉంటుందని పేర్కొంది. అలాగే ఎడెల్వేయిస్ మల్టీ అసెట్ ఓమ్నీ ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీం ఆగస్టు 26 వరకు అందుబాటులో ఉంటుంది. ఆలోపు బిడ్లు దాఖలు చేసిన వారికి యూనిట్లు కేటాయిస్తారు. ఇప్పటికే ప్రముఖ ఏఎంసీ ఏంజెన్ వన్ మ్యూచువల్ ఫండ్ నుంచి గోల్డ్ స్కీమ్ వచ్చింది. ఇండెక్స్ ఫండ్ కేటగిరీలోకి వస్తే యాక్సిస్ నిఫ్టీ 500 ఈక్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్ ఉంది.

# రాపిడో టాక్సీకి రూ.10 లక్షలు జరిమానా

హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త: వినియోగదారులను ఆకర్షించేందుకు కంపెనీలు వినూత్నంగా ప్రకటనలు చేసి సొమ్ము చేసుకుంటారు. మాయమాటలతో వంచించే ప్రకటనలపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆథారిటీ (సిసిపిఏ) దృష్టిసారించింది. ఈ క్రమంలో రాపిడోపై చర్యలు చేపట్టింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని చెప్పి, ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రకటనను వెంటనే నిలిపివేయాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదేశించింది. అయితే రాపిడో ట్యాక్సీపై ఎన్నో ఫిర్యాదులు వెలువెత్తుతున్న నేపథ్యంలో తప్పు ప్రకటనపై రూ.10లక్షల జరిమాన విధించినట్లు వెల్లడించింది. కంపెనీ అందించే సేవలపై చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాడ్‌తో చాలా మంది ప్యాసింజర్లు రాపిడో ఆటో బుక్ చేసుకుంటున్నారు. అయితే 5 నిమిషాలు దాటినప్పటికీ ఒక్కరంటే ఒక్క ప్యాసింజర్ కు కూడా యాడ్ లో చెప్పినట్లు రూ. 50 రీఎంబర్స్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొంది. ఆలస్యమైతే డ్రైవర్లదే బాధ్యత కానీ, కంపెనీది కాదని షరతుల్లో ఉంది. ఇది కంపెనీ జవాబుదారీ నుంచి తప్పించుకోవడమే అవుతుందని వివరించింది. అదేవిధంగా చిన్నచిన్న అక్షరాల్లో

## వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల వ్యవహారం




సిసిపిఏ జరిపిన దర్యాప్తులో మరో విషయం వెలుగుచూసింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని ప్రకటనలో ఉంది. కానీ నిజానికి ఇది క్యాష్ కాదు, రాపిడో కాయిన్స్ అని ప్రకటనలో చిన్న చిన్న అక్షరాల్లో రాసి ఉంది. ఈ కాయిన్స్ ను కేవలం బైక్ రైడ్స్ కోసమే ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇవి కేవలం ఏడు రోజుల్లోనే గడువు ముగించి చెల్లకుండా ఉంటాయని తెలిపింది. ఇక 2023 ఏప్రిల్ నుంచి 2024 మే వరకు ఫిర్యాదుల సంఖ్య 575 గా ఉండగా, 2024 జూన్ నుంచి 2025 జులై వరకు ఫిర్యాదులు 1,224తో రెట్టింపు అయ్యాయని జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. చాలా మంది ప్యాసింజర్లు రాపిడో రీఫండ్ పేమెంట్ల విషయంలో ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ఎక్కువ ఛార్జీ వసూలు చేశారని, మరికొందరు సర్వీస్ లేదని వాపోయినట్లు పేర్కొంది.

## ఐదేళ్ల తర్వాత.. భారత్, చైనా వాణిజ్య కలాపాలు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్త తలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య ఒక కీలకమైన సానుకూల పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఐదేళ్ల తర్వాత హిమాలయ ప్రాంతంలోని మూడు కీలక వాణిజ్య మార్గాలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో వాణిజ్యంలో చైనా కంటే భారత్‌కే ఎక్కువ ప్రయోజన సరిహద్దు గ్రామాలు, టిబెట్ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం మెరుగ్గా ఉంది. ఈ మేరకు వాణిజ్య కేంద్రాలు తెరుచుకున్నాయి. ఈ నిర్ణయం సరిహద్దు ప్రాంతాల ప్రజలకు, టిబెట్ ఆర్థిక వ్యవస్థకు, ఇరు దేశాల సంబంధాలకు ఎంతో ప్రాధా న్యత సంతరించు కుంది. ఇటీవల ఢిల్లీలో పర్యటించిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన చర్చల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని షిప్కిలా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథూ లా పాస్‌ల ద్వారా వాణిజ్యం పునఃప్రారం భం కానుంది. ఈ మార్గాలు టిబెట్‌లోని షిగాట్సే, లాసా, నియింగ్చి వంటి ప్రాంతాలను భారత సరిహద్దు ప్రాంతాలతో కలుపుతాయి. 2020లో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఈ మూడు మార్గాలను మూసివేశారు. ఇరుదేశాల సైనికులమధ్య సరిహద్దుల్లోఘర్షణలు, సైనికప్రతిష్టంభన.

## వాణిజ్యం

# భారత్‌లో ఓపెన్ ఎఐ!




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్‌లో చాట్‌జిపిటి సంస్థ ఓపెన్ ఏఐ కార్యకలాపాలను త్వరలో విస్తరించనుంది. ఇందులో భాగంగా భారత్ రాజధాని ఢిల్లీలో ఏడాది చివరిలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తుంది. అయితే చాట్ జిపిటి వినియోగం గణనీయంగా పెరగడంతో నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య నిపుణుల వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్‌లో ఏఐకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఏఐ టీడర్‌గా ఎదిగేందుకు అవసరమైన అన్ని అంశాలు భారత్‌లో ఉన్నాయని గుర్తించింది. ప్రతిభ, ప్రపంచస్థాయి డెవలపర్ సిస్టం, ఇండియా ఐఏ మిషన్ ద్వారా బలమైన ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. తొలి కార్యాలయాన్ని ప్రారంభించి టిమ్‌ను నియమించి మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అందుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు తొలిమెట్టు. అయితే ఓపెన్ ఏఐ సిఈవో శామ్‌ఆల్ట్‌మన్ వెల్లడించారు. ఇదిలా ఉండగా భారత్ ఈ విషయాన్ని ధృవీకరించాల్సి ఉంటుంది. మరోవైపు ఓపెన్ ఏఐ ఇప్పటికే ఇండియా ఏఐ మిషన్ భాగస్వామి అయ్యేందుకు అంగీకరించింది. ప్రభుత్వం కోసం ఏఐ వ్యవస్థల నిర్మాణం జరుగుతుందని. దీంతో దేశంలో సేవలు అపారంగా విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ లక్షల మంది విద్యార్థులు, ఎడ్యుకేటర్లు, ప్రొఫెషనల్స్ డెవలపర్లు దీన్ని వాడుతున్నారు. చాట్‌పిజిటి డేటా ప్రకారం అమెరికా తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలిచిందని నిపుణులు పేర్కొంటున్నారు. యాక్టివ్ యూజర్ల సంఖ్య కూడా వారంలో నాలుగు రెట్ల వేగంగా పెరుగుతుందని చెబుతున్నారు. ఓపెన్ ఏఐలో మొదటి అయిదు డెవలపర్ల మార్కెట్‌లో, అంతేకాకుండా అత్యదిక విద్యార్థులు సైతం ఉన్నది భారత్ ఒకటిగా నిలిచింది.

# తెలంగాణలో త్వరలో హెలీ టూరిజం- హైదరాబాద్ నుంచి సోమశిల, శ్రీశైలం మధ్య సేవలు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** త్వరలోనే తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా హెలీ టూరిజం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గగనతలంలో కొద్దిసేపు విహరింపజేసి పర్యాటకులకు అహ్లాదాన్ని, అనుభూతిని కల్పించేందుకు హెలీ టూరిజం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడి నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు హెలి టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. దోంతో పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు. రూ. 68.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధి పనులకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో

## ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం - మంత్రి జూపల్లి

రూ. 45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు, రూ.1.60 కోట్లతో సోమశిల విఐపీ ఘాట్ - బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పర్యాటక ఆతిథ్యానికి తెలంగాణ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పర్యాటక ప్రాజెక్ట్‌లు చేపడుతోందన్నారు. టూరిజం అభివృద్ధికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత పదేండ్లలో టూరిజం నిర్లక్ష్యానికి గురైందని, స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మౌలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని, తద్వారా ఉద్యోగ కల్పనతోపాటు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయన్నారు. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజానికి పెద్దపీట వేస్తాం. అమరగిరి ఐలాండ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏడాది లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, నీటి ప్రవాహం తగిన, పర్యాటకులను ఐలాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త పర్యాటక ప్రాజెక్ట్ ల అభివృద్ధి వల్ల పర్యాటకుల సందర్శన మరింత పెరగనుందని, నల్లమల్ల అడవుల మధ్యలో కృష్ణా నది ఒడ్డున ఉన్న సోమశిల, అమరగిరి అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారని, తద్వారా టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగి ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమశిల సిద్దేశ్వరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే దూరాభారం తగ్గడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps